
J/NELLORE/003/24-26 R.N.I.No.25359/74 పేజీలు : 16

THE BEST TELUGU WEEKLY OF NELLOREANS




# లాయర్

సంపుటి : 44 సంచిక : 31 3.01.2025, శుక్రవారం వెల : రూ. 10/- వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి సంపాదకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి



● జలహారతితో జవసత్వాలు

## జలసంకల్పం

# బాబు భగీరథ యత్నం!

- రాష్ట్రంలో నీటి వనరుల అభివృద్ధిపై ప్రభుత్వం దృష్టి
- నదుల అనుసంధానం పేరుతో మహాయజ్ఞానికి శ్రీకారం
- తెలుగుతల్లికి జలహారతి కార్యక్రమం పూర్తయితే రాష్ట్రం సుభిక్షం
- 'సుజలాంధ్రప్రదేశ్' ఆవిష్కర్తగా చంద్రబాబుకి శాశ్వత కీర్తి

*దేవలోకంలో ఉన్న గంగమ్మను భూమిపైకి తీసుకొచ్చేందుకు నాటి భగీరథుడు యత్నిస్తే.. గోదావరమ్మ, కృష్ణమ్మను ఆంధ్రప్రదేశ్ అంతటా పారించి తెలుగునేలపై సిరుల పంట పండించాలని చంద్రబాబు సంకల్పించారు. ఇందు కోసం ఆయన పక్కా ప్రణాళికతో.. ఓ అనితరసాధ్యమైన కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. అదే 'తెలుగుతల్లికి జలహారతి'. ఇందులో భాగంగా మనరాష్ట్రంలోని ప్రధాన నదులను వాటి ఉపనదులను.. ప్రాజెక్టులతో అనుసంధానించి బొట్టు బొట్టునూ ఒడిసి పట్టి గట్టిమేలు తలపెట్టేందుకు సిద్ధమయ్యారు.*

*మొక్కవోని దీక్ష.. సడలని సంకల్పంతో ఈ బృహత్తర కార్యక్రమాన్ని పూర్తి చేస్తే.. శ్రీకాకుళం నుంచి చిత్తూరు వరకు సాగు, తాగునీటి కష్టాలు కనుమరుగు కావడమే కాకుండా భూగర్భజలాల వృద్ధి, పరిశ్రమల స్థాపన, మత్స్యసంపద, పర్యాటక రంగాల్లో అనూహ్య ప్రగతికి బాటలు పడినట్లే!*

ప్రాచీన కాలం నుంచి నదులన్నవి సంస్కృతి, నాగరికతలకు పునాదులు. అభివృద్ధికి జీవనాడులు. మానవ దేహానికి రక్తనాళాలు ఎంతముఖ్యమో.. దేశాభివృద్ధికి నదులు అంత ముఖ్యం అనడంలో అతిశయోక్తి లేదు. అయితే, ప్రస్తుతం ప్రపంచంలో చాలా నదులు కాలుష్యంతో కళతప్పి కనుమరుగయ్యే పరిస్థితులు నెలకొన్నాయి. ముఖ్యంగా విభిన్న వాతావరణ పరిస్థితులు, జీవవైవిధ్యం ఉన్న మన దేశంలో నదులే అత్యధిక శాతం ప్రజలకు

10లో

## ఆర్థిక సమ్మోహనుడు..

## మన మోహనుడు

# మహాభినిష్క్రమణం



***అం**పశయ్యపై ఉన్న భారత ఆర్థిక వ్యవస్థకు ఊపిరులూదిన మహామేధావి.. ఆర్థికవేత్తగా, ఆర్బీఐ గవర్నర్‌గా, ఆర్థిక మంత్రిగా, ప్రధానిగా దేశానికి అసమాన సేవలందించిన దిగ్గజనేత 'ఇక సెలవంటూ' భారతావనికి వీడ్కోలు పలికారు.*

డిసెంబర్ 26వ తేదీన మాజీ ప్రధానమంత్రి మన్మోహన్‌సింగ్ కన్నుమూశారు. ఆయన అంత్యక్రియలు ప్రభుత్వ లాంఛనాలతో ఢిల్లీలో నిర్వహించారు. ఈ క్రమంలో దేశం ఓ దిగ్గజాన్ని కోల్పోయిందని పలువురు నాయకులు వ్యాఖ్యానించారు. నిజానికి అందరూ దేశానికి రుణపడితే.. కొందరికే దేశం రుణపడి ఉంటుందన్నది నానుడి. దీన్ని అక్షరాల నిజం చేసిన మహనీయుడు మన్మోహన్‌సింగ్. 1991లో దేశం తీవ్రమైన అప్పుల్లో కూరుకుపోవడమే కాకుండా, కనీసం రోజువారీ వ్యవహారాలనూ నడపలేని స్థితికి చేరుకుంది. విదేశీ మారకద్రవ్య నిల్వలు పూర్తిగా అడుగంటాయి. ఈ క్రమంలో కాంగ్రెస్ నేతృత్వంలో ఏర్పడిన సంకీర్ణ ప్రభుత్వాన్ని నడిపేందుకు ఏ నాయకుడూ ముందుకురాలేదు. ఇలాంటి సమయంలో మన తెలుగుతేజం పీవీ నరసింహారావు ప్రధానిగా బాధ్యతలు చేపట్టి ఆర్థిక విషయాల్లో అగ్రగణ్యుడిగా పేరొందిన మన్మోహన్‌సింగ్‌ను ఆర్థికమంత్రిగా నియమించారు.

### గ్లోబలైజేషన్, లిబరలైజేషన్, ప్రైవేటైజేషన్‌తో..

క్లిష్ట సమయంలో బాధ్యతలు చేపట్టిన మన్మోహన్‌సింగ్ భారత ఆర్థికవ్యవస్థ రూపురేఖలను పూర్తిగా మార్చేశారు. సరళీకరణ, ప్రైవేటీకరణ, ప్రపంచీకరణతో కొత్తపుంతలు తొక్కించారు. అప్పటివరకు నత్తనడకన సాగుతున్న అభివృద్ధిని జెట్‌స్పీడ్‌తో నడిపించారు. ఫలితంగా అనతికాలంలోనే దేశం ఆర్థిక సంక్షోభం నుంచి బయట పడింది. ఇక ప్రధానిగా ఆయన అందించిన సేవలు అసామాన్యమనే చెప్పాలి. ముఖ్యంగా అగ్రరాజ్యం అమెరికాతో అణుఒప్పందం చేసుకుని చరిత్రలో ఏ ప్రధానికి దక్కని ఘనకీర్తిని సొంతం చేసుకున్నారు. ఇక కుంభకోణాలను ఆపలేని మౌనముని అంటూ విపక్షాలు విమర్శించినా.. దేశాన్ని ఏకతాటిపై నడపడమే కాకుండా అతిపెద్ద సంస్కరణలను తీసుకొచ్చిన ఆర్థికవేత్తగా, దేశం మెచ్చిన నేతగా, భారతమాత ముద్దుబిడ్డగా ప్రజల మనస్సుల్లో మన.. మోహనుడు ఎప్పటికీ చిరంజీవే.

**మౌన మోహనుడు**

మనసులో మాట - 13లో




## అంతరిక్షంలో మరో అద్భుతం

# జంట ఉపగ్రహాల ప్రయోగం

16 లో



# శ్రీసిటీని మెచ్చుకున్న.. డీపీఐఐటీ కార్యదర్శి



కేంద్ర వాణిజ్య, పరిశ్రమల మంత్రిత్వ శాఖకు చెందిన పరిశ్రమలు మరియు అంతర్గత వాణిజ్య ప్రోత్సాహక విభాగం (డీపీఐఐటీ) కార్యదర్శి అమర్దీప్‌సింగ్ భాటియా ఇటీవల శ్రీసిటీని సందర్శించారు. శ్రీసిటీ ప్రెసిడెంట్ (ఆపరేషన్స్) సతీష్ కామత్ ఆయనకు సాదర స్వాగతం పలికి, శ్రీసిటీ ప్రపంచస్థాయి మౌలిక సదుపాయాలు, ప్రగతి, ప్రత్యేకతలను వివరించారు. ప్రముఖ ఆటోమోటివ్, ఎయిర్ కండీషనర్ బ్రాండ్ల ఉనికి, బలమైన సరఫరా గొలుసుతో దేశంలో అగ్రగామి కేంద్రంగా శ్రీసిటీ వేగంగా ఎదుగుతోందని చెప్పారు. అనంతరం, శ్రీసిటీ పారిశ్రామిక వాడలో పర్యటించిన అమర్దీప్‌సింగ్ డైకిన్ ఏసీ తయారీ పరిశ్రమను సందర్శించి అక్కడి తయారీ కార్యకలాపాలను పరిశీలించారు. శ్రీసిటీలో ఏసీ కంప్రెసర్ల తయారీ యూనిట్ ఏర్పాటు కోసం డైకిన్ ఇండియా, తైవాన్‌కు చెందిన రెచి సంస్థల భాగస్వామ్యంపై స్పందిస్తూ, 'కీలకమైన విడిభాగాల కోసం భారతదేశం దిగుమతులపై ఆధారపడటాన్ని గణనీయంగా తగ్గించేచర్యగా' దానిని పేర్కొన్నారు. శ్రీసిటీ అద్భుతమైన పారిశ్రామిక మౌలిక సదుపాయాలు, వ్యాపార అనుకూల వాతావరణాన్ని అమర్దీప్ సింగ్ ఈ సందర్భంగా ప్రశంసించారు. ఆత్మనిర్భర భారత్ చొరవకు శ్రీసిటీ ఒక చక్కని ఉదాహరణగా వారు పేర్కొన్నారు. అమర్దీప్‌సింగ్ పర్యటన తమకు ఎంతో ముఖ్యమైనదంటూ, తన సందేశంలో పేర్కొన్న శ్రీసిటీ వ్యవస్థాపక మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి, వారి పరిశీలనలు, సూచనలు, శ్రీసిటీ అభివృద్ధికి దోహదం చేస్తాయని చెప్పారు.

# రాయలసీమ బలిజ ఆత్మగౌరవ సభ



బలిజ సంఘాల నేతలు మిరియాల వెంకట్రావు, వంగవీటి మోహనరంగా జయంతులను పురస్కరించుకుని ఇటీవల నెల్లూరులో రాయలసీమ బలిజ ఆత్మగౌరవ సభ ఘనంగా జరిగింది. ముఖ్యఅతిథిగా రాష్ట్ర మంత్రి పొంగూరు నారాయణ సతీమణి పొంగూరు రమాదేవి పాల్గొన్నారు. రాయలసీమ బలిజ మహాసభ వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షులు శ్రీహరి రాయలు వెలిశెట్టి ఆధ్వర్యంలో రమాదేవికి అపూర్వ స్వాగతం పలికి, ఘనంగా సన్మానించారు. బలిజ పేద మెరిట్ విద్యార్థులకు ఉపకార వేతనాలు, టాలెంట్ అవార్డులు, ప్రతిభావంతులకు ప్రతిభా పురస్కారంతోపాటు ముఖ్య అతిథులకు రమాదేవి చేతుల మీదుగా 'బలిజ బంధు' పురస్కారాలు అందచేసి అభినందించారు. ఈ సందర్భంగా రమాదేవి మాట్లాడుతూ....బలిజ పేద మెరిట్ విద్యార్థులకు ఉపకార వేతనాలు అందచేయడం గొప్ప విషయమని నిర్వాహకుల్ని కొనియాడారు. బలిజలందరూ ఐకమత్యంగా సమావేశం నిర్వహించుకోవడం అభినందనీయమన్నారు. అనంతరం రాయలసీమ బలిజ 2025 నూతన సంవత్సరం క్యాలెండర్‌ను ఆవిష్కరించారు.



వెంకటగిరి ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణను ఆయన నివాసంలో కలసి సత్కరిస్తున్న తిరుపతి జిల్లా, బాలాయపల్లి మండలం, పాకపూడి గ్రామం సాగునీటి సంఘం అధ్యక్షులు మల్లెమాల విష్ణువర్ధనరెడ్డి, పక్కన మల్లెమాల గోపికృష్ణారెడ్డి, పాకపూడి సర్పంచ్, బాలాయపల్లి మండల టీడీపి అధ్యక్షులు మస్తాన్‌నాయుడు, మాజీ మండలాధ్యక్షులు సింగంశెట్టి భాస్కరరావు

# అంబేద్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు తగవు



కేంద్ర హోంమంత్రి అమిత్‌షా, అంబేద్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేయడం సమంజసం కాదని వామపక్షాల నాయకులు అన్నారు. గూడూరు పట్టణంలోని గడియారపు స్తంభం కూడలి వద్ద ఇటీవల వారు నిరసన వ్యక్తం చేశారు. బీజేపీ రాజ్యాంగానికి విరుద్ధంగా ప్రవర్తిస్తోందని వారు ఆరోపించారు. కేంద్రమంత్రివర్గం నుండి అమిత్‌షాను బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. కాలేషా, శివకుమార్, చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

## పెద్దాసుపత్రి పాలనాధికారిగా.. మహేశ్వరరెడ్డి



నెల్లూరులోని ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి (పెద్దాసుపత్రి) పాలనాధికారిగా కర్నూలు జిల్లాలోని డోన్ ఆర్డీఓగా పని చేస్తున్న మహేశ్వరరెడ్డిని నియమించారు. ఇటీవల ఆయన నెల్లూరులో ఆమేరకు బాధ్యతలు చేపట్టారు. అనంతరం ఇన్‌చార్జి కలెక్టర్ కార్తీక్‌ను, పెద్దాసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సిద్ధానాయక్‌లను మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు.

## ఏపీ ఎస్పీడీసీఎల్ చీఫ్ విజిలెన్స్ అధికారిగా.. జనార్ధన్‌నాయుడు



ఏపీ ఎస్పీ డీసీఎల్ చీఫ్ విజిలెన్స్ అధికారిగా కె.జనార్ధన్‌నాయుడు నియమితులయ్యారు. నెల్లూరులోని విద్యుత్‌భవన్‌లో ఆయన ఇటీవల బాధ్యతలు చేపట్టారు. విద్యుత్‌శాఖ ఎస్ఇ విజయన్ తదితర అధికారులు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా జనార్ధన్ నాయుడు మాట్లాడుతూ, జిల్లాలో విద్యుత్ చౌర్యాలను అరికట్టేందుకు తనిఖీలు నిర్వహించాలని అధికారులకు సూచించారు. ఏకే నగర్ సబ్ డివిజన్ డెప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ అశోక్, ఇఇ మునీంద్ర తదితర అధికారులు పాల్గొన్నారు.

## జగన్ నిర్వాకం వల్లనే..

# విద్యుత్ చార్జీల భారం

### ఉదయగిరి నాయకుల ధ్వజం



గత వైకాపా ప్రభుత్వంలో మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్‌రెడ్డి నిర్వాకం వల్లనే నేడు విద్యుత్ చార్జీల భారం రాష్ట్రానికి శాపంగా మారిందని, వైకాపా అసమర్ధ విధానాలతో విద్యుత్ సంస్థలపై అప్పులు పెరిగాయని, అయినా వైకాపా నేతలు విద్యుత్ చార్జీలపై నిరసన ర్యాలీ చేయడం విడ్డూరంగా ఉందని ఉదయగిరి టీడీపీ నాయకులు విమర్శించారు. అయిదేళ్ల వైకాపా పాలనంలో పదిసార్లు విద్యుత్ చార్జీలు పెంచారని, ఆ భారం ఇప్పుడు టీడీపీ ప్రభుత్వంపై పడిందని అన్నారు. ఇటీవల ఉదయగిరిలోని టీడీపీ కార్యాలయంలో తెలుగుదేశం పార్టీకి చెందిన పలువురు నాయకులు విలేకర్లతో మాట్లాడుతూ, వైకాపా విధానాలను తూర్పారబట్టారు. రాష్ట్ర విభజన అనంతరం 2014లో అధికారం చేపట్టిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు అపారమైన తన అనుభవంతో విద్యుత్ లోటును 2019 నాటికల్లా మిగులు విద్యుత్తుగా చేశారని, ఆ ఘనత చంద్రబాబుకే దక్కుతుందని వారు కొనియాడారు. టీడీపీ అధికారం చేపట్టిన అనతికాలంలోనే ఎస్సీ ఎస్టీ బీసీ కులవృత్తుల వారికి 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ ఇస్తోందని, ఆక్వా రైతులకు ఒక రూపాయి 50 పైసలకే యూనిట్ విద్యుత్తు ఇవ్వడం జరుగుతుందన్నారు. నేడు రాష్ట్రంలో 20వేల మెగావాట్ల సామర్ధ్యం గల విద్యుత్‌ప్లాంట్లను ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రారంభించారన్నారు. ఈ కార్యక్రమంలో ఉదయగిరి టీడీపీ మండల కన్వీనర్ సిహెచ్ బయన్న, ముస్లిం మైనార్టీ ఉపాధ్యక్షులు ఎస్‌కె రియాజ్, గండిపాలెం ప్రాజెక్టు అధ్యక్షులు వెంకటసుబ్బయ్య, సీనియర్ నాయకులు గడ్డం వెంకటేశ్వర్లు, బొజ్జ నర్సింలు, వెంకటేశ్వర్లు, వెంగయ్య, బ్రహ్మారెడ్డి చెన్నారెడ్డి, నల్లిపోగు రాజా నర్సింహులు, భాస్కర్ కిరణ్ మధునాయుడు, రాయుడు రామ్మోహన్ తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా.. 'డైట్' స్నాతకోత్సవం



ఇందుకూరుపేట మండలం, పల్లిపాడులో ఉన్న ప్రభుత్వ 'డైట్' విద్యాసంస్థలో 2022-24 విద్యా సంవత్సరంలో డీఎల్ఇడి చదివిన ఛాత్రోపాధ్యాయులకు ఇటీవల కాన్వొకేషన్ (సర్టిఫికెట్ ప్రదానోత్సవ కార్యక్రమం) ఘనంగా నిర్వహించారు. ఆ సంస్థ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ముఖ్య అతిథిగా సంస్థ విశ్రాంత ప్రిన్సిపాల్ డాక్టర్ పి.రమేష్ పాల్గొని సర్టిఫికెట్లు అందజేశారు. 2022-24 బ్యాచ్‌లో ప్రథమస్థానంలో కె.లోకేశ్వరి, ద్వితీయ స్థానంలో యస్.కె.రిజ్వానా, తృతీయ స్థానంలో యస్.కె.ఫుమియా నిలిచారని వారు తెలిపారు. అధ్యాపకులు డి.నరసింగరావు, కె.షఫీ అహ్మద్, యస్.బి.దాస్, కె.విజయచంద్ర, యన్.శివ, కార్యాలయ సూపరింటెండెంట్ ఎం.మేరీ ప్రసూన తదితరులు పాల్గొన్నారు.

# చికెన్ వ్యర్థాల వాహనం పట్టివేత



చికెన్ వ్యర్థాల వాహనాలపై ఎంత నిఘాపెట్టినా జిల్లాలోకి అవి ఏదో ఒక దారిలో వస్తూనే ఉన్నాయి. డిసెంబరు 30న బెంగుళూరు నుంచి కావలికి చికెన్ వ్యర్థాలను తరలిస్తున్న ఓ మినీలారీని దుత్తలూరు మండలంలోని నందిపాడు సెంటర్‌లో పోలీసులు పట్టుకున్నారు. ఉదయగిరి సీఐ ఎన్ వెంకటరావు తన సిబ్బందితో వాహన తనిఖీలు నిర్వహిస్తుండగా, ఈ చికెన్ వ్యర్థాల లారీని గమనించి దానిని స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు. అందులో పెద్దఎత్తున కోళ్ల వ్యర్థాలు ఉండడంతో వారు అవాక్కయ్యారు. సుమారు 80 డ్రమ్ముల్లో ఉన్న 10 టన్నుల చికెన్ వ్యర్థాలను బయటకు తీయించి, ఎస్ఐ ఇంద్రసేనారెడ్డి ఆధ్వర్యంలో డంపింగ్‌యార్డ్‌కు తరలించి వాటిని పూడ్చిపెట్టారు.

# ఉత్తరక్రియలు



జననం
05.05.1948

నిర్యాణం
27.12.2024

అనురాగమూర్తి, ఆత్మీయదీప్తి
మా ఇంటి దేవత

## శ్రీమతి అత్తివరపు లాలస

తేది. 27.12.2024 శుక్రవారం పరమపదించారు.
వారి ఆత్మకి సద్గతి చేకూరాలని ప్రార్థిస్తూ...

భర్త : **అత్తివరపు హరినాథ్‌రెడ్డి**

కుమార్తె - అల్లుడు

**సిద్ధారెడ్డి కవిత - సిద్ధారెడ్డి వెంకటరంగారెడ్డి**

మనుమళ్ళు - మనుమరాళ్ళు

**సిద్ధారెడ్డి వెంకటరోహిత్ - అంజనాక్షి**

**సిద్ధారెడ్డి వెంకటరోహన్ - శివాని**

ఉత్తరక్రియలు

వారి **'పెద్దకర్మ' జనవరి 8, 2025, బుధవారం**
మధ్యాహ్నం 12.00 గంటలకి హోటల్ సవేరా, 146, డా॥ రాధాకృష్ణన్‌రోడ్డు,
చెన్నైలోని 'సమావేశ్' హాల్‌లో జరుగును. బంధుమిత్రులకు తెలియజేయడమైనది.

లాయర్
జనవరి 03, 2025

# జనాన్ని నిలువుదోపిడీ చేస్తున్న.. 'సైబరాసురులు'

రాత్రిళ్ళు రహస్యంగా వచ్చి ఇళ్లకు కన్నం వేసి అందినంత దోచుకుపోయే పాతకాలపు దొంగలకు కాలం చెల్లిపోయింది. నేటి అధునాతన కాలంలో చోరీలకంటే, నేరుగా జనం జేబులకు చిల్లుపెట్టడమే సులభమైపోయింది. దొంగతనాలు చేయాలంటే ఎంతో సాహసం కావాలి. కానీ, నేటి కాలంలో సాంకేతికత ద్వారా తెలివిగా ఎవరికీ చిక్కకుండా, జనాన్ని మాయచేస్తూ నిట్టనిలువునా దోచేసుకుంటున్నారు. అలాంటి దోపిడీగాళ్లనే మనం 'సైబరాసురులు' అంటున్నాం. ఏదోఒక రకంగా వ్యక్తిగత సమాచారం సేకరించి, వారి ఫోన్ నంబర్లు, బ్యాంకు ఖాతాలు తెలుసుకుని, అదునుచూసుకుని డబ్బును కాజేయడమే వారి లక్ష్యంగా ఉంటోంది. ఫోన్‌లలో ఉన్న యాప్‌లు, సాంకేతికతను ఉపయోగించుకుని, మార్ఫింగ్ ఫోటోలతో మభ్యపెట్టి, బాగా తెలిసిన వారి గొంతులనే అనుకరించి సామాన్య జనాన్ని పల్టీకొట్టించి దర్జాగా డబ్బు లాగేసుకుంటున్నారు. ఒక్క ఆంధ్రప్రదేశ్‌లోనే గత ఏడాది (2024)లో ఈ నేరాలపై పోలీసులకు 7లక్షలా 23 వేలకు పైగా ఫిర్యాదులు వచ్చాయంటే పరిస్థితి ఎంత దారుణంగా ఉందో ఊహించుకోవచ్చు. అంతేకాదు, సైబరాసురుల వలకు చిక్కిన బాధితులు దాదాపు 1229 కోట్ల రూపాయల వరకు నష్టపోయారంటే ఈ దోపిడీ ఎంతపెద్ద స్థాయిలో జరుగుతుందో అర్థం చేసుకోవచ్చు. తాజాగా అందుతున్న నేర గణాంకశాఖ నివేదికల ప్రకారం ఈ సైబర్ నేరాలు ఏటా పెరిగిపోతూనే ఉన్నాయి. 2023లో కంటే 2024లో వీటి శాతం ఏకంగా 52.4 శాతానికి పెరగడం గమనార్హం. ఉదాహరణకు ఒక్క నెల్లూరుజిల్లాలో చూసినా 2024లో సైబర్ నేరాలకు సంబంధించి 770 ఫిర్యాదులొచ్చాయి. 2023లో రూ. 7 కోట్లకు పైగానే దోచుకుంటే, 2024లో అది 15 కోట్లకు పైగానే పోయింది. ఇలా అన్ని జిల్లాల్లో, అన్ని ప్రాంతాల్లో అమాయక జనాన్ని మోసం చేస్తూ సైబరాసురులు కోట్లకు కోట్లు గడిస్తున్నారు. దీంతో, ఏ సమాచారం ఎవరికి చెప్తే ఏం కొంప మునుగుతుందోనని ప్రజలు భయపడిపోతున్నారు. ఫోన్‌లలో దేన్ని క్లిక్ చేస్తే, మన డబ్బు సైబరాసుల చేతుల్లోకి వెళ్ళిపోతుందోనని ఆందోళన చెందుతున్నారు.

ఉదాహరణకు..'మీకు ఓ పెద్ద బహుమతి వచ్చింది. మీ అడ్రసు, ఫోన్ నంబరు చెప్తే చాలు మీ ఇంటికే వచ్చేస్తుంది'.. అంటూ సైబరాసురులు నమ్మబలుకుతారు. లేదంటే 'ఇక్కడ మీ కూతురు రోడ్డుప్రమాదంలో పడి చావుబతుకుల్లో ఉంది. వెంటనే డబ్బు పంపండి, ఆపరేషన్ చేయాలంటూ' డాక్టర్లు లాగానో లేదా వారి ఆత్మీయుల్లాగానో మాట్లాడేస్తారు. అందుకు సంబంధించిన నకిలీ వీడియోలను కూడా చూపిస్తారు. అంతే, ఆ తల్లితండ్రులు వెంటనే కూతురు కోసం డబ్బు పంపేస్తారు. తీరా చూస్తే.. అదంతా అబద్ధం. మన డబ్బు పోవడమొక్కటే నిజం. అభం శుభం తెలీని తల్లితండ్రులు, పెద్దగా సాంకేతిక జ్ఞానంలేని పెద్దవాళ్లు, ముఖ్యంగా మహిళలు సునాయాసంగా వారి బుట్టలో పడిపోతున్నారు. అదేవిధంగా, 'బ్యాంకు నుంచి మాట్లాడుతున్నాం..మీ ఖాతా నెంబరు చెప్పండి, అర్జెంట్‌గా వెరిఫై చేయాలి, లేకుంటే మీకే సమస్య' అంటూ ఫోన్ వస్తుంది. ముందు వెనుకా ఆలోచించకుండా గబగబా ఆ వివరాలన్నీ చెప్పామంటే, మన ఖాతాలో ఉన్న డబ్బంతా క్షణాల్లోనే హుష్‌కాకీ అయిపోతుంది. నిత్యం ఇలాంటి సైబర్ మోసాలకు గురయ్యేవారెందరో చెప్పలేం. బ్యాంకుల వంటి సంస్థల పేరుతోనో, పోలీసులమనో ఇలా ఎవరో ఒకరి పేరు చెప్పి ఫోన్‌కాల్స్ చేస్తూ బెదిరించి రకరకాల యాప్‌లతో, వాట్సాప్‌లో వచ్చే ఏపీకేలతో ఎదుటివారిని బురిడీ కొట్టించేస్తున్నారు. అయితే సాధారణంగా బ్యాంకులు కానీ, అధికారులు లేదా పోలీసులు కానీ ఎవరూ మన సమాచారం అడగరు. వారికేదైనా కావాల్సి ఉంటే సంబంధిత సిబ్బంది మనవద్దకే వస్తారు. ఏ సమాచారం కావాలన్నా అందుకు సంబంధించిన ఫోటోలు, వీడియోలు అన్నీ కళ్ళకు కట్టినట్లుగా అందుబాటులోకి రావడం, నకిలీలు, డీప్ ఫేక్‌లు వగైరాలన్నీ వచ్చేయడంతో సైబరాసురులు వాటినే వాడుకుంటూ జనం నెత్తికి టోపీ పెడుతున్నారు. ప్రపంచంలో ఏ మారుమూలో కూర్చుని సైబర్ నేరాలకు పాల్పడుతున్న ముఠాల ఆచూకీని కనుక్కోవడం సాధ్యం కావడం లేదు. కేంద్ర ప్రభుత్వం కూడా రంగంలోకి దిగి వారిని వెంటాడుతూనే ఉంది. గతంలో కంటే సాంకేతిక వ్యవస్థలను బలోపేతం చేసుకుని, నేరగాళ్ళ భరతం పట్టే పనిలో ఉంది. సైబర్ మోసాల గురించి వివరిస్తూ, నిరంతరం ఫోన్‌లలో చెప్తూనే ఉంది. ఏదేమైనా, మన చుట్టూ సైబర్ నేరగాళ్లు పొంచి ఉన్నారని తెలుసుకుని, వారి బారిన పడకుండా ఎవరికి వారు అప్రమత్తంగా ఉండడమొక్కటే మార్గం. అన్నిటి కంటే ముందు, మన సమాచారం ఎవరికీ తెలియజేయకుండా ఉండడమే వాటికి సరైన మందు!..కనుక, తస్మాత్ జాగ్రత్త!

## గతుకుల బతుకులు ఇంకెన్నాళ్ళు?

నగరంలో చాలా చోట్ల రోడ్లు గుంతలతో దర్శనమిస్తున్నాయి. ద్విచక్ర వాహనాలలో వెళ్ళే వాళ్ళ నడుములు విరగ గొడుతున్నాయి. కూటమి ప్రభుత్వం వచ్చి ఆరు నెలలు పూర్తయిపోయింది. నారాయణ సారు మునిసిపల్ మంత్రిగా బాధ్యతలు తీసుకుని అప్పుడే సగం ఏడాది గడచిపోయింది. ఆయన సొంత జిల్లా కేంద్రమైన నెల్లూరు నగరంలోనే ఇంకా గతుకుల రోడ్లకి మోక్షం రాలేదు. రాష్ట్రంలో గతుకుల రోడ్లే లేకుండా చేస్తామని గౌరవ ముఖ్యమంత్రి ప్రకటించారు. ఒక్క మంత్రిగారి ఊర్లోనే ఇన్ని గతుకుల రోడ్లుంటే రాష్ట్రంలో ఇతర ప్రాంతాల పరిస్థితి ఏమిటో? ఇకనైనా మంత్రి గారు దృష్టిపెట్టాలి. తన సొంత ఇలాకా నుండే ప్రక్షాళన మొదలుపెట్టి గతుకుల బతుకులకి మంగళం పాడవలసిందిగా మనవి!

- ఆర్.వి. రామయ్య - కొండాయపాళెం.

## గందరగోళంగా గాంధీబొమ్మ కూడలి!

నగరంలోని గాంధీ బొమ్మ కూడలిని పోలీసులు గాలికి వదిలేసినట్లుంది. ఇక్కడ ఎవరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించడంలేదు. ముఖ్యంగా స్వతంత్ర పార్కు ప్రాంగణంలో నిర్మించిన వెంగళరావు బిల్డింగ్స్ ముందు కుప్పలు తిప్పలుగా వాహనాలు అడ్డదిడ్డంగా ఆపేస్తున్నారు. కో-ఆపరేటివ్ బ్యాంకు ముందు కూడా ఇదే పరిస్థితి. వాహనదారులు ఇష్టారాజ్యంగా తమ వాహనాల్ని పార్కింగ్ చేస్తున్నారు. ఆటోలోళ్ళ సంగతైతే ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. గాంధీబొమ్మ సెంటర్లో కనీసం ద్విచక్రవాహనం కదలాలన్నా నరకం కనిపిస్తోంది. నడచి వెళ్ళేవాళ్ళ పరిస్థితి సరేసరి. ఎందుకనో నిర్లక్ష్యానికి కేరాఫ్ అడ్రస్‌గా నెల్లూరు ట్రాఫిక్‌పోలీసు విభాగం తయారయ్యింది. ఎస్.పి స్థాయి అధికారులు కార్యాలయాలు, బంగళాలు వదిలి రాకపోవడంతో వాళ్ళకి వాస్తవ పరిస్థితులు కనపడడం లేదు. ప్రజల కష్టాలు వాళ్ళ దృష్టికి రావడంలేదు. ఎస్.పి గారు ఎలాంటి ముందస్తు సమాచారం ఇవ్వకుండా నగరంలో పర్యటిస్తే ప్రజలు పడుతున్న నరకయాతన ఏమిటో ఆయనకి అర్థమవుతుంది. అప్పుడప్పుడూ వచ్చి వెళ్తుండండి ఎస్.పీ సార్!

- షేక్. రసూల్ - ట్రంకురోడ్డు, నెల్లూరు.

ఈ-మెయిల్ ప్రజావాణి
lawyerpatrika@gmail.com
+91 98663 14741

## తిరుమలలో సామాన్య భక్తుల బాధలు వర్ణనాతీతం!

గత వారం మన 'లాయర్'లో తిరుమలలో భక్తులు పడుతున్న కష్టాలు కళ్ళకి కట్టినట్లుగా వర్ణించారు. ఎంతసేపటికీ 'భక్తుల సౌకర్యార్థం వసతులు పెంచుతున్నాం, దర్శనం సులభతరం చేస్తున్నాం' వంటి ప్రగల్భాలకే అటు పాలకమండలి, ఇటు అధికారులు పరిమితమవుతున్నారు. అంతే తప్ప, ఎంతో వ్యయప్రయాసలతో దర్శనానికి వచ్చే సామాన్య భక్తులకి ఎంత సేపు దర్శనం కల్పిస్తున్నాం అన్న విషయం పైన ఒక్కరు కూడా దృష్టి పెట్టడంలేదు. వసతుల విషయంలో చిన్న చిన్న అసౌకర్యాలు వున్నా పరవాలేదు. వచ్చిన భక్తులకి సంతృప్తికరమైన స్వామివారి దర్శనం కల్పించగలిగితే, వాళ్ళు పడ్డ కష్టాలన్నీ మర్చిపోతారు. పాలకమండలి, అధికారులు ఆ దిశగా అడుగులు వేస్తే బాగుంటుంది.

- లక్ష్మీ భరద్వాజ్ - హైదరాబాదు.

సత్యపీఠం
నిజాలే మాట్లాడుకుందాం! 71

## నిర్లక్ష్యం ఖరీదు నిండు ప్రాణాలు..!

దేశవ్యాప్తంగా తరచూ అనేకరకాల ప్రమాదాలు జరగడం, ఎంతోమంది ప్రాణాలు కోల్పోవడం నిత్యకృత్యంగా మారిపోయింది. 'ఆటోని ఢీకొన్న లారీ-12మంది మృతి', 'డివైడర్‌ని కొట్టుకున్న ద్విచక్ర వాహనం - ఇద్దరు దుర్మరణం', 'ఆగివున్న లారీక్రింద దూరిన కారు-5మంది మృత్యువాత'. నిరంతరం ఎప్పటికప్పుడు ఇలాంటి దుర్ఘటనలను పత్రికలు, ప్రసార మాధ్యమాలు మన కళ్ళకు కడుతూనే ఉన్నాయి. పతాక శీర్షికలతో ప్రచురిస్తూనే ఉన్నాయి. అయినా సరే, ప్రమాదాల సంఖ్య తగ్గకపోగా, అంతకంతకీ పెరిగిపోతూనే ఉన్నాయి. విధివశాత్తు కొన్ని ప్రమాదాలు జరుగుతుంటే, మానవ తప్పిదాలవల్ల మరికొన్ని జరుగుతున్నాయి. అయితే, దురదృష్టంకొద్దీ జరిగే ప్రమాదాల సంఖ్య 10 శాతమే ఉంటే, మనుషుల నిర్లక్ష్యం కారణంగా జరిగే ప్రమాదాలు 90 శాతం ఉంటున్నాయని అనేక అధ్యయనాలు స్పష్టం చేస్తున్నాయి. చిన్నపాటి నిర్లక్ష్యం మనుషుల ప్రాణాలని హరించేస్తుంది. రెప్పపాటు కాలంలో జరిగే తప్పిదం అమాయకులని పొట్టనపెట్టుకుంటోంది. ముక్కుపచ్చలారని పసికందులు, కాళ్ళకి పారాణి సైతం ఆరని కొత్త దంపతులు, పండంటి భవిష్యత్తును ఊహించుకుంటూ ఉద్యోగాలలో చేరడానికి వెళ్ళే యువతీయువకులు... ఇలా అనేకమంది ప్రమాదాల బారినపడి అర్థాంతరంగా తమ ప్రాణాలని పోగొట్టుకుంటున్నారు.

### మానవ తప్పిదాలే ఎక్కువ!

ప్రధానంగా ప్రమాదాలు రెండు రకాలు. అనుకోని ప్రమాదాలు, చేజేతులా కొని తెచ్చుకుంటున్న ప్రమాదాలుగా వాటిని విభజించుకోవచ్చు. కర్మానుసారం జరిగే ప్రమాదాలను ఎవరూ ఆపలేరు. ప్రయాణంలో టైరు పగిలి, డివైడర్‌ను పగలగొట్టి పల్టీలు కొట్టి అవతలి రోడ్డుమీద వస్తున్న వాహనాలను ఢీకొట్టి, వాహనం తునాతునకలు అయిందనుకోండి... అది విధి. అలాకాకుండా నిద్రపోతూనో, లేదా తాగినమత్తులోనో వాహనాన్ని నడుపుతూ ఎదురుగా ఆగివున్న వాహనాన్ని ఢీకొట్టి, తాను చనిపోవడంతో పాటు ఇతరుల ప్రాణాలను సైతం బలిగొంటే.. అందుకు కారణం ఎవరు? మనిషి నిర్లక్ష్యమే కదా!..

### రహదారులపైనే ప్రమాదాలు ఎక్కువ..!

ముఖ్యంగా నగరాల్లో, పట్టణాల్లో కంటే జాతీయ రహదారులపైనే ఎక్కువ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. ట్రాఫిక్‌పైన అవగాహనా లోపం, డ్రైవింగ్‌పట్ల సరైన శిక్షణలేకపోవడం, లారీ డ్రైవర్లు తాము నిద్రపోయి సరైన తర్ఫీదు లేని క్లీనర్లచేత వాహనం నడిపించడం వంటివి కొన్ని ప్రమాదాలకు ప్రధాన కారణాలు. చెడిపోయి రోడ్లపైన పార్కింగ్ చేసిన వాహనాలకు వెనుకా ముందు రెడ్ లైట్‌లు వేసి ఉంచక పోవడం రాత్రివేళల్లో జరిగే ప్రమాదాలకు మరో కారణం. పాత వాహనాలకి టైల్(తోక) లాంప్‌లు ఉండవు, ఉన్నా వెలగవు. ఘోర ప్రమాదాలకు మరో కారణం అలసట, నిద్రలేమి. కొంతమంది డ్రైవర్లు పెళ్లిళ్ళ సమయంలో రాత్రిపగలూ వాహనాలు నడుపుతుంటారు. పెళ్ళైపోయిన తక్షణమే పసుపు బట్టలతోనే కొత్త దంపతులని తీసుకుని పుణ్యక్షేత్రాలకు బయలుదేరుతారు. అదే పసుపు బట్టలతో దర్శనం చేయిస్తారు. మళ్ళీ అదే పసుపుబట్టలతో తమ స్వస్థలాలకు బయలుదేరుతారు. కొత్త దంపతులతో సహా కారులో ఉన్నవారంతా గుర్రుపెట్టి నిద్రపోతుంటారు. పూర్తిగా నిద్ర కరువైన డ్రైవర్ గురించి ఎవరూ ఆలోచించరు. అప్పటికే వారంరోజులుగా నిద్రలేని ఆ వాహన డ్రైవర్ వాహనం నడుపుతూనే రెప్ప వాలుస్తాడు... ఫలితంగా ఘోరప్రమాదం. కారులో ఒక్కరు కూడా మిగలరు. వారి బంధువులు మాత్రం దేముడిని నిందిస్తారు. దైవదర్శనానికి వెళ్లి వస్తుంటే ఇలా జరిగిందే.. అంటూ భగవంతుడిని తప్పుపడతారు. ప్రమాదానికి కారణం ఆ వాహన యజమానులే అన్న నిజాన్ని గ్రహించరు. మితిమీరిన వేగం కూడా ప్రమాదాలకు మరో ముఖ్యకారణం. మన దేశంలో నిర్ణీత వేగంతో వెళ్ళడానికే మన రహదారులు రూపొందించబడ్డాయి. పరిమితికిమించిన వేగంతో వెళ్తే ఆ వేగానికి తగ్గట్టుగా మన రోడ్లు డిజైన్ చేయబడలేదన్న విషయం కూడా చాలామందికి తెలియదు. కొత్తగా వస్తున్న అనేక రకాల వాహనాలలో 120 నుండి 150కిలోమీటర్లవరకూ స్పీడుగా వెళ్ళి అంతే వేగంగా అనంతలోకాలకి వెళ్లిపోతున్నారు. ప్రముఖ క్రికెటర్ అజారుద్దీన్, సినీనటులు బాబుమోహన్, కోట శ్రీనివాసరావు, మంత్రి నారాయణ, తెలంగాణ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి లాంటి ప్రముఖుల పిల్లలంతా అలా మితిమీరిన వేగానికి బలైపోయినవాళ్ళే. ఇలాంటి ఉదాహరణలు ఎన్నో మన కళ్ళముందు ప్రత్యక్షంగా ఉన్నాయి.

### నిబంధనలు పాటిస్తే ప్రమాదాలు నివారించవచ్చు!

ట్రాఫిక్ నియమనిబంధనలు పాటించాలి. ద్విచక్ర చోదకులు హెల్మెట్ పెట్టుకోవాలి. కారు, ఇతర వాహనాల వాళ్ళు తప్పనిసరిగా వాహనంలో ఉన్నవాళ్ళందరూ సీటు బెల్ట్‌లు ధరించాలి. అత్యవసరమైతే తప్ప రాత్రి వేళల్లో ప్రయాణాలు మానెయ్యాలి. మద్యం సేవించో, సెల్‌ఫోన్‌లో మాట్లాడుతూనో వాహనం నడపకూడదు. మితిమీరిన వేగంతో వాహనం నడపకూడదు. అయిదుమంది పట్టే ఆటోలలో 15 మందిని ఎక్కించుకోకూడదు. డ్రైవర్ సీటుకి అటూ ఇటూ ప్యాసింజర్లని ఎక్కించుకోకూడదు.

### ప్రభుత్వాలు హెచ్చరికలు చేస్తూనే ఉన్నాయి!

పై విషయాలన్నిటిపైనా ప్రభుత్వాలు ఎప్పటికప్పుడు హెచ్చరికలు చేస్తూనే వున్నాయి. కొత్తగా నిర్మించే రహదారులపైన "ప్రమాదకరమైన మలుపు" అన్న సూచికలు కూడా ఏర్పాటు చేస్తూనే ఉన్నాయి. రహదారులపైన స్పీడ్‌గన్‌లు మితిమీరిన వేగంతో వెళ్ళే వారికి ఫైన్‌లు విధిస్తునే ఉన్నాయి.

### మార్పు మనతోనే మొదలవ్వాలి!

మన ప్రాణాలకి మనదే బాధ్యత. మన జాగ్రత్తలు మనమే తీసుకోవాలి. మనల్ని మనమే కాపాడుకోవాలి. మన నిర్లక్ష్యమే మన ప్రాణాలకి ప్రమాదమన్న విషయం మనమే గ్రహించాలి. మన వేగాన్ని మనమే నియంత్రించుకోవాలి. అందుకోసం మార్పు మనతోనే మొదలవ్వాలి!

- రాజశ్రీ






# ఆల్తూరు వారి ఇంట.. మ్రోగింది కళ్యాణ గంట



ప్రముఖ కాంట్రాక్టర్, పారిశ్రామికవేత్త, సినీ నిర్మాత, షిరిడి సాయిబాబా ఆరాధకులు ఆల్తూరు మహేష్‌రెడ్డి – రాధికల కుటుంబంలో పెళ్ళి గంట మ్రోగింది. వారి పెద్దకుమారుడు నితీష్ నిశ్చితార్థం తెలంగాణ రాష్ట్రం దుబ్బాక శాసనసభ్యులు కొత్త ప్రభాకరరెడ్డి – మంజులల కుమార్తె కీర్తితో వైభవోపేతంగా జరిగింది. డిసెంబర్ 25వతేదీ బుధవారం హైదరాబాదులోని కొత్త ప్రభాకరరెడ్డి నివాసం ఈ వేడుకకి వేదికయ్యింది.

## నిశ్చయతాంబూలం...

మధ్యాహ్నం 3 గంటల నుండి సాయంత్రం 6గంటల వరకూ జరిగిన నిశ్చితార్థం వేడుకలో ఆల్తూరు – కొత్త కుటుంబాల సభ్యులు, ఆ రెండు కుటుంబాల అత్యంత ఆప్తులు పాల్గొన్నారు. మెగాస్టార్ చిరంజీవి, అక్కినేని నాగార్జునలు తమ కుటుంబసభ్యులతో సహా నిశ్చితార్థం వేడుకలో పాల్గొని కాబోయే జంటని దీవించారు. ఈ వేడుకలో రెండు కుటుంబాల వారు తాంబూలాలు మార్చుకున్నారు.

## పరిచయ వేడుక...

నితీష్ – కీర్తిల పరిచయ వేడుక రాత్రి 7గంటల నుండి ఘనంగా జరిగింది. ఈ వేడుకలో నితీష్ – కీర్తిలు ఉంగరాలు మార్చుకున్నారు. అనేక రంగాలకి చెందిన రెండు కుటుంబాల ఆప్తులు, ఆత్మీయులు, శ్రేయోభిలాషులు పెద్దసంఖ్యలో ఈ వేడుకలో పాల్గొని కాబోయే దంపతులకి తమ అభినందనలు అందజేశారు. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, కర్ణాటక ఉపముఖ్యమంత్రి డీ.కే.శివకుమార్‌తో సహా పలువురు మంత్రులు, యంపీలు, ఎం.ఎల్.ఏలు అనేకమంది రాజకీయ, రాజకీయేతర రంగాల దిగ్గజాలు ఈ రెండు సంబరాలలో పాల్గొన్నారు.








# 'ఎన్టీఆర్ భరోసా'..చరిత్రాత్మకం

## ● కొనియాడిన సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి



రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సారధ్యంలో ఏర్పాటైన 'ఎన్టీఆర్ భరోసా' పింఛన్ల పంపిణీ దేశంలోనే చరిత్రాత్మకమైన విషయమని, పింఛన్ల కోసం ఏడాదికి రూ. 30వేల కోట్లు నిధులు సమకూర్చడం అపురూపమైన అంశమని మాజీమంత్రి, సర్వేపల్లి శాసనసభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి కొనియాడారు. ఈనెల 31న ఆయన వెంకటాచలంలోని ఇందిరమ్మ కాలనీ, కనుపూరు, ఇస్లాంపేటలో లబ్ధిదారులకు పింఛన్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వృద్ధులు, వితంతువులకు రూ. 4 వేలు, దివ్యాంగులకు రూ. 6 వేలు, పూర్తిగా మంచానికి పరిమితమైన వారికి రూ. 15 వేలు వంతున పింఛన్ పంపిణీ చేయడం విశేషమన్నారు. నూతన సంవత్సరం సందర్భంగా ఒకరోజు ముందే, డిసెంబరు 31న లబ్ధిదారులకు పింఛన్లు అందజేయడం సంతోషదాయకమన్నారు. దేశంలోనే మొదట రూ. 30తో సామాజిక పింఛన్ పథకాన్ని ప్రారంభించింది తెలుగు దేశం పార్టీ అని, ఎన్టీఆర్ అందుకు ఆద్యులని అన్నారు. ఆ తర్వాత పింఛన్‌ను రూ. 200 నుంచి రూ. 2 వేలకు, రూ. 3 వేలు నుంచి రూ. 4 వేలకు పెంచిన ఘనత ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడిదేనన్నారు.

### అధికారులు చట్టప్రకారమే పనిచేయాలి

అధికారులు చట్టప్రకారమే పనిచేయాలని, నేను చెప్పినా సరే.. అడ్డదిడ్డమైన పనులేమీ చేయకూడదని, పేదలకు న్యాయం చేయడంపై ప్రత్యేకదృష్టి పెట్టాలని మాజీమంత్రి, సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి అధికారులకు స్పష్టం చేశారు. ఇటీవల ఆయన పొదలకూరు మండలం వావింటపర్తి రెవెన్యూ సదస్సులో పాల్గొని మాట్లాడుతూ, వైసీపీ పాలనలో కక్షసాధింపులు, భూఅక్రమాలు తప్ప అభివృద్ధి శూన్యమని, కాకాణి పాపాలకు అధికారులు బలైపోయారని అన్నారు. వైసీపీ ఐదేళ్ల పాలనలో చరిత్రలో ఎప్పుడూ లేని విధంగా దుర్మార్గాలు జరిగాయని, ప్రత్యేకించి పొదలకూరు మండలంలో లెక్కకు మించి పాపాలు చేశారని ఆయన విమర్శించారు. సూరాయపాళెంలో 36 ఎకరాల మేత పోరంబోకు భూములను ఆక్రమించారని, మరుపూరులో 60 ఎకరాలకు సంబంధించి ఆదాయపు పన్ను కట్టే కోటీశ్వరులతో పట్టాలు సృష్టించారన్నారు. గత ఐదేళ్ల వైసీపీ పాలనలో చేసినట్టు కక్షసాధింపులకు పాల్పడి తామేమీ అమాయకులపై అక్రమ కేసులు బనాయించి జైళ్లకు పంపడం లేదన్నారు. పాతికేళ్ల కల అయిన కండలేరు ఎడమకాలువ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టును సాకారం చేసి 25 వేల ఎకరాలకు నీళ్లు అందిస్తున్నామని, దక్షిణ కాలువపై సైఫన్ నిర్మించి పొదలకూరు మండలానికి సోమశిల జలాలు తీసుకొచ్చామని ఆయన చెప్పారు. పొదలకూరు ప్రజల కోసం గతంలో రూ. 3.82 కోట్లతో ఆస్పత్రి నిర్మించామని, త్వరలోనే ఈ ప్రాంత ప్రజలకు ఉపయోగపడేలా డయాలసిస్ సెంటర్ కూడా ఏర్పాటు చేస్తున్నామని, రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్‌యాదవ్ చేతుల మీదుగా డయాలసిస్ సెంటరును ప్రారంభించుకోబోతున్నామని చెప్పారు.

## కబడ్డీ అసోసియేషన్..
# ఉపాధ్యక్షునిగా మురళీరెడ్డి



నెల్లూరుజిల్లా కబడ్డీ అసోసియేషన్ కోశాధికారిగా ఉన్న ప్రముఖ న్యాయవాది కాకు మురళీరెడ్డి కబడ్డీ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షునిగా ఎన్నికయ్యారు. కబడ్డీ క్రీడలో నైపుణ్యం గల యువతను ప్రోత్సహించేందుకు, అసోసియేషన్ అభివృద్ధికి తనవంతు కృషిచేస్తానని మురళీరెడ్డి తెలిపారు. తనకు రాష్ట్ర సంఘంలో అవకాశం కల్పించినందుకు రాష్ట్ర, జిల్లా కమిటీల నాయకులకు ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా కబడ్డీ అసోసియేన్ కార్యనిర్వాహక అధ్యక్షుడు లవకుమార్ మాట్లాడుతూ, ఈనెల 5వ తేదీ వరకు కర్నూలులో జరిగే 50వ రాష్ట్రస్థాయి బాలబాలికల కబడ్డీ పోటీలకు 12 మందితో నెల్లూరు జిల్లా జట్టుకు ఎంపిక చేశామన్నారు. జిల్లా అసోసియేషన్ నాయకులు జాన్సన్, విజయకుమార్, జిలానీ, పీఇటీలు శ్రీధర్‌రెడ్డి, రాజా తదితరులు పాల్గొన్నారు.

## జనవరి 6న అల్లూరులో..
# 'మాతృమూర్తి సేవా పురస్కారాలు'

మేడా బుజ్జమ్మ మెమోరియల్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో జనవరి 6వ తేదీన 'మాతృమూర్తి సేవా పురస్కారాల కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు నిర్వాహకులు మేడా మస్తాన్‌రెడ్డి, మేడా శివకుమార్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఆరోజు ఉదయం 10గంటలకు అల్లూరు రామకృష్ణా జూనియర్ కళాశాల గ్రౌండ్‌లో జరిగే ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విఎస్‌యు రిజిస్ట్రార్ డా. కనుమూరి సునీత, ఆత్మీయ అతిథులుగా దేవిరెడ్డి చారిటబుల్ ట్రస్టు ట్రస్టీ దేవిరెడ్డి దశరథరామిరెడ్డి, ప్రత్యేక అతిథిగా ప్రముఖ రంగస్థల..సినీ నటుడు 'పలాస' ఫేమ్ జనార్ధన్‌లు పాల్గొంటారని తెలిపారు. అదేవిధంగా శ్రీ కళాలయ చారిటబుల్ ట్రస్ట్ గూడూరు లక్ష్మి, మేడా కృష్ణారెడ్డి తదితరులు విశిష్ట అతిథులుగా పాల్గొంటారని, సభకు అవధాని కోట రాజశేఖర్ అధ్యక్షత వహిస్తారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఈదూరు కృపావతి, మంగళపూడి శ్రీనివాసులురెడ్డి, కాకాని మల్లికార్జున, మద్దాలి రఘునాగప్రసాద్, కుమ్మరగుంట లక్ష్మయ్యలకు మేడా బుజ్జమ్మ స్మారక మాతృమూర్తి పురస్కారాలను ప్రదానం చేస్తామని, సమన్వయకర్తగా దుద్దుకూరు భాస్కర్ వ్యవహరిస్తారని తెలియజేశారు. మాతృమూర్తి ఆరాధకులు, సారస్వతాభిమానులు పాల్గొని ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయవలసిందిగా వారు విజ్ఞప్తి చేశారు.

## సాయినాధునికి
# విశేష హారతులు



నెల్లూరు నవాబుపేటలోని ఎఫ్‌సిఐ కాలనీలో కొలువైవున్న శ్రీ షిరిడీ సాయి బాబా మందిరంలో జనవరి 1 నూతన సంవత్సరారంభం సందర్భంగా స్వామి వారికి విశేష పూజలుచేసి హారతులిచ్చారు. పంచామృతాలు, సహస్ర నామపారాయణాలు, హోమాలు నిర్వహించి మధ్యాహ్నం భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. సాయంత్రం సాయినాథునికి వేడుకగా పల్లకిసేవ నిర్వహించారు. ఆలయ ట్రస్ట్ ఛైర్మెన్ నాగిశెట్టి బాబురావు, ట్రస్టు సభ్యులు పర్యవేక్షించారు.

## ఎస్సీ కుల గణనకు..
# సోషల్ ఆడిట్

ఎస్సీ కుల గణనకు సంబంధించి సోషల్ ఆడిట్ చేస్తామని జిల్లా సాంఘిక సంక్షేమశాఖ ఉప సంచాలకులు కె. శోభారాణి ఈనెల 1న ఒక ప్రకటనలో తెలిపారు. ఎస్సీ జనాభాకు సంబంధించిన వివరాలన్నీ జిల్లాలోని గ్రామ, వార్డు సచివాలయంలో జాబితాగా ప్రకటించామని, ఆ వివరాలు పరిశీలించేందుకు ఉన్న గడువును జనవరి 7వ తేదీ వరకు పొడిగించామని ఆమె పేర్కొన్నారు.



# జనసేన ఆధ్వర్యంలో వైద్య శిబిరం

నెల్లూరు నగరంలోని 49, 50వ డివిజన్‌లోని సంతపేట రావిచెట్టు సెంటర్ వద్ద జనసేన పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి గుణుకుల కిషోర్ సతీమణి విజయలక్ష్మి ఆధ్వర్యంలో ఇటీవల వైద్య శిబిరం నిర్వహించారు. మెడికవర్ హాస్పిటల్ వారి సౌజన్యంతో నిర్వహించిన ఈ శిబిరంలో జనసేన నెల్లూరు నగర అధ్యక్షులు దుగ్గిశెట్టి సుజయ్‌బాబు పాల్గొన్నారు. స్థానికంగా వయోభారంతో బాధపడుతున్నవారు, ఆసుపత్రికి వెళ్లి ఖర్చులు భరించలేక వైద్యం చేయించుకోలేని స్థానికులకు ఇక్కడ వైద్యపరీక్షలు చేశారు. జనసేన రాష్ట్ర సంయుక్త కార్యదర్శి సుందర్‌రామిరెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి కారంపూడి కృష్ణారెడ్డి, జిల్లా కార్యదర్శి షేక్ అలియా, జిల్లా సంయుక్త కార్యదర్శి ప్రశాంత్‌గౌడ్, జిల్లా నాయకులు నూనె మల్లికార్జున్‌యాదవ్, జిల్లా కార్యాలయ ఇన్‌చార్జి జమీర్ , నగర ప్రధాన కార్యదర్శులు అజయ్‌బాబు, షేక్‌కరీం, నగర కార్యదర్శి హేమచంద్ర పాల్గొన్నారు.

# విలువిద్యలో సత్తాచాటిన నెల్లూరు బాలలు

## ■ ఏకంగా ఏడు పతకాలు సాధించారు



విలువిద్య (ఆర్చరీ) పోటీల్లో రాష్ట్రస్థాయిలో నెల్లూరు జిల్లాకు చెందిన బాలబాలికలు తమ సత్తా చాటారు. ఏకంగా ఏడు పతకాలు సాధించి నెల్లూరు పేరును మోత మోగించారు. ఇటీవల తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంలో సబ్‌జూనియర్ ఆర్చరీ పోటీలు జరిగాయి. బాలుర రికర్వ్ రౌండ్‌లో జిల్లాకు చెందిన కె. తరుణీష్ జాత్య ప్రథమస్థానం సాధించి బంగారు పతకాన్ని గెలుచుకున్నాడు అదేవిధంగా ఆర్. సాయి మౌర్య ద్వితీయ, సీహెచ్ అక్షయ్ మహదేవ్ తృతీయ, పి. రాజేష్ నాలుగోస్థానం సాధించి వెండి పతకాలు, కాంశ్య పతకాలు అందుకున్నారు. స్టాండ్‌బైగా కె. చరత్ ఎంపికయ్యాడు. బాలుర ఇండియన్ రౌండ్‌లో జి. వెంకటలోకేష్ ప్రథమస్థానంలో నిలిచి బంగారుపతకం సాధించగా, ఏ. సాత్విక్ ద్వితీయస్థానంలో వెండిపతకం కైవసం చేసుకున్నాడు. బాలికల ఇండియన్ రౌండ్‌లో ఏ. లాస్య తృతీయస్థానంలో నిలిచి కాంశ్య పతకం సాధించింది. దీంతో జిల్లా ఆర్చరీ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు పల్లంరెడ్డి శ్రీహర్ష, పావురాల వేణు వారిని అభినందించారు. బాలబాలికలకు ఆర్చరీలో శిక్షణ ఇచ్చిన టి. శివశంకర్, వి. భరధ్వాజరెడ్డి, ప్రకాష్, హారతిలకు ధన్యవాదాలు తెలిపారు. పతకాలు సాధించిన క్రీడాకారులు జనవరి3 నుంచి రాజస్థాన్‌లో జరిగే జాతీయ విలువిద్య పోటీలకు రాష్ట్రం నుంచి ప్రాతినిధ్యం వహిస్తారని వారు తెలిపారు.

# ఎన్ఎస్ఎస్ వలంటీర్లకు.. విఎస్‌యు వీసీ అభినందన

ఇటీవల జాతీయ సమైక్యత శిబిరంలో ప్రతిభ కనబరచిన ఎన్ఎస్ఎస్ వలంటీర్లకు విక్రమసింహపురి యూనివర్శిటీ(విఎస్‌యు) వీసీ ఆచార్య విజయభాస్కర్‌రావు అభినందనలు తెలిపారు. మధ్యప్రదేశ్‌లోని గ్వాలియర్ విశ్వవిద్యాలయం పరిధిలో ఉన్న లక్ష్మీభాయ్ నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్‌లో డిసెంబరు 21 నుంచి 27 వరకు జరిగిన జాతీయ సమైక్యతా శిబిరంలో పాల్గొన్న ఎనిమిది మంది ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు మరియు ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారిని ఆయన ప్రత్యేకంగా అభినందించారు. విశ్వవిద్యాలయంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన అభినందన కార్యక్రమంలో ఆయన వారికి సర్టిఫికెట్లను ప్రదానం చేశారు. ఎముకలు కొరికే చలిలో కూడా విశ్వవిద్యాలయం ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు తమదైన శైలిలో కల్చరల్ మరియు లిటరరీ కాంపిటీషన్లో అద్భుతమైన ప్రదర్శన కనపరిచి, విఎస్‌యు పేరును జాతీయస్థాయిలో మరోసారి మార్మోగించారని అన్నారు. 17 రాష్ట్రాలు పాల్గొన్న ఈ జాతీయ సమైక్యతా శిబిరంలో విఎస్‌యు ఎన్ఎస్ఎస్ వలంటీర్లు ప్రదర్శన ప్రత్యేక ఆకర్షణగా నిలవడం ఎంతో సంతోషాన్ని ఇచ్చిందన్నారు. పోస్టర్ పెయింటింగ్‌లో తృతీయ స్థానం సాధించిన కుమారి శాలినిని, ఆ బృందానికి ప్రాతినిధ్యం వహించిన విడవలూరు ప్రభుత్వ జూనియర్ కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి ఐ. సునీల్‌కుమార్‌ను ఆయన అభినందించి, జ్ఞాపికలు సర్టిఫికెట్లు బహూకరించారు. ప్రోగ్రాం కోఆర్డినేటర్ డా. ఉదయ్‌శంకర్, విడవలూరు ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ దీన్‌దయాళ్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారులు డాక్టర్ ఎస్ బి సాయినాథ్, డాక్టర్ బి వెంకటసుబ్బారెడ్డి పాల్గొన్నారు.

# 95వేల కోట్ల పెట్టుబడితో జిల్లాకి...

# భారత్ పెట్రోలియం సంస్థ

## నెల్లూరుకి మహర్దశ వస్తోందన్న ఎంపీ వేమిరెడ్డి

**నెల్లూరు పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని రామాయపట్నం సమీపంలో భారీస్థాయిలో పెట్టుబడితో భారత్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్(బిపిసిఎల్) రిఫైనరీ అండ్ పెట్రో కెమికల్ కాంప్లెక్స్ కంపెనీ ఏర్పాటు కానుండటం పట్ల నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి సంతోషం వ్యక్తం చేస్తున్నారు. దాదాపు 95వేల కోట్ల రూపాయల పెట్టుబడితో ఏర్పాటయ్యే ఆ కంపెనీ నెల్లూరు పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలోని రామాయపట్నం వద్ద నిర్మాణం కానుండడం హర్షదాయకమని ఆయన ఓ ప్రకటనలో హర్షం ప్రకటించారు. బిపిసిఎల్ ద్వారా జిల్లాకు పారిశ్రామికంగా ఎంతో మేలు జరుగుతుందని, ఆ కంపెనీ ఏర్పాటుతో ప్రత్యక్షంగా 5వేల మందికి ఉద్యోగ ఉపాధి అవకాశాలు లభిస్తాయని, నెల్లూరు పార్లమెంట్ పరిధిలో ఇంత పెద్ద పరిశ్రమ ఏర్పాటు కావడం తన అదృష్టమని, ఆ పరిశ్రమ ఏర్పాటుకు కృషిచేసిన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌కు విపిఆర్ తన ధన్యవాదాలు తెలిపారు.**

రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చేసిన కృషితో త్వరలోనే రామాయపట్నంలో బీపీసీఎల్ పరిశ్రమ ఏర్పాటవుతుందని ఎంపీ వీపీఆర్ తెలిపారు. దాదాపు 6వేల ఎకరాల్లో ఏర్పాటుచేసే గ్రీన్‌ఫీల్డ్ రిఫైనరీతో ఏటా సుమారు 9 నుంచి 12 మిలియన్ మెట్రిక్ టన్నుల చమురును శుద్ధి చేసేందుకు రంగం సిద్ధమవుతోందని, ఆ పరిశ్రమ ఏర్పాటైతే దేశంలో గుజరాత్ తర్వాత మన రాష్ట్రమే ద్వితీయ స్థానానికి చేరుకుం టుందని భావిస్తున్నారు. దేశంలోని అతిపెద్ద కంపెనీల్లో ఒకటైన బీపీసీఎల్ ప్రత్యేకించి నెల్లూరు పార్లమెంట్ నియోజకవర్గంలో ఏర్పాటు కానుండడం విశేషం. ఎంతో బృహత్తరమైన బీపీసీఎల్ కంపెనీ ఏర్పాటు కానుండటం జిల్లా ప్రజలకు గర్వకారణమని, దీంతో పారిశ్రామికంగా జిల్లా స్వరూపం పూర్తిగా మారిపోతుందని వేమిరెడ్డి ఓ ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. తాను ఎంపీగా ప్రాతినిథ్యం వహిస్తున్న నెల్లూరు జిల్లాలో, తన హయాంలో ఇంత భారీ పరిశ్రమ ఏర్పాటు అవుతున్నందుకు తనకెంతో సంతోషంగా ఉందన్నారు.

### వేలాదిమందికి ఉద్యోగావకాశాలు :

బిపిసిఎల్ ద్వారా జిల్లాకు పారిశ్రామికంగా ఎంతో మేలు జరుగుతుందని, కంపెనీ ఏర్పాటుతో ప్రత్యక్షంగా 5వేల మందికి ఉద్యోగ ఉపాధి అవకాశాలు లభిస్తాయని విపిఆర్ వివరించారు. కంపెనీ నిర్మాణ సమయంలో దాదాపు 1లక్ష మందికి ఉపాధి దొరుకుతుందని వెల్ల డించారు. బిపిసిఎల్ కంపెనీ 5 వేల ఎకరాల్లో ఏర్పాటు కానుండగా.. తొలిగా ప్రాజెక్టు ముందస్తు కార్యకలాపాల కోసం 6100కోట్లు కేటాయిం చారన్నారు. దశలవారీగా దాదాపు 95వేల కోట్లు పెట్టుబడులు పెట్టడం రాష్ట్ర చరిత్రలో నిలిచిపోతుందని ఆయన వ్యాఖ్యానించారు. నెల్లూరు జిల్లాలో ఉన్న వనరులను దృష్టిలో ఉంచుకుని ఇంత భారీ పరిశ్రమను ఏర్పాటు చేసేందుకు ముందుకు వచ్చిన బిపిసిఎల్ కంపెనీ ప్రతి నిధులకు ఎంపీ వేమిరెడ్డి కృతజ్ఞతలు తెలి పారు. బిపిసిఎల్ కంపెనీతో పాటు 15 అనుబంధ పరిశ్రమలు కూడా ఏర్పాటవుతున్నాయని వివరించారు.

### అనుబంధ పరిశ్రమలు..

ఈ కంపెనీ ఏర్పాటుకు అనుబంధంగా పెట్రోకెమికల్ ప్లాంట్, లూబ్రికెంట్ మ్యాను ఫ్యాక్చరింగ్ ప్లాంట్, ఫ్యుయల్ అడిటివ్స్, వ్యాక్స్ ప్రొడక్షన్, ఆఫాల్ట్ ప్రొడక్షన్, సల్ఫర్ రికవరీ ప్లాంట్, కెటలిస్ట్ మానుఫ్యాక్చరింగ్, రిఫైనరీ మెయింటెనెన్స్ సర్వీస్, ఇన్‌స్ట్రుమెంటేషన్ అండ్ కంట్రోల్ సిస్టమ్స్, ఎన్విరాన్ మెంటల్ సర్వీస్, ట్యాంక్ మానుఫ్యాక్చరింగ్, పైప్ మానుఫ్యాక్చరింగ్, వాల్వ్ మానుఫ్యాక్చ రింగ్, ఇన్సులేషన్ అండ్ రిఫ్రాక్టరీ సర్వీస్, లాజిస్టిక్ అండ్ ట్రాన్స్‌పోర్టేషన్ వంటి 15 అనుబంధ పరిశ్రమలు ఏర్పడి లక్షలాది మందికి ఉపాధి లభిస్తుందని విపిఆర్ పేర్కొన్నారు. ఏదేమైనా బీపీసీఎల్ రాకతో జిల్లా సమగ్రాభివృద్ధి చెందుతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. అలాగే జిల్లా ప్రజలకు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు మరిన్ని పరిశ్రమలు తీసుకు వచ్చేందుకు ఎంపీగా తనవంతు కృషి చేస్తానని వేమిరెడ్డి స్పష్టం చేశారు.

### కేబినెట్ ఆమోదం

రామాయపట్నం సమీపంలో భారత్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్(బిపిసిఎల్) రిఫైనరీ అండ్ పెట్రో కెమికల్ కాంప్లెక్స్ కంపెనీ ఏర్పాటులో మరో కీలక ముందడుగు పడింది. జనవరి 2, గురువారం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో జరిగిన కేబినెట్ సమావేశంలో దీనిపై సుదీర్ఘంగా చర్చించి, 6వేల ఎకరాల్లో 96వేల కోట్లతో బీపీసీఎల్ భారీ రిఫైనరీ ఏర్పాటుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది.

### ముఖ్యమంత్రిని కలిసి కృతజ్ఞతలు తెలిపిన వేమిరెడ్డి దంపతులు

రామాయపట్నం పోర్టు సమీపంలో బీపీసీఎల్ రిఫైనరీ ఏర్పాటుకు కేబినెట్ ఆమోదం తెలపడంపై ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. బీపీసీఎల్ ఏర్పాటు కానుండటం జిల్లా ప్రజలకు ఎంతో గర్వకారణమని, పారిశ్రామికంగా జిల్లా ఎంతో అభివృద్ధి చెందుతుందని ఆయన తెలిపారు. తాను ఎంపీగా ప్రాతినిథ్యం వహిస్తున్న నెల్లూరు జిల్లాలో, తన హయాంలో ఇంత భారీ పరిశ్రమ ఏర్పాటు కావడం చాలా గర్వ కారణంగా ఉందని చెప్పారు. గురువారం సాయంత్రం ఆయన తన సతీమణి, కోవూరు శాసనసభ్యురాలు వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డితో సహా ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుని కలుసుకొని కృతజ్ఞతలు తెలిపారు. డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌కి కూడా విపిఆర్ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.



# అర్హులకి ఇళ్ళ పట్టాలు ఇవ్వండి

## అధికారులకి ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి ఆదేశం



గత ప్రభుత్వం హయాంలో 'జగనన్న కాలనీల' పేరిట ఇళ్ళు లేని పేదలకు కేటాయించాల్సిన పక్కా గృహాలను అనేకమందికి ఇళ్ళు వున్న వారికే ఇవ్వడంతో నిజమైన అర్హులకు అన్యాయం జరిగిందని, మార్చిలోగా అర్హులను గుర్తించి వారికి ఇళ్ళు మంజూరు చేయాలని కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి హౌసింగ్ అధికారులను ఆదేశించారు. ప్రజలకు అందుబాటులో ఉండని ప్రభుత్వ డాక్టర్ల బదిలీలపై వెళ్లి పోవాలని కూడా ఆమె చెప్పారు. ఇటీవల ఇందుకూరుపేట మండల సమావేశంలో ప్రశాంతిరెడ్డి తొలిసారిగా పాల్గొని మాట్లాడారు. రైతులకు యూరియా కొరత రాకుండా చూడాలని, సంక్రాంతి లోపు రోడ్ల ప్యాచ్ వర్కులు పూర్తిచేయాలని సంబంధిత అధికారులను కోరారు. ప్రభుత్వ పాఠశాలలో అమలవుతున్న డొక్కా సీతమ్మ మధ్యాహ్నభోజన పథకంలో నాసిరకం బియ్యం వినియోగిస్తున్నారని వస్తున్న ఫిర్యాదులపై విద్యా శాఖాధికారులను వివరణ కోరారు. సాగునీటి రంగానికి సంబంధించి రైతులకు ఎటువంటి అసౌకర్యం లేకుండా చూడాలని ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు.


క్రిస్మస్, 2025 నూతన సంవత్సర మరియు సంక్రాంతి శుభాకాంక్షలతో...




KIMS HOSPITALS™

కృష్ణా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ లిమిటెడ్, దర్గామిట్ట, నెల్లూరు - 524003
ఫోన్ : 2312777, 2315835, 36, 37, 38.
సెల్ : 9666 777 335
www.kimshospitals.com kimshospitalsnellore@yahoo.com

గత 24 సం॥లుగా నెల్లూరుజిల్లా మరియు పరిసర జిల్లాల ప్రజలకు అధునాతన పరికరాలతో అత్యున్నత ప్రమాణాలు కలిగిన వైద్య సేవలను సామాన్య ప్రజలకు అందుబాటులో అందిస్తున్నటువంటి ఏకైక అగ్రగామి సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్

సూపర్ స్పెషాలిటీ & స్పెషాలిటీ సర్వీసెస్

- కార్డియాలజీ
- కార్డియో థొరాసిక్ & వ్యాస్కులర్ సర్జరీ
- ఎండోక్రైనాలజీ & డయాబెటిస్
- గ్యాస్ట్రో ఎంటరాలజీ (మెడికల్)
- గ్యాస్ట్రో ఎంటరాలజీ (సర్జికల్)
- నెఫ్రాలజీ & డయాలసిస్
- న్యూరాలజీ & స్ట్రోక్ యూనిట్
- న్యూరోసర్జరీ & స్పైన్ సర్జరీ
- ప్లాస్టిక్ సర్జరీ & కాస్మటాలజీ
- ఆంకాలజీ (మెడికల్ & సర్జికల్)
- యురాలజీ & కిడ్నీ ట్రాన్స్‌ప్లాంటేషన్ సర్జరీ
- పల్మనాలజీ
- ఆర్థోపెడిక్స్ & జాయింట్ రిప్లేస్‌మెంట్ సర్జరీ రోబోటిక్ సాయంతో మోకాళ్ళ, కీళ్ళ మార్పిడి శస్త్ర చికిత్సలు
- ఆబ్‌స్టెట్రిక్స్ & గైనకాలజీ ఐ.వి.యఫ్ & కాస్మొటిక్ గైనకాలజీ
- పీడియాట్రిక్స్, పీడియాట్రిక్ సర్జరీ & నియోనెటాలజీ
- చెవి, ముక్కు, గొంతు విభాగము
- జనరల్ మెడిసిన్
- జనరల్ సర్జరీ & ల్యాపరోస్కోపిక్ సర్జరీ
- డెంటల్
- డెర్మటాలజీ
- క్రిటికల్ & ఇంటెన్సివ్ కేర్
- యాక్సిడెంట్ & ఎమర్జెన్సీ కేర్
- అనస్థీషియాలజీ & పెయిన్ క్లినిక్
- క్లినికల్ పాథాలజీ, బయోకెమిస్ట్రీ, మైక్రో బయాలజీ మాలిక్యులర్ బయాలజీ & హిస్టో పాథాలజీ
- రేడియాలజీ & ర్యుమటాలజీ
- సైకియాట్రీ & క్లినికల్ సైకాలజీ
- ఫిజియోథెరపీ & రీహాబిలిటేషన్
- వెల్‌నెస్ క్లినిక్ & హెల్త్ చెక్స్

అన్ని కంపెనీల మెడికల్ ఇన్సూరెన్స్ పాలసీదారులకు క్యాష్‌లెస్ వైద్య సదుపాయం కలదు.

క్రెడిట్ ఆర్గనైజేషన్స్ : షార్ & ఆరోగ్య భద్రత & ఎ.పి.యస్.పి.డి.సి.యల్ & ఇ.సి.హెచ్. యస్ & ఎ.పి ట్రాన్స్‌కో & ఎ.పి జెన్‌కో & పవర్ గ్రిడ్ & బి.యస్.ఎన్.యల్ & ఇ.పి.ఎఫ్.ఓ

మెడికల్ రీయింబర్స్‌మెంట్ : కేంద్ర మరియు రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, రిటైర్డ్ ఉద్యోగులు మరియు వారి కుటుంబ సభ్యులలో అర్హత గలవారికి రీయింబర్స్‌మెంట్ సదుపాయం కలదు.

24x7 Emergency, Laboratory, Pharmacy, MRI, C.T.SCAN, Digital X-RAY & Ambulance Services Available

NABH

### విద్యుత్ ఓసీ ఉద్యోగుల సంక్షేమ సంఘం
## క్యాలెండర్‌ను ఆవిష్కరించిన..ఎమ్మెల్యేలు



నెల్లూరులోని సీపీఆర్ కళ్యాణ మండపంలో ఇటీవల విద్యుత్‌శాఖ ఓసీ ఉద్యోగుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటైన కార్యక్రమంలో సర్వేపల్లి-నెల్లూరు రూరల్ ఎమ్మెల్యేలు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి పాల్గొని నూతన సంవత్సరం క్యాలెండర్‌ను, డైరీని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సోమిరెడ్డి మాట్లాడుతూ, ప్రజల కోసం..ప్రజల మధ్య నిరంతరం శ్రమించే విద్యుత్ ఉద్యోగుల సేవలు చాలా కీలకమైనవని అన్నారు. ఉద్యోగుల హక్కుల కోసం పోరాడే అసోసియేషన్ల నాయకులు ప్రజా ప్రయోజనాలపై దృష్టి పెట్టాలన్నారు. విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు, స్మార్ట్‌మీటర్ల అంశాల్లో ప్రజల సొత్తు దోపిడీకి గురవుతున్న సమయంలో అసోసియేషన్లు కూడా గళం విప్పాలని ఆయన సూచిస్తూ, ఉద్యోగులకు ఏ కష్టం వచ్చినా వారికి అండగా ఉంటామని, వారితో కలిసి నడిచేందుకు తాము సిద్ధమని స్పష్టం చేశారు.

## కౌశల్ క్విజ్‌లో.. జిల్లాకు ద్వితీయస్థానం

ఇటీవల విజయవాడలో జరిగిన రాష్ట్రస్థాయి 'కౌశల్ క్విజ్' పోటీల్లో నెల్లూరుజిల్లా విద్యార్థులు ద్వితీయ స్థానం సాధించారు. ఏపీ సైన్స్ సిటీ, భారతీయ విజ్ఞానమండలి ఆధ్వర్యంలో జరిగిన ఈ పోటీల్లో జిల్లాకు చెందిన ముగ్గురు విద్యార్థుల బృందం ద్వితీయ స్థానం సాధించడం విశేషం. అమ్మవారిపాళెం జడ్పీ హైస్కూల్ విద్యార్థి ఎన్.పెంచలకిషోర్, గుండెమడకల జడ్పీ హైస్కూల్‌కు చెందిన ఏ.సాయితేజ, జలదంకి జడ్పీ హైస్కూల్ విద్యార్థి ఎం.హశ్వంత్‌సాయి విజేతలుగా నిలిచి, ప్రశంసా పత్రాలతో పాటు 12వేల రూపాయలను బహుమతిగా అందుకున్నారు. అదేవిధంగా, పదవ తరగతి రీల్స్ విభాగంలో గట్టుపల్లి జడ్పీ పాఠశాల విద్యార్థిని ఎం.సింధు విజేతగా 3వేల రూపాయలను బహుమతిగా అందుకుంది. విజేతలైన ఈ విద్యార్థులను జిల్లా విద్యాశాఖ అధికారి బాలాజీరావు, కౌశల్ రాష్ట్ర కోఆర్డినేటర్ పి.ప్రసాద్, జిల్లా కోఆర్డినేటర్ ఆర్ఎస్ఎస్ ప్రసాద్, యు. రఘుకుమార్ తదితరులు అభినందించారు.

## వేదాయపాళెం సీఐగా..శ్రీనివాసులురెడ్డి



నెల్లూరులోని వేదాయపాళెం పోలీస్‌స్టేషన్ ఇన్స్‌పెక్టర్‌గా వి.శ్రీనివాసులురెడ్డిని నియమిస్తూ గుంటూరు రేంజ్ ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠి ఉత్తర్వు లివ్వడంతో ఆమేరకు శ్రీనివాసులురెడ్డి ఇటీవల బాధ్యతలు చేపట్టారు. ఇప్పటిదాకా ఆ స్థానంలో పనిచేస్తున్న ఆర్ ఎస్ కిషోర్‌కుమార్ రేంజ్ వీఆర్‌కు బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా శ్రీనివాసులురెడ్డికి కార్యాలయ సిబ్బంది స్వాగతం పలికి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఆయన జిల్లా ఎస్పీ కృష్ణకాంత్, అదనపు ఎస్పీ సీహెచ్ సౌజన్య, నగర డీఎస్పీ డి.శ్రీనివాసరెడ్డిలను మర్యాద పూర్వకంగా కలుసుకున్నారు.

## 'వాత్సల్య'లో ఆధార్ నమోదు

నెల్లూరులోని వాత్సల్య అనాథశరణాలయంలోని పిల్లలకు ఇటీవల జిల్లా కలెక్టర్ ఆనంద్ ఆదేశాల మేరకు ఆధార్ నమోదు కార్యక్రమం చేపట్టారు. జిల్లా స్త్రీ శిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో ఐటీడీపీ ప్రాజెక్టు అధికారిణి పరిమళ, జిల్లా బాలల సంరక్షణాధికారి సురేష్‌లు పాల్గొని ఆధార్ నమోదును పర్యవేక్షించారు. 53 మంది పిల్లలకు ఆధార్‌కార్డులు నమోదు చేశారు. ఐసీడీఎస్ పీడీ సుమలత తదితరులు పాల్గొన్నారు.

# నెల్లూరు కబుర్లు

## ప్రజా సంక్షేమమే..చంద్రబాబు లక్ష్యం
### --- మంత్రి ఆనం రామనారాయణరెడ్డి ---



రాష్ట్రంలోని అన్నివర్గాల ప్రజల అభ్యున్నతికి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఎంతో కృషిచేస్తున్నారని, ప్రజా సంక్షేమమే ముఖ్యమంత్రి ధ్యేయమని రాష్ట్ర దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి చెప్పారు. డిసెంబరు 31న నెల్లూరులోని ఆయన నివాసంలో ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం (ఆపస్) వారు రూపొందించిన 2025 సంవత్సర క్యాలెండర్‌ను, డైరీని మంత్రి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తమది ఉపాధ్యాయులకు, ఉద్యోగులకు చేరువగా ఉండే ఫ్రెండ్లీ ప్రభుత్వమని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆపస్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు రాజగోపాలాచార్యులు, అనిల్‌కుమార్, రాష్ట్ర కార్యదర్శులు రాము, చంద్రమౌళి, వెంగయ్య తదితరులు పాల్గొన్నారు.

### శ్రీ రాజరాజేశ్వరిదేవి ఆలయంలో..
## త్వరలో కొత్త ధ్వజస్తంభం

నెల్లూరు దర్గామిట్టలో వెలసివున్న ప్రసిద్ధ దేవాలయం..శ్రీ రాజరాజేశ్వరిదేవి అమ్మవారి దేవస్థానంలో త్వరలో నూతన ధ్వజస్తంభాన్ని ప్రతిష్ఠించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. డిసెంబరు 28న ఆ మేరకు దేవాదాయశాఖ డిప్యూటీ ఇంజనీర్ సిహెచ్ శ్రీనివాసరావు (గుంటూరు) ఆలయాన్ని సందర్శించారు. నవగ్రహ మండపాన్ని, అన్నదాన భవనాన్ని, కొత్త ధ్వజస్తంభాన్ని పరిశీలించి, సిబ్బందికి సూచనలిచ్చారు. ఆలయ ఇఓ కోవూరు జనార్ధన్‌రెడ్డి, స్థపతి పి.సురేంద్ర, అసిస్టెంట్ ఇంజనీర్ ఏ.మురళి, ఆలయ ప్రధాన అర్చకులు ఎస్.రఘురామమూర్తి పాల్గొన్నారు.

## శ్రీ చంద్రశేఖరేంద్ర సరస్వతిస్వామి.. ఆరాధనోత్సవాలు



నెల్లూరులోని చక్రాల వారి ట్రస్ట్ ధ్యానమందిరం కమిటీ ఆధ్వర్యంలో ఇటీవల కంచి కామకోటి పీఠాధిపతి జగద్గురు శ్రీ చంద్రశేఖరేంద్ర సరస్వతీ స్వామి వారి 31వ ఆరాధనోత్సవాలు వైభవంగా జరిగాయి. తొలుత స్వామివారికి పూజలు చేసి ఉత్సవాలు ప్రారంభించారు. ముఖ్యఅతిథిగా అగస్త్యరాజు వెంకటసుబ్బారావు పాల్గొని స్వామివారి విశిష్టతను తెలియజేశారు. స్వామివారు తన 13వ ఏట నుంచి కంచికామకోటి పీఠాధిపతిగా అభిషిక్తులై సుమారు 87 సంవత్సరాలు ఆధ్యాత్మిక సేవలందించారని నిర్వాహకులు తెలిపారు. చక్రాల వారి ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ చక్రాల ఆనంద్‌కుమార్, ట్రస్టు వ్యవస్థాపక అధ్యక్షుడు జంగా శివకుమార్, శివప్రసాద్, లక్ష్మీకామాక్షి, షణ్ముగం, రామ్‌గోపాల్, ములుగు ఉదయకుమార్‌శర్మ, మైపాడు రాజా శర్మ, చక్రాల వెంకట లక్ష్మీనరసింహం తదితరులు పాల్గొన్నారు.

## మాకాని వెంకట్రావు స్వామి ఆరాధన..6న

అవధూత.. భగవాన్ శ్రీ వెంకయ్యస్వామివారి సేవకుడు, శ్రీవారి పాదరేణువు.. మాకాని వెంకట్రావు స్వామివారి 7వ ఆరాధన మహోత్సవం జనవరి 6వ తేదీ నెల్లూరు మూలాపేటలోని 'గురునిలయం'లో జరుగుతుందని మాకాని కుటుంబసభ్యులు మాకాని గోపీచంద్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆ రోజు ఉదయం 6 గంటలకు శ్రీ వెంకయ్యస్వామికి, మాకాని వెంకట్రావు స్వామికి పూజలు అభిషేకాలు చేస్తామని, 9 గంటలకు గురుదేవుల భక్తబృందంచే భజనలు, మధ్యాహ్నం 11 గంటలకు అన్నదానం, సాయంత్రం 6 గంటలకు అఖండ నామసంకీర్తన, 7 గంటలకు ధునిపూజ, పల్లకీసేవ ఉంటాయని, భక్తులు పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కావాలని ఆయన కోరారు.



## డ్రగ్స్ ఉండకూడదు.. రౌడీయిజం కనిపించకూడదు
### - పోలీస్ అధికారులతో ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి

తమ నియోజకవర్గంలో ఎక్కడా డ్రగ్స్ అనేవే ఉండకూడదని, రౌడీయిజం అసలు కనిపించకూడదని నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి పోలీసు అధికారులను ఆదేశించారు. డిసెంబరు 28న నెల్లూరులోని తన కార్యాలయంలో ఆయన రూరల్ నియోజకవర్గ పరిధిలోని పోలీసు అధికారులతో సమావేశమై, నియోజకవర్గ పరిస్థితులను సమీక్షించారు. అనంతరం, మండలంలోని మాదరాజుగూడూరుకు చెందిన వైకాపా నాయకులు తాండ్ర రమణయ్య, బుజ్జయ్య, సుధాకర్, వెంకటేశ్వర్లుకు వారి మిత్రబృందానికి కండువాలు కప్పి టీడీపీలోకి ఆహ్వానించారు.

## ఆర్టీసీ బస్టాండ్‌ను పరిశీలించిన అధికారులు



నెల్లూరులోని ప్రధాన ఆర్టీసీ బస్టాండ్‌ను ఆర్టీసీ ఉన్నతాధికారులు ఇటీవల పరిశీలించి ప్రయాణికులకు అందుతున్న సేవలను ఆరాతీశారు. డిపోలో ఎలక్ట్రిక్ బస్సుల చార్జింగ్ పాయింట్, కార్గో కార్యాలయం వగైరాలను సందర్శించి సిబ్బందికి సూచనలిచ్చారు. ఆర్టీసీ ఉద్యోగులు, అధికారులు శ్రద్ధగా పనిచేసి ఆర్టీసీ ఆదాయం పెంచాలని చెప్పారు. ఈ పరిశీలనలో ఆర్టీసీ ఇ.డి (ఆపరేషన్స్) అప్పలరాజు, సీటీఎం నాగేంద్ర, నెల్లూరు జోనల్ ఇ.డి వెంకటేశ్వరరావు, డిపోమేనేజర్లు మురళీబాబు, శివకేశవయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

### వాకర్స్ 203 జిల్లా 2025 ఎలెక్ట్ గవర్నర్‌గా..
## నలుబోలు బలరామయ్యనాయుడు



వాకర్స్ ఇంటర్నేషనల్ 33వ కన్వెన్షన్ డిసెంబర్ 28-29 తేదీలలో ఏలూరులో జరిగింది. 2024 ప్రెసిడెంట్ వి.మురళీ మోహనరావు ఆధ్వర్యంలో వాకర్స్ క్లబ్‌లు జనవరి నుండి డిసెంబర్ వరకు చేసిన సేవా కార్యక్రమాలకు అవార్డులు, నగదు బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా నెల్లూరు, గుంటూరు, ఒంగోలు జిల్లాలు కలసి 203 వాకర్ జిల్లాకు నలుబోలు బలరామయ్యనాయుడును 203 జిల్లా 2025 ఎలెక్ట్ గవర్నర్‌గా నియమించి సెక్రటరీ జనరల్, రిటర్నింగ్ ఆఫీసర్ ఎస్ ఇసాక్ సర్టిఫికెట్ అందజేసి ప్రమాణం చేయించారు. ఈ సందర్భంగా బలరామయ్య నాయుడు మాట్లాడుతూ, 'ఆరోగ్యమే మహాభాగ్యమని'.. 'నడవండి-ఆరోగ్యంగా ఉండండి' అని వాకర్స్‌కు పిలుపునిచ్చారు. వాకర్స్ ఇంటర్నేషనల్ ప్రెసిడెంట్ 2022 ఎంవి సుబ్బారెడ్డి, ప్రస్తుత 203 జిల్లా గవర్నర్ పలగాటి శ్రీనివాసులురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## యూరియా కొరత తీర్చాలి

జిల్లాలో యూరియా ఎరువు కొరతను తీర్చాలని, యూరియా విక్రయాలకు సంబంధించి దుకాణాలు, సొసైటీల్లో రిజిస్టర్లు సక్రమంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని బీజేపీ నాయకుడు, నమామి గంగే రాష్ట్ర కన్వీనర్ మిడతల రమేష్ డిసెంబరు 28న వ్యవసాయ శాఖ జాయింట్ డైరెక్టర్ సత్యవాణికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాష్ట్రంలో యూరియా నిల్వలు పుష్కలంగా ఉన్నప్పటికీ, నెల్లూరుజిల్లాలో మాత్రం సన్న,చిన్నకారు రైతులకు యూరియా దొరకడం లేదని, బ్లాక్‌మార్కెట్‌లో ఎక్కువ ధరకు కొనుగోలు చేయాల్సి వస్తోందని ఆయన జేడీ దృష్టికి తీసుకువచ్చారు. యూరియా విక్రయాలకు సంబంధించిన రిజిస్టర్లు నిర్వహిస్తే తప్ప ఈ సమస్య కొలిక్కిరాదని ఆయన సూచించారు.




# ఫలించనున్న విపిఆర్ కృషి!



- ఈఎస్ఐ ఆసుపత్రి ఏర్పాటులో ముందడుగు
- నెల్లూరులో స్థల పరిశీలన చేసిన అధికారులు

నెల్లూరు పార్లమెంట్ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి(విపిఆర్) చొరవతో నెల్లూరులో కార్మికవర్గ ప్రజల ఆరోగ్యానికి ఎంతో ఉపయోగకరమైన ఈఎస్ఐ ఆసుపత్రిని ఏర్పాటు చేసేందుకు కేంద్ర ప్రభుత్వం ద్వారా అడుగులు ముందుకు పడుతుండడం పట్ల ప్రజల్లో సంతోషం వ్యక్తమవుతోంది. ఈఎస్ఐసి ప్రాజెక్టును నెల్లూరుకు తీసుకువచ్చేందుకు నెల్లూరు పార్లమెంట్ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి చేసిన కృషి ఫలితంగా ఇటీవల విజయవాడ నుంచి ఆ సంస్థ రీజినల్ డైరెక్టర్ ఎ.వేణుగోపాల్, డాక్టర్ ప్రదీప్, దత్తాత్రేయ, రవికుమార్, కర్తార్ సింగ్ లక్కీ, లీలాకుమారిలతో కూడిన ఈఎస్ఐ బృందం నెల్లూరు నగరానికి వచ్చి ఈఎస్ఐ డిస్పెన్సరీ పరిధిలో ఉన్న 2.18 ఎకరాల స్థలాన్ని పరిశీలించింది. ఇటీవల పార్లమెంట్ సమావేశాల సందర్భంగా విపిఆర్ కేంద్ర కార్మికశాఖ మంత్రి మన్‌సుఖ్ మాండవీయను, ఈఎస్ఐసీ డైరెక్టర్ జనరల్ అశోక్‌కుమార్‌సింగ్‌ను కలిసి నెల్లూరు హెడ్‌క్వార్టర్స్‌లో 100 పడకల ఈఎస్ఐ ఆసుపత్రిని ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేసిన విషయం తెలిసిందే. ఆ సందర్భంగా విపిఆర్ పలు అంశాలను వారి దృష్టికి తెచ్చారు. నెల్లూరుకు కేటాయించిన ఆసుపత్రిని విజయవాడలోని ఇన్సూరెన్స్ మెడికల్ సర్వీసెస్ అథారిటీ వారు, స్థలాభావం అన్న కారణంతో మరో ప్రాంతంలో ఏర్పాటు చేసేందుకు ప్రయత్నిస్తున్నారని, ఆ ఆసుపత్రిని నెల్లూరులోనే ఏర్పాటుచేయాలని విపిఆర్ వారికి విన్నవించారు. ఆ విషయంపై కేంద్రప్రభుత్వ అధికారులు క్షుణ్ణంగా పరిశీలించి నెల్లూరులోని ఈఎస్ఐ డిస్పెన్సరీ పరిధిలో అందుబాటులో ఉన్న 2.18 ఎకరాల్లో 100 పడకల ఈఎస్ఐ ఆసుపత్రిని ఏర్పాటు చేయాలని కోరారు. దాంతో ఎంపీ వేమిరెడ్డి విజ్ఞప్తి మేరకు అన్ని అంశాలను పరిశీలించేందుకు ఈఎస్ఐ బృందం నెల్లూరులో పరిశీలనలు చేసింది. ఆ ఆసుపత్రి ఏర్పాటైతే వందలాదిమంది అసంఘటిత కార్మికులకు మెరుగైన వైద్యం అందుబాటులోకి వచ్చినట్లవుతుందని అందరూ భావిస్తున్నారు.

## విఆర్ హైస్కూల్‌కు పూర్వ వైభవం తెస్తాం

### మంత్రి నారాయణ



నెల్లూరులోని చరిత్రాత్మకమైన విఆర్ హైస్కూలుకు పూర్వవైభవం తీసుకువస్తామని మంత్రి నారాయణ స్పష్టం చేశారు. తాను కూడా చిన్నతనంలో 6 నుంచి 10వ తరగతి వరకు ఇక్కడే చదువుకున్నానని, రాష్ట్రంలోనే ఉత్తమ పాఠశాలగా విఆర్‌హైస్కూల్‌ను తీర్చిదిద్దుతామని చెప్పారు. డిసెంబరు 31న నెల్లూరు నగరంలోని విఆర్ హైస్కూలును మంత్రి సందర్శించారు. అనంతరం మంత్రి విలేకర్లతో మాట్లాడుతూ, 2025 విద్యా సంవత్సరంలో స్కూళ్లు, హైస్కూళ్ళ అభివృద్ధికి కార్యాచరణ సిద్ధమవుతోందని చెప్పారు. రాష్ట్రంలో నాలుగు ప్రాంతంలో కార్పొరేట్ స్థాయిలో స్కూల్ నుంచి జూనియర్ కాలేజ్ వరకు విద్యను అందించేందుకు విద్యాశాఖ మంత్రి లోకేష్ కృషిచేస్తున్నారన్నారు. గతంలో తాను విఆర్ హైస్కూల్లో ప్రారంభించిన రెసిడెన్షియల్ కాలేజ్‌లో పేద వర్గాలకు చెందిన దాదాపు 300 మంది విద్యార్థులు చదువుకున్నారని ఆయన ఈ సందర్భంగా గుర్తుచేశారు. అయితే, వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే రెసిడెన్షియల్ కాలేజీని మూసివేసిందని అవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో నగరపాలక సంస్థ కమిషనర్ సూర్యతేజ, టీడీపీ నాయకురాలు తాళ్లపాక అనూరాధ, విజేత తదితరులు పాల్గొన్నారు.

## పాడిరైతులకు 'మినీ గోకులాలు'



గత ప్రభుత్వం విస్మరించిన మినీ గోకులం షెడ్లు ఇప్పుడు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆధ్వర్యంలో మళ్ళీ ప్రారంభమయ్యాయని, పాడిరైతులకు ప్రయోజనకరంగా మినీ గోకులాల షెడ్లు మంజూరు చేయడం హర్షదాయకమని కోవూరు ఎమ్మెల్యే ప్రశాంతమ్మ సంతోషం వ్యక్తం చేశారు. డిసెంబరు 31న ఇందుకూరుపేట మండలం పాములవారిపాళెం గ్రామంలో ఆమె మినీ గోకులం షెడ్లను ప్రారంభించారు. ఇందుకూరుపేట మండలంలోని పాడిరైతులకు ఈ షెడ్లు మంజూరయ్యాయని, రైతులు వాటిని సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు. అదేవిధంగా 90 శాతం సబ్సిడీతో వచ్చే గోకులమిత్ర పథకాన్ని కూడా రైతులు ఉపయోగించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పశుసంవర్ధకశాఖ జేడీ డాక్టర్ రమేష్‌నాయక్, ఏడీఏహెచ్ మురళీకృష్ణ, ఎంపీడీఓ నాగేంద్రబాబు, నాయకులు దువ్వూరు కల్యాణ్‌రెడ్డి, వీరేంద్రనాయుడు, చెంచుకిషోర్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.



## కొత్త సంవత్సరం.. సందడే సందడి

జనవరి 1వ తేదీన ఆంగ్ల నూతన సంవత్సరాది (2025) వేడుకలను జిల్లా ప్రజలు ఆనందసందోహాల మధ్య జరుపుకున్నారు. పాత ఏడాదికి వీడ్కోలు, కొత్త సంవత్సరానికి స్వాగతం చెప్తూ మంగళవారం అర్ధరాత్రి సమయంలో యువత కేరింతలు కొట్టారు. జనవరి 1 కొత్త సంవత్సరారంభంతో అంతా 'హ్యాపీ న్యూ ఇయర్' అంటూ ఒకరికొకరు శుభాకాంక్షలు చెప్పుకున్నారు. కేకులు కట్ చేసి అందరికీ ఆనందంగా పంచిపెట్టారు.






# బాబు భగీరథ యత్నం!

(మొదటిపేజీ తరువాయి)

జీవనాధారం, వాటివల్లే వ్యవసాయం, పారిశ్రామిక రంగాలు మనుగడ సాగిస్తున్నాయి. ఇక మనరాష్ట్రంలో ప్రవహించే గోదావరి, కృష్ణ, పెన్నా, నాగావళి, వంశధార నదులను ప్రగతి మార్గాలుగా చెప్పుకుంటారు. అయితే సప్లై చానల్స్ దెబ్బతినడం, రిజర్వాయర్లలో పూడిక తీత సమస్య, కాలుష్యం, రుతుపవనాల్లో మార్పుల కారణంగా ఇవి తరచూ ఎండిపోవడంతో పాటు కొన్నిసార్లు వరద ముప్పునూ ఎదుర్కొంటున్నాయి. ఫలితంగా నదీ పరివాహక ప్రాంతాలలోనూ నీటి ఎద్దడి నెలకొనే పరిస్థితులు ఏర్పడుతున్నాయి. ఇలాంటి సంక్లిష్ట సమయంలో అత్యంత సాహసోపేతమైన, అద్భుత ఆలోచనతో నదుల అనుసంధానానికి ఆంధ్ర ముఖ్యమంత్రి చంద్రబాబు శ్రీకారం చుట్టాలని నిర్ణయించారు. ఇందుకోసం గోదావరి జలాలను అటు ఉత్తరాంధ్రకు.. ఇటు రాయలసీమకు తరలించేలా నీటి నిర్వహణ, పంపిణీ కోసం ప్రణాళికలు రూపొందిస్తున్నారు. ఇందుకోసం "తెలుగు తల్లికి జలహారతి" కార్యక్రమం ద్వారా రాష్ట్రంలోని నదులన్నింటినీ అనుసంధానించాలని నిర్ణయించారు. తద్వారా ఉత్తరాంధ్రలో గోదావరి జలాలను పుష్కర లిఫ్టుల ద్వారా నాగావళి, వంశధార నదుల నీటిలో కలిపి శ్రీకాకుళం, విజయనగరం జిల్లాలకు లబ్ధి చేకూర్చనున్నారు. ప్రస్తుతం ఈ జిల్లాల్లో వర్షపాతం సమృద్ధిగా ఉన్నా నీటి నిల్వకు అవకాశం లేకపోవడం వల్ల సాగు, తాగునీటికి ఇక్కట్లు తప్పడం లేదు. ఈనేపథ్యంలో జలహారతితో గోదావరి జలం.. ఉత్తరాంధ్రకు గొప్ప బలం కానుంది.

**నాడు ఇంకుడు గుంతలు..**

**నేడు నదుల అనుసంధానం!**

గతంలో 'పరిగెత్తే నీటికి నడకనేర్పుదాం.. నడిచే నీటిని నిలవమని చెబుదాం' అంటూ ఇంకుడు గుంతల కార్యక్రమాన్ని చంద్రబాబు ప్రారంభించిన విషయం తెలిసిందే. సరిగ్గా అదే తరహాలో ఇప్పుడు సముద్రంలోకి ఏటా వృథాగా పోతున్న నీటిని సద్వినియోగం చేసుకుని రాష్ట్రాన్ని సస్యశ్యామలం చేద్దామంటూ పిలుపునిస్తున్నారు. గత ఏభై ఏళ్లలో ఏటా సగటున 3వేల టీఎంసీల నీరు నదుల ద్వారా వృథాగా సముద్రంలో కలుస్తోందని వాటిలో కనీసం 10శాతం (300 టీఎంసీలు) నీటిని నిల్వచేసుకున్నా ఏపీకి నీటి సమస్య శాశ్వతంగా తీరిపోతుందని ఆయన స్పష్టం చేస్తున్నారు. ఇందుకోసం కేంద్రప్రభుత్వం చేపడుతున్న నదుల అనుసంధాన కార్యక్రమాన్ని ఆంధ్రప్రదేశ్ నుంచే ప్రారంభించేలా వ్యూహాలు రూపొందిస్తున్నారు.

**గోదావరి - బనకచర్ల ప్రాజెక్టుతో కల సాకారం**

మనరాష్ట్రంలో ప్రవహించే నదుల్లో గోదావరి అతిపెద్దది. దాని తర్వాత కృష్ణానది రెండో స్థానంలో ఉంది. అయితే కృష్ణా నదిలో ఏడాది పొడవునా నీటి లభ్యత సాధ్యం కావడం లేదు. దీంతో ప్రభుత్వం గోదావరి జలాల వినియోగంపై ప్రధానంగా ఫోకస్ పెడుతోంది. ఇప్పటికే పట్టిసీమ ప్రాజెక్టు నిర్మించడం ద్వారా గోదావరి, కృష్ణా జలాలను అనుసంధానించి చంద్రబాబు గొప్పవిజయాన్ని సాధించారు. ఇదే ఊపులో కోస్తాలో ప్రవహించే గోదావరి నీటిని రాయలసీమలోని పెన్నానదితో కలిపి చరిత్ర సృష్టించాలని భావిస్తున్నారు. ఇందుకోసం గోదావరి-బనకచర్ల ప్రాజెక్టును డిజైన్ చేస్తున్నారు. ఇందులో భాగంగా మూడు దశల్లో పనులు పూర్తి చేయాలని నిర్ణయించారు.

1వ దశలో పోలవరం కుడికాలువ ద్వారా గోదావరి నీటిని కృష్ణానదిలో కలపడం. తద్వారా తాటిపూడి రిజర్వాయర్‌ను ఉపయోగించుకోవడంతోపాటు కొత్త కెనాళ్లను ఏర్పాటుచేసి ప్రకాశం బ్యారేజీకి 30వేల క్యూసెక్కుల నీటిని తీసుకొస్తారు. ఇందుకోసం రూ. 13,500 కోట్లు వెచ్చించనున్నారు.

2వ దశలో కృష్ణానదికి చేరిన గోదావరి జలాలను నాగార్జున సాగర్ రైట్ మెయిన్ కెనాల్ ద్వారా లిఫ్ట్‌చేసి బొల్లాపల్లి రిజర్వాయర్‌కు తరలిస్తారు. ఇక్కడ 150 టీఎంసీల వరకు నిల్వ చేసుకునే అవకాశం ఉంది. దీనికి రూ. 28,500 కోట్లు ఖర్చు కానుంది.

3వ దశలో బొల్లాపల్లె రిజర్వాయర్ నుంచి కర్నూల్‌లోని బనకచర్ల హెడ్‌రెగ్యులేటర్‌కు రోజుకు 2 టీఎంసీల చొప్పున నీటిని తరలిస్తారు. ఇందుకోసం అనేక లిఫ్టులను, టెన్నెళ్లను నిర్మించనున్నారు. ఈ క్రమంలో గోదావరి నీటిని దాదాపు 45 నుంచి 265మీటర్ల ఎత్తు వరకు తీసుకెళ్లాల్సి ఉంది. ఇది అత్యంత కష్టంతో కూడుకున్న విషయం. ఇందుకోసం రూ. 38,500 కోట్లు వెచ్చించనున్నారు. దీంతో ప్రాజెక్టు వ్యయం దాదాపు రూ. 80,112 కోట్లుకు చేరుకోనుంది.

**సవాళ్లు అనేకం..**

ఈ ప్రాజెక్టు కోసం దాదాపు 48 వేల ఎకరాల భూసేకరణ చేపట్టాల్సి ఉంది. అలాగే 15 ఎకరాల్లో ఫారెస్టు ల్యాండ్ ముంపునకు గురికానుంది. వీటికి కేంద్ర అటవీ పర్యావరణ శాఖ అనుమతులు ఇవాల్సి ఉంటుంది. ఇవి అంత తొందరగా లభిస్తాయా..? లేదా? అనేది కీలకాంశం. అలాగే ప్రాజెక్టు గడువు మూడేళ్లుగా నిర్ణయించారు.

అయితే, ఇది ఏడాది ఆలస్యమైతే వ్యయం అదనంగా 40 శాతం వరకు పెరిగే అవకాశం ఉంటుంది. అంటే.. మొత్తం వ్యయం ఒక్క సంవత్సరంలోనే రూ. 80 వేల కోట్ల నుంచి ఏకంగా రూ. 1.20 లక్షల కోట్లకు చేరుకుంటుంది. ఇక 4వేల మెగావాట్ల వరకు కరెంట్‌ను కూడా లిఫ్టులు, పంపుల కోసం వినియోగించాల్సి ఉంది. ఈ నేపథ్యంలో ఇంత తక్కువ వ్యవధిలో ఈ ప్రాజెక్టును పూర్తిచేయడం కత్తిమీద సామే. అయితే, కేంద్ర ప్రభుత్వం ఆసియా అభివృద్ధి బ్యాంక్ ద్వారా రూ. 40 వేల కోట్లను అందించనుందని సమాచారం.

**సకాలంలో పూర్తయితే...**

**రాయలసీమ మరో కోనసీమే!**

గోదావరి-బనకచర్ల ప్రాజెక్టు సకాలంలో పూర్తయితే ఆంధ్రప్రదేశ్ రూపురేఖలు పూర్తిగా మారిపోతాయనడంలో సందేహమే లేదు. ఎందుకంటే గోదావరి జిల్లాల నుంచి నీరు కృష్ణా, గుంటూరు, ప్రకాశం, నెల్లూరుజిల్లాలోని ప్రాంతాలకు విరివిగా చేరుకునే అవకాశం ఉంటుంది.

తుంగభద్ర, శ్రీశైలం, నాగార్జునసాగర్, పులిచింతల, ప్రకాశం బ్యారేజ్ ఎప్పుడూ నీటిలో కళకళలాడుతాయి. ఇక అత్యంత ముఖ్యంగా నదుల అనుసంధానం పూర్తయితే రాళ్లసీమగా ఉన్న రాయలసీమ పచ్చని పంట పొలాలతో మరో కోనసీమను తలపించడం తథ్యం. బనకచర్లను రాయలసీమ ముఖద్వారంగా భావిస్తున్న ప్రభుత్వం అక్కడి నుంచి నీటిని హంద్రీనీవా, తెలుగుగంగ, ఎస్ఆర్‌బీసీ, కేసీ కెనాల్, గడికోట, సోమశిలకు తరలించనుంది. ఈ కల సాకారమైతే నదుల అనుసంధానంతో ఓ అద్భుతఘట్టం ఆవిష్కృతమైనట్లేనని.. ఆ తర్వాత రాయలసీమలో కరువు అనే మాటే వినిపించదని విశ్లేషకులు భావిస్తున్నారు.

ఇక అనుకున్నది అనుకున్నట్లుగా జరిగి ఈ ప్రాజెక్టును మూడు నెలల్లో ప్రారంభించి మూడేళ్లలో ముగిస్తే.. చంద్రబాబు అసాధ్యాన్ని సుసాధ్యం చేసినట్లే. జలహారతితో తెలుగు నేలకు జవసత్వాలు నింపిన నాయకుడిగా ఆచంద్రార్కం ఆయన కీర్తి నిలుపుకున్నట్లే. జల సంకల్పం ఫలిస్తే ఆయన అపర భగీరథుడే...!


వందన పూర్వక అభినందనలు





మా అభివృద్ధికి అహర్నిశలు శ్రమించి.. ఒక గురువుగా, ఒక స్నేహితుడిగా, ఒక మార్గదర్శిగా మాకు జీవితంలో ఉన్నత విలువలు నేర్పిన మా తండ్రి గారు,

పూజ్యులు నిడిగంటి మల్లికార్జునరావు గారు

తిరుమల శ్రీవారి పాదాల చెంత 34 సంవత్సరాలు సేవలందించి, తన 75వ ఏట వజ్రోత్సవ శుభవేళ తిరుమల తిరుపతి దేవస్థానం వారిచే సతీసమేతంగా పెన్షనర్స్ డే నాడు సన్మానం పొందిన సందర్భంగా వారికి

మా వందన పూర్వక అభినందనలు.

మీకున్న దైవభక్తికి నిదర్శనం కేశవరం గ్రామంలో నిర్మించిన నిలువెత్తు అంజనీపుత్రుని విగ్రహం.

మా బాల దీవెన బ్రహ్మదీవెనయై ఆయన ఆయురారోగ్యాలతో శత వసంతోత్స సంబరాలు కూడా జరుపుకోవాలని ఆ వేంకటాచలపతిని ప్రార్థిస్తూ...

ప్రేమ పూర్వక అభినందనలతో..

కుమారులు:

ఎన్. ఉదయకిరణ్, AT&T, Dallas, USA

ఎన్. శ్రావణ్‌కుమార్, CVS, Texas, USA

ఎన్. హరికిషోర్, SAP, Tennacy, USA

మనుమలు & మనుమరాండ్రు:

వేదశ్రీ, చరణ్, రోహన్,

రోషిని, మయూక్

మరియు కుటుంబసభ్యులు


# పోలేరమ్మతల్లిని దర్శించుకున్న..వేమిరెడ్డి



మండల కేంద్రమైన అల్లూరులో గ్రామదేవతలు పోలేరమ్మ, గంగమ్మ, కలుగోళమ్మ అమ్మవార్ల జాతర సందర్భంగా, నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి ఈనెల 1న అల్లూరుకు వెళ్ళి, పోలేరమ్మ అమ్మవారిని దర్శించుకున్నారు. ఉత్సవ కమిటీ ప్రతినిధులు, వేదపండితులు ఆయన్ను ఘనంగా స్వాగతించి, అమ్మవారికి ప్రత్యేక పూజలు చేయించారు. అనంతరం వేమిరెడ్డి మాట్లాడుతూ, అల్లూరులో ముగ్గురమ్మల జాతర వైభవంగా నిర్వహిస్తుండడం సంతోషకరమన్నారు. గ్రామదేవతల దయతో గ్రామస్తులు, రైతులంతా ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో ఉండాలని ఆయన అమ్మవారిని ప్రార్థించారు. ఆయనతో పాటు సోదరుడు వేమిరెడ్డి కోటారెడ్డి, నాయకులు బీద గిరిధర్, ఏ.శ్రీనివాసులురెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## కాలధర్మం

# అత్తివరపు లాలసమ్మ




అత్తివరపు హరినాథరెడ్డి సతీమణి అత్తివరపు లాలసమ్మ తన 76వ ఏట డిసెంబర్ 27 శుక్రవారం చెన్నైలో కన్నుమూశారు. ఆమె గత కొంత కాలంగా అనారోగ్యంతో మృత్యువుతో పోరాడుతున్నారు. చివరికి మృత్యువే జయించి ఆమె తుదిశ్వాస విడిచారు. కొడవలూరు మండలం బొడ్డువారిపాళెంలో పేరుమోసిన రైతు కోటంరెడ్డి రామిరెడ్డి - సుశీలమ్మల మూడవ సంతానంగా 1948లో జన్మించారు లాలసమ్మ. నెల్లూరు రూరల్‌లోని మాదరాజుగూడూరులో రావుబహదూర్ కుటుంబంగా పేరుగాంచిన అత్తివరపు వారి ఇంటి కోడలుగా 1968లో అడుగుపెట్టారు ఈ కోటంరెడ్డి వారి ఆడపడుచు. లాలసమ్మ స్వతహాగా మృదుస్వభావి, మితభాషి. శత్రువుకైనా హానీ చేయకూడదన్న తత్వం ఆమెది. ఆపదలో వున్నవారికి సాయం చేయడంలో ఎముకలేని చెయ్యి లాలసమ్మది. నిస్వార్థ సేవకురాలిగా మాదరాజుగూడూరు వాసులు లాలసమ్మని కీర్తిస్తుంటారు. తాను కుడిచేత్తో చేసిన సాయం తన ఎడమ చేతికి కూడా తెలియగూడదన్నది ఆమె స్వభావం.

అత్తివరపు హరినాథ్‌రెడ్డి - లాలస దంపతులను ఒకరికోసం ఒకరు పుట్టిన అందమైన జంటగా వారి పెళ్ళైన కొత్తలో అందరూ అభివర్ణించేవారు. ఆమెకి భర్త హరినాథరెడ్డి, కుమార్తె కవిత, అల్లుడు సిద్ధారెడ్డి వెంకటరంగారెడ్డి ఉన్నారు. తన ఇద్దరు మనుమళ్ళు రోహిత్, రోహన్‌లంటే ఆమెకి ప్రాణం. మృత్యువు క్యాన్సర్ మహమ్మారి రూపంలో ఆమెను ఆవహించి, ఆమె ప్రాణాలని హరించింది. జీవితంలో ఎన్నో ఒడుదుడుకులని ధైర్యంగా ఎదుర్కొన్న ధీశాలి లాలసమ్మ. తాను త్వరలో చనిపోతానని తెలిసినా ఏమాత్రం అధైర్యపడకుండా, కృంగిపోకుండా తన చివరిశ్వాస వరకు ఆమె నవ్వుతూనే మృత్యువుతో తలపడ్డారు.

లాలసమ్మ కుటుంబసభ్యులకి మనోస్థైర్యాన్ని ఇవ్వాలని దైవాన్ని ప్రార్థిస్తూ, ప్రగాఢ సానుభూతి తెలుపుతోంది 'లాయర్'.

# 'స్వయంపాకుల'కు సతీ వియోగం



నెల్లూరు విఆర్ హైస్కూలు ప్రధానోపాధ్యాయులుగా పనిచేసి, కొంతకాలం క్రితం రిటైరైన..ప్రముఖ జ్యోతిష పండితులు.. స్వయంపాకుల శ్రీనివాసులు ధర్మపత్ని అలమేలు మంగమ్మ(73) డిసెంబరు 26వ తేదీ రాత్రి కాలధర్మం చెందారు. నెల్లూరులోని వారి నివాసంలో ఆమె తుదిశ్వాస విడిచారు. వారికి ముగ్గురు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. ఒంగోలు ఆమె స్వస్థలం. స్వయంపాకుల శ్రీనివాసులును వివాహం చేసుకుని వారిక్కడే స్థిరపడిపోయారు. కుమారుడు స్వయంపాకుల కిరణ్ సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ అయినప్పటికీ, తండ్రి మంచి జ్యోతిష్యులు కనుక తనకు కూడా జ్యోతిష్‌శాస్త్రంపై గురి కుదిరి, పొట్టి శ్రీరాములు విశ్వవిద్యాలయంలో చేరి, జ్యోతిష్య శాస్త్రంలో పట్టభద్రులయ్యారు. ఇప్పుడు నెల్లూరులోనే ఉంటూ తండ్రి స్వయంపాకుల మార్గదర్శకంలో ప్రముఖ జ్యోతిష్య పండితునిగా రాణిస్తున్నారు. ఏదేమైనా, తల్లి మరణంతో విషాదంలో ఉన్న వారి కుమార్తెలు, కుమారునికి, భార్య మృతితో ఆవేదనలో ఉన్న మా ఆత్మీయులు స్వయంపాకుల శ్రీనివాసులుకు, వారి బంధుమిత్రులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తూ, ఆ మాతృమూర్తి ఆత్మకు సద్గతి కలగాలని ఆ భగవంతుడిని ప్రార్థిస్తోంది..'లాయర్'!..

## విపిఆర్ చొరవతో..
# పాటూరుకి చేనేత క్లస్టర్

**• 76.32 లక్షలతో ఏర్పాటుకు కేంద్రం ఓకే**

కొత్త సంవత్సరం రోజు పాటూరు చేనేతలకు తీపి కబురు అందింది. నెల్లూరు పార్లమెంట్ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి (విపిఆర్) చొరవతో కోవూరు నియోజకవర్గం పాటూరు-గుమ్మళ్లదిబ్బలో చేనేత క్లస్టర్ ఏర్పాటుకు కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలిపింది. అందుకు సంబంధించి రూ. 76.32 లక్షల నిధులను మంజూరు చేస్తూ గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. తొలి విడతగా దాదాపు 28 లక్షలు మంజూరు చేసింది. ఈ కేంద్రం ఏర్పాటుతో మొత్తంగా స్థానికంగా ఉన్న 175 చేనేత కుటుంబాలకు లబ్ధి చేకూరనుంది.

కోవూరు నియోజకవర్గంలో ఉన్న పాటూరులో స్మాల్ క్లస్టర్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్‌లో భాగంగా ప్రత్యేక క్లస్టర్ ఏర్పాటు చేయాలని నెల్లూరు పార్లమెంట్ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి ఇటీవల ఢిల్లీలో కేంద్ర జౌళిశాఖ మంత్రి గిరిరాజ్‌సింగ్‌కు విన్నవించిన విషయం తెలిసిందే. పాటూరులో క్లస్టర్ ఏర్పాటు చేయాల్సిన ఆవశ్యకతను విపిఆర్ కేంద్రమంత్రికి వివరించారు. అందుకు కేంద్రం స్పందించింది. ఆంధ్రప్రదేశ్ చేనేత మరియు జౌళి శాఖ కమిషనర్.. జాతీయ చేనేత అభివృద్ధి కార్యక్రమం కింద 5 కొత్త స్మాల్ క్లస్టర్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్‌లను చేనేత అభివృద్ధి కమిషనర్‌కు సమర్పించారు. అందులో పాటూరు కూడా ఒకటి కావడంతో చేనేతకారులు సంబరపడిపోతున్నారు. ఎంపీ వేమిరెడ్డికి స్థానిక చేనేతకారులంతా ధన్యవాదాలు చెప్తున్నారు.

### అవసరమైన శిక్షణ..సహకారం :

ఈ క్లస్టర్ ఏర్పాటుతో స్థానికంగా ఉండే చేనేతలకు ఎంతో మేలు జరుగుతుంది. క్లస్టర్ పరిధిలో ఉన్న చేనేతలకు మగ్గం సామాగ్రి అందించడంతో పాటు వారికి ప్రత్యేక శిక్షణ అందిస్తారు. అలాగే మగ్గం వర్క్‌లో అధునాతన విధానాలు సమకూరుస్తారు. మార్కెట్‌లో బాగా డిమాండ్ ఉన్న డిజైన్లపై తగిన శిక్షణ అందించి వారికి నేర్పిస్తారు. ఎవరైనా చేనేత కారునికి వ్యక్తిగతంగా సొంత స్థలం ఉండి రూమ్ ఏర్పాటు చేయాలని భావిస్తే అందుకు తగ్గ నిధులు సమకూరుస్తారు. వారి ఉత్పత్తులకు మార్కెట్‌లో మంచి విలువ ఉండేలా సహకరిస్తారు. ఇలా చేనేతలను అన్ని విధాలా ఆదుకునేందుకు, వారికి అండగా తగిన ప్రోత్సాహం అందిస్తారు.

# సంక్షేమానికి చిరునామా.. చంద్రబాబు పాలన

**- ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి**



ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాయకత్వంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అభివృద్ధి దిశగా పయనిస్తోందని, ప్రజా సంక్షేమానికి చిరునామాగా బాబు పాలన సాగుతోందని ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి సంతోషం వ్యక్తం చేశారు. డిసెంబరు 31న ఇందుకూరుపేట మండలం పున్నూరు గ్రామంలో ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్న ఆమె ఆ గ్రామంలో సచివాలయ సిబ్బందితో కలిసి ఇంటింటికి తిరిగి పెన్షన్లు అందచేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే స్థానిక సమస్యలపై స్పందించారు. పున్నూరు గ్రామంలో పంట పొలాలకు వెళ్లే డొంకదారిని బాగు చేయిస్తానని హామీ యిచ్చారు. పున్నూరు-ముదివర్తి పాళెం రోడ్డు నిర్మాణం త్వరితగతిన పూర్తయ్యేలా చూస్తానన్నారు. చెరువు పూడిక తీసుకునేందుకు విపిఆర్ ఫౌండేషన్ ద్వారా ప్రొక్లయిన్ అందిస్తామన్నారు. శిథిలావస్థకు చేరిన గిరిజన కాలనీ పునర్నిర్మాణానికి కృషి చేస్తానన్నారు. స్మశాన మరమ్మతుల కోసం పున్నూరు మూలపాళెం వాసులకు లక్ష రూపాయల విరాళాన్ని ప్రకటించారు. ఈ కార్యక్రమంలో ఇందుకూరు పేట ఎంపీడీఓ నాగేంద్రబాబు, మండల అధ్యక్షులు వీరేంద్రనాయుడు, టీడీపీ సీనియర్ నాయకులు దువ్వూరు కళ్యాణ్‌రెడ్డి, చెంచు కిషోర్‌యాదవ్, కోడూరు కమలాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# కార్పొరేషన్ కార్మికుల కష్టాలు తీర్చండి

**• సీఐటీయు ఆధ్వర్యంలో ధర్నాందోళన**

నెల్లూరు నగరపాలక సంస్థలో పనిచేస్తున్న కార్మికుల కష్టాలు తీర్చాలంటూ ఇటీవల సీఐటీయు ఆధ్వర్యంలో ఏపీ మునిసిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ సారధ్యంలో కార్పొరేషన్ కార్యాలయం ఎదుట ధర్నాందోళన నిర్వహించారు. మరణించిన కార్మికుల వారసులకు ఉద్యోగాలివ్వాలని ఎంతోకాలం నుంచి కోరుతున్నా ఆ ఫైల్‌ను మూలనపడేశారంటూ నాయకులు అసంతృప్తి వ్యక్తం చేశారు. కార్మికుల కోసం రెయిన్‌కోర్టులు వచ్చి వున్నా, వాటిని కార్మికులకు ఇవ్వడం లేదన్నారు. కార్మికుల జీతాల నుంచి పట్టుకున్న పీఎఫ్ మొత్తం నుంచి రుణాలు తీసుకుందామన్నా అధికారులు సహకరించడం లేదన్నారు. ఇలా ఎన్నో రకాల సమస్యలున్నా కార్మికుల, ఉద్యోగుల బాధలను మాత్రం ఎవరూ పట్టించుకోవడం లేదంటూ వారు నిరసన తెలిపారు. సీఐటీయు నాయకులు కత్తి శ్రీనివాసులు, కె.పెంచలనరసయ్య, మునిసిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు లోకేష్, అశోక్, శ్రీనివాసులు, బాలు, పలువురు మహిళా నాయకులు పాల్గొన్నారు. అనంతరం, వారు మునిసిపల్ కమిషనర్ సూర్యతేజకు వినతిపత్రం సమర్పించారు.

# 3750 కోట్ల పెట్టుబడులు.. 17వేల మందికి ఉద్యోగాలు

## ప్రగతి పథంలో పరుగులు తీస్తున్న.. శ్రీ సిటీ

***దేశంలోని అత్యుత్తమ పారిశ్రామికకేంద్రాలలో ఒకటైన శ్రీసిటీ ప్రగతి పథంలో పరుగులు తీస్తోంది. 2024లో దాదాపు 3750 కోట్ల రూపాయల పెట్టుబడులతో పరిశ్రమలు నెలకొల్పి, 17వేల మందికి పైగానే ఉద్యోగావకాశాలు కల్పించి పారిశ్రామిక రంగంలో శ్రీసిటీ సాటిలేని మేటిగా రాణిస్తోంది. 2024లోనూ తనదైన ప్రత్యేకతతో ప్రపంచవ్యాప్తంగా పారిశ్రామికవేత్తల దృష్టిని ఆకర్షించింది. 9 పరిశ్రమలు తమ ప్లాంట్‌ల నిర్మాణాలు చేపట్టగా, 16 పరిశ్రమలు ఉత్పత్తులు ప్రారంభించాయి. ఇప్పటికే శ్రీసిటీలో కొలువున్న 9 ప్రముఖ కంపెనీలు, వ్యాపార పురోగతిలో భాగంగా అదనపు ప్లాంట్లను నిర్మించి, తమ వార్షిక ఉత్పత్తి సామర్థ్యాన్ని విస్తరించాయి. తొలినుంచీ సుస్థిర ప్రగతికి పెద్దపీట వేసిన శ్రీసిటీ, 2024లోనూ జోరుగా తన ప్రగతి ప్రస్థానాన్ని కొనసాగించింది. ప్రపంచవ్యాప్త పెట్టుబడులను ఆకర్షించే ప్రధాన ఆర్థిక వృద్ధి కేంద్రంగా తన స్థానాన్ని మరింత పటిష్టం చేసుకుంది. అందుకే, శ్రీసిటీ ప్రస్థానంలో 2024 కూడా మరో ముఖ్యమైన సంవత్సరమంటూ శ్రీసిటీ వ్యవస్థాపక మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి స్పష్టం చేశారు. శ్రీసిటీ పారిశ్రామిక ప్రగతి పట్ల ఆయన ఆనందం వ్యక్తం చేయడంతో పాటు, అందులో భాగస్వామ్యులైన ప్రతి ఒక్కరికి ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలియజేశారు.***

### 2024లో..కొన్ని ముఖ్య ఘటనలు:

2024 ఆగస్టు 19న రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు, రాష్ట్ర పరిశ్రమల శాఖా మంత్రి టి.జి.భరత్‌తో కలిసి శ్రీసిటీ ప్రగతి ఉత్సవాలలో పాల్గొనడం విశేషం. ఈ కార్యక్రమంలో ముఖ్యమంత్రి చేతుల మీదుగా కొన్ని నూతన పరిశ్రమల ప్రారంభం కావడం, మరికొన్ని పరిశ్రమలకు భూమిపూజ జరగడం, వారి సమక్షంలోనే కొన్ని కంపెనీలతో అవగాహన ఒప్పందాలపై సంతకాలు చేయడం జరిగింది. వీటితో పాటు శ్రీసిటీలో నూతనంగా నిర్మించిన ఫైర్ స్టేషన్ సముదాయానికి ప్రారంభోత్సవం, అధునాతన పోలీస్ స్టేషన్ నిర్మాణానికి శంకుస్థాపన జరిగాయి.

మార్చి 6న మిజోరాం గవర్నర్ డాక్టర్ కంభంపాటి హరిబాబు శ్రీసిటీని సందర్శించారు. శ్రీసిటీ పారిశ్రామిక ప్రగతి, ఉపాధి కల్పన, మహిళా సాధికారత, నైపుణ్యాభివృద్ధి, కార్పొరేట్ సామాజిక బాధ్యత కార్యక్రమాలను ప్రశంసించారు.

నవంబర్ 14న.. నీతి ఆయోగ్ సీఈఓ బీవీఆర్ సుబ్రహ్మణ్యం శ్రీసిటీని సందర్శించారు.

అక్టోబర్ 29న రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఆహార శుద్ధి శాఖా మంత్రి టి.జి.భరత్ శ్రీసిటీ సీఈఓలు ఇతర ఉన్న తాధికారులతో సమావేశమై రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పారిశ్రామిక విధానం-4.0 తీరు తెన్నుల గురించి వివరించారు.

డిసెంబర్ 18న, ఇసుజు మోటార్స్ ఇండియా తమ 1,00,000వ 'మేడ్ ఇన్ ఇండియా' వాహనం 'ఇసుజు డి-మాక్స్ వి-క్రాస్'ను ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ పరిశ్రమలు-వాణిజ్య శాఖ కార్యదర్శి డాక్టర్ ఎన్.యువరాజ్ చేతులమీదుగా ఆవిష్కరించారు.

### విశిష్ట సందర్శకులు, ప్రతినిధులు:

బెల్జియం, జపాన్, రియూనియన్ ఐలాండ్ (ఫ్రాన్స్), రష్యా దేశాలకు చెందిన కాన్సుల్ జనరల్స్, ఉన్నత స్థాయి అధికారుల సందర్శనలతో భవిష్యత్తులో పెట్టుబడులకు అనువైన గమ్య స్థానంగా శ్రీసిటీకి ఉన్న ప్రాధాన్యత మరోసారి స్పష్టమైంది. భారత్‌లోని జపాన్ రాయబారి శ్రీసిటీని సందర్శించారు. అదనంగా, సింగపూర్, బెలారస్, మరియు జపాన్‌కు చెందిన హిరోషిమా మరియు టోయామా ప్రిఫెక్చర్ల నుండి ఉన్నత స్థాయి ప్రభుత్వ, వ్యాపార ప్రతినిధుల పర్యటనలు మరింత ప్రాధాన్యతను చేకూర్చాయి. అంతేకాక కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు చెందిన అనేక మంది ఉన్నత స్థాయి అధికారులు, వివిధ పరిశ్రమల ముఖ్య కార్యనిర్వహణాధికారులు 2024లో శ్రీసిటీని సందర్శించారు.

చెన్నైలోని జైన్ ఇంటర్నేషనల్ ట్రేడ్ ఆర్గనైజేషన్‌కి చెందిన 100 మంది సభ్యుల యువ ఔత్సాహిక పారిశ్రామికవేత్తల ప్రతినిధి బృందం, సింగపూర్ వాణిజ్య, పరిశ్రమల మంత్రిత్వ శాఖ పరిధిలోని ఎంటర్‌ప్రైజ్ సింగపూర్ ఏజెన్సీకి చెందిన తొమ్మిది మంది సీనియర్ అధికారుల ప్రతినిధి బృందం శ్రీసిటీని సందర్శించాయి. జాగృతి యాత్ర ద్వారా 530 మంది ఔత్సాహిక పారిశ్రామిక వేత్తల బృందం 'మేక్ ఇన్ ఇండియా', ఉద్యోగ కల్పన లక్ష్యాలతో పురోగమిస్తున్న శ్రీసిటీ అభివృద్ధిని ప్రశంసించారు.

### 'కూల్ క్యాపిటల్' గా ఆవిర్భావం...

డైకిన్, బ్లూస్టార్, అంబర్, ఈప్యాక్ డ్యూరబుల్, హావెల్స్ వంటి ప్రముఖ కంపెనీలు ఏర్పాటుతో పాటు వీటికి వివిధ ఉప పరికరాలు సరఫరా చేసే నిడెక్ వంటి వివిధ అనుబంధ కంపెనీల రాకతో దేశంలో ఎయిర్ కండిషనర్ల తయారీ కేంద్రంగా, 'కూల్ క్యాపిటల్'గా శ్రీసిటీ ఆవిర్భవించింది. పర్యావరణ నిర్వహణలో నిబద్ధత, అమలు విధానాల్లో శ్రీసిటీ అంతర్జాతీయ ఖ్యాతి గడించింది. ఈ చర్యల్లో భాగంగా చేపట్టిన మౌలిక సదుపాయాల అభివృద్ధి, పలు వినూత్న కార్యక్రమాలకు గుర్తింపుగా పలు అవార్డులు వరించడం ద్వారా పర్యావరణ వృద్ధి, స్థిరమైన అభివృద్ధిలో ప్రపంచ లీడర్‌గా శ్రీసిటీ తన స్థానాన్ని సుస్థిరం చేసుకుంది.

### ఆత్మనిర్భర్ భారత్ స్ఫూర్తితో :

ఆత్మనిర్భర్ భారత్ స్ఫూర్తితో శ్రీసిటీ అనేక సామాజిక సదుపాయాల కల్పనకు కూడా దృష్టి సారించింది. వ్యాపార ప్రపంచంలో తన విజయాలకు గుర్తింపుగా పలు ప్రశంసలు, అవార్డులు అందుకుంది. ఇందులో ముఖ్యంగా హెరాల్డ్ గ్లోబల్ ఇంటర్నేషనల్ బ్రాండ్ అడ్వర్టైజింగ్ రీసెర్చ్ అండ్ కన్సల్టింగ్ ఈ దశాబ్దపు అత్యుత్తమ బ్రాండ్ అవార్డు (ముంబైలో నిర్వహించిన గోల్‌ఫెస్ట్ కాన్వేవ్ 2024) మరియు కాన్ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఇండస్ట్రీ (సిఐఐ) సంస్థ వారి "సీఎఫ్ఓ ఎక్సలెన్స్ అవార్డ్" దక్కాయి. అలాగే శ్రీసిటీలోని వెంచర్ ఆటోమోటివ్, ఐఎఫ్ఎఫ్, టాటా స్మార్ట్ ఫుడ్స్, యాక్సెంచర్ ఫార్మా, మ్యాంగో రిసార్ట్స్ పరిశ్రమలు వాటి ప్రత్యేకతలకు గాను అవార్డులు, ప్రశంసలు అందుకున్నాయి.

### కార్పొరేట్ సామాజిక బాధ్యత

శ్రీసిటీ మరియు వివిధ పరిశ్రమలు సామాజిక సంక్షేమం పట్ల తమ నిబద్ధతను ప్రదర్శిస్తూ, వరద సహాయ కార్యక్రమాలను మద్దతుగా జిల్లా విపత్తు సహాయ నిధికి మొత్తంగా రూ. 1కోటి విరాళం అందించాయి. పరిసర ప్రాంత సామాజికాభివృద్ధి కార్యక్రమాల కొరకు రూ. 3.08 కోట్లు పైగా ఖర్చు పెట్టాయి. శ్రీసిటీ జపనీస్ కంపెనీస్ అసోసియేషన్, పార్కిసన్ ప్యాకేజింగ్, యూనిఛార్మ్, ట్రికాల్, ISUZU మోటార్స్, NS ఇన్‌స్ట్రుమెంట్స్, ఐఎంఓపి, హామిల్టన్ మొదలైన పరిశ్రమలు రూ. 3.08 కోట్లకు పైగా CSR ప్రాజెక్టులు చేపట్టి, విద్య, ఆరోగ్య సంరక్షణ, సమాజ అభివృద్ధికి తమవంతు సహాయసహకారాలు అందించాయి. మొండెలెజ్, కోల్గేట్, కెలాగ్స్ కంపెనీలు పరిసర ప్రాంతాల అభివృద్ధికి తమవంతుగా సహకరించాయి. ఇవిగాక, శ్రీసిటీ ఫౌండేషన్ ద్వారా రక్తదాన శిబిరాలు, క్లీన్ అండ్ గ్రీన్ కార్యక్రమాలు నిర్వహించారు.

అయితే, శ్రీసిటీ విజయాలు కేవలం ఆర్థిక గణాంకాలకే పరిమితం కాలేదు. ఈ ఏడాదిలో శ్రీసిటీ ఆధ్యాత్మిక సాహిత్య వేదిక శ్రీవాణి నిర్వహించిన సాంస్కృతిక, సాహిత్య కార్యక్రమాలతో ఈ ప్రాంతం సరికొత్త పరిమళాలతో విరాజిల్లేలా చేసింది. శ్రీవాణి ద్వారా నిర్వహించిన భజనలు, కళా ప్రదర్శనలు, సాహిత్య చర్చలు, దైవిక కార్యక్రమాలు శ్రీసిటీ పరిసర ప్రజల ప్రశాంత జీవనానికి బాటలు వేశాయి. ప్రఖ్యాత సాహితీవేత్త కిరణ్‌ప్రభ 'టాక్ షో', సినీ చరిత్రకారుడు ఎస్.వి.రామారావు సోదాహరణ ప్రసంగం, త్యాగరాజ ఆరాధన సంగీత విభావరి, ఉగాది పురస్కారాలు, శ్రీ ప్రసన్న వేంకటేశ్వరస్వామి వార్షికోత్సవం, కవయిత్రి మాతృశ్రీ తరిగొండ వెంగమాంబపై సాహిత్య-సంగీత కార్యక్రమం, వైకుంఠ ఏకాదశి వేడుకలు, గోపూజ, భాగవత సప్తాహం.. శ్రీవాణి నిర్వహించిన కొన్ని ముఖ్యమైన కార్యక్రమాలు. ఏదేమైనా, నిరంతర ప్రగతి మరియు వినూత్న ఆవిష్కరణలతో పురోగమిస్తూ, భారతదేశ ఆర్థిక సుసంపన్నతకు మరియు స్థిరమైన అభివృద్ధికి శ్రీసిటీ ఓ వెలుగు దీపంగా నిలిచిందనడంలో ఎలాంటి అతిశయోక్తి లేదు.

## కాలువ గట్లపై ఉన్న..
# పేదల ఇళ్లను తొలగించేది లేదు

### ❍ మంత్రి నారాయణ హామీ



నెల్లూరు నగరంలోని సర్వేపల్లి కాలువ, జాఫర్ కాలువ గట్లపై ఉన్న పేదల ఇళ్లను ఎటువంటి పరిస్థితిలోనూ తొలగించబోమని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పొంగూరు నారాయణ స్పష్టం చేశారు. పేద ఇంటి నుండి ఈ స్థాయికి వచ్చిన తనకు నిరుపేదల కష్టాలు పూర్తిగా తెలుసని అంటూ, పేదల ఇళ్లు తొలగిస్తామని కొందరు చేస్తున్న అసత్య ప్రచారాన్ని ఎవరూ నమ్మవద్దని మంత్రి ప్రజలను కోరారు. డిసెంబరు 31న ఆయన నగరంలోని 16వ డివిజన్ గుర్రాల మడుగు సంఘం ప్రాంతంలో ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీ కార్యక్రమంలో, నుడా చైర్మన్ శ్రీనివాసులరెడ్డి, రాష్ట్ర వక్ఫ్‌బోర్డ్ చైర్మన్ అబ్దుల్ అజీజ్, నగరపాలక సంస్థ కమిషనర్ సూర్యతేజతో కలిసి పాల్గొని పింఛన్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాష్ట్రంలో ఆర్థిక వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉన్న పరిస్థితులను దృష్టిలో పెట్టుకుని, ఒక్కొక్కటిగా సమస్యలను చక్కదిద్దుతూ, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నాయకత్వంలో కూటమి ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు అందిస్తుందన్నారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాల సమగ్ర అభివృద్ధి లక్ష్యంగా ప్రతి జిల్లాకు పరిశ్రమలను తీసుకువస్తామన్నారు. పరిశ్రమలతోనే అభివృద్ధి సాధ్యమవుతుందని, ఆయా ప్రాంతాల యువతీ యువకులకు ఉద్యోగాలు వచ్చి, వారి ఆర్థిక స్థితి మెరుగుపడటమే కాకుండా రాష్ట్రం ఆర్థికంగా కుదుటపడుతుందన్నారు. ప్రజలకిచ్చిన ప్రతి హామీని నెరవేర్చేందుకు కూటమి ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉందన్నారు. నెల్లూరు నగర పరిధిలో 46,383 మందికి పెన్షన్లు అందజేస్తున్నామన్నారు. గతానికి ఇప్పటికీ గణనీయంగా వచ్చిన మార్పును ప్రజలందరూ చూస్తున్నారన్నారు. నగరంలో పెండింగ్‌లో ఉన్న భూగర్భ డ్రైనేజీ, మంచినీటి వసతి సౌకర్యాలను తొందర్లోనే పూర్తి చేస్తామన్నారు.





# అల్లూరులో వైభవంగా.. ముగ్గురమ్మల జాతర

మండల కేంద్రమైన అల్లూరులో గ్రామదేవతలు గంగమ్మ, కలుగోళమ్మ, పోలేరమ్మ అమ్మవార్ల జాతర అత్యంత వైభవంగా జరిగింది. పాడిపంటలతో ప్రజలంతా సుభిక్షంగా ఉండాలని అమ్మవార్లను ప్రార్థిస్తూ గ్రామస్తులంతా ఈ జాతరలో కుటుంబాలతో సహా పాల్గొన్నారు. మూడవ చాటింపుతో డిసెంబరు 1వ తేదీ మంగళవారం నాడు ప్రారంభమైన ఈ వేడుకలో వేలాది మంది భక్తులు పాల్గొని అమ్మవార్లకు భక్తిశ్రద్ధలతో పూజలు చేసుకుని నైవేద్యాలు సమర్పించారు. మాజీ ఎమ్మెల్యే కాటంరెడ్డి విష్ణువర్ధన్‌రెడ్డి ఆధ్వర్యంలో, ఉత్సవ కమిటీ సభ్యులు, గ్రామపెద్దల సమక్షంలో పెద్దసంఖ్యలో మహిళలు పాల్గొని సంప్రదాయబద్ధంగా కుండల్లో అమ్మవారికి చద్ది నైవేద్యాన్ని సమర్పించుకున్నారు. విష్ణువర్ధన్‌రెడ్డి సతీమణి శివప్రియమ్మతో కలసి 1001 మంది మహిళలు పసుపురంగు మట్టికుండల్లో పోలేరమ్మ అమ్మవారికి, పోతురాజుకు నైవేద్యాలు సమర్పించారు. సంప్రదాయం ప్రకారం పూజలు జరిగాయి. వీరతాళ్ళు, గంగపెట్టె, మంగళవాద్యాలు, బాణసంచా వేడుకలతో జాతర అదిరిపోయింది. ఈ సందర్భంగా ముగ్గురమ్మల ఆలయాలు పెద్దఎత్తున పూల అలంకరణలతో కళకళలాడాయి. పోలేరమ్మ అమ్మవారి ఆలయాన్ని విద్యుద్దీపాలంకరణలతో దేదీప్యమానం చేశారు. బంగారుచీరను అలంకరించి భక్తులకు అమ్మవారి దర్శనభాగ్యం కల్పించారు. అల్లూరు గ్రామం నుంచే కాక, చుట్టుపక్కల ఊళ్ల నుంచి భక్తజనం తండోపతండాలుగా తరలివచ్చి పొంగళ్ళు పొంగించి ముగ్గురమ్మలను దర్శించుకున్నారు. సాంస్కృతిక వేడుకల్లో ప్రముఖ సినీ కళాకారులు, టీవీ నటీనటులు పాల్గొని భక్తులను అలరించారు.

## ప్రపంచ తెలుగు మహాసభల్లో..
# నెల్లూరు కవులు, కవయిత్రులు



డిసెంబరు 28, 29 తేదీల్లో విజయవాడలో జరిగిన ప్రపంచ తెలుగు మహాసభల్లో నెల్లూరుకు చెందిన పలువురు కవులు, కవయిత్రులు తమ కవితాప్రతిభను చాటారు. ప్రముఖ నవలా రచయిత్రి డాక్టర్ పెళ్ళకూరు జయప్రద, డా. పాతూరి అన్నపూర్ణ, నజ్మా బేగం, భారతి, గోవిందరాజుల సుభద్రాదేవి, బాలసాహితీవేత్త డాక్టర్ గంగిశెట్టి శివకుమార్, బొగ్గరపు రాధాకృష్ణ, హస్తి మోహన్‌రాజు, గండికోట సుధీర్ కుమార్, టేకుమళ్ళ వెంకటప్పయ్య, బొగ్గవరపు శ్రీమన్నారాయణ తదితరులు ఈ మహాసభలలో పాల్గొని ప్రసంగించారు. కవితలు చదివారు. సాహితీ సంస్థల ప్రతినిధుల సమావేశంలో నెల్లూరు జిల్లా రచయితల సంఘం ప్రధాన కార్యదర్శి పాతూరి అన్నపూర్ణ పాల్గొన్నారు. సాహితీ సంస్థల మనుగడకు ప్రభుత్వం చేయూతనివ్వాలని కోరారు.






## విద్యుత్ రంగాన్ని సర్వనాశనం చేసి..
# మళ్ళీ ధర్నాలా?

### ● వైకాపా నేతలపై ధ్వజమెత్తిన సోమిరెడ్డి



రాష్ట్రంలో విద్యుత్ రంగాన్ని సర్వనాశనం చేసిన వైకాపా వారు ఇటీవల ధర్నాల పేరుతో రోడ్డెక్కడం సిగ్గుచేటని మాజీ మంత్రి, టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యులు, సర్వేపల్లి శాసనసభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి ధ్వజమెత్తారు. ఇటీవల ఆయన నెల్లూరులోని టీడీపీ కార్యాలయంలో విలేకర్లతో మాట్లాడుతూ, కరెంట్ చార్జీల విషయంలో వైకాపా వారు రోడ్డెక్కి ధర్నాలు చేయడం 'నవ్విపోదురు గాక నాకేటి సిగ్గు' అన్నట్టుగా ఉందని ఎద్దేవా చేశారు. మాజీ ముఖ్యమంత్రి జగన్‌రెడ్డి రూ.1.29 లక్షల కోట్ల భారాన్ని విద్యుత్ సంస్థలపై మోపాడని, అయిదేళ్ళలో 10సార్లు విద్యుత్ చార్జీలను పెంచి ప్రజలపై రూ.32వేల కోట్ల భారాన్ని వేశాడని ఆయన విమర్శించారు. రాష్ట్ర ప్రజల ప్రయోజనాలను 30 ఏళ్ల గడువుకు తాకట్టుపెట్టి, ఇప్పుడు నిరసనల పేరుతో రోడ్డెక్కడం ఏమిటని ఆయన ప్రశ్నించారు. మంత్రివర్గం అనుమతి లేకుండానే ఒప్పందాలు చేసి ప్రజలపై మోయలేని భారం మోపారని, జగన్‌రెడ్డి అత్యంత అవినీతి నాయకునిగా అంతర్జాతీయ స్థాయికి ఎదిగాడని తూర్పారబట్టారు. ఒక్క పవర్ ప్లాంటు కూడా నిర్మించకుండానే విద్యుత్ సంస్థల పేరుతో రూ.49 వేల కోట్లు అప్పులు చేశారని, జగన్‌రెడ్డి చుట్టూ ఉండే నలుగురైదుగురి ఆదాయమే లక్ష్యంగా దోపిడీ పాలన జరిగిందని విమర్శించారు. కృష్ణపట్నంలోని ఏపీ జెన్‌కో థర్మల్ పవర్ ప్లాంటుకు రూ.281 కోట్ల విలువైన 4.50 లక్షల టన్నుల నాసిరకమైన బొగ్గును సరఫరా చేసి దోచుకున్నారని, మట్టిమషానంతో కూడిన ఆ బొగ్గుతో ప్రాజెక్టు ఉనికికే ప్రమాదమని జెన్‌కో ఉద్యోగులు తిరగబడ్డ పరిస్థితి తెచ్చారని ఆయన అన్నారు. స్మార్ట్ మీటర్ల విషయంలోనూ దేశంలోని ఏ రాష్ట్రంలో లేకుండా ఏపీలో పెట్టేందుకు అనుమతిచ్చిన మహానుభావుడు కూడా జగన్ రెడ్డేనన్నారు. జగన్మోహన్‌రెడ్డి లాంటి వ్యక్తిని ముఖ్యమంత్రిగా ఎన్నుకున్నందుకు ఏపీ ప్రజలు జీవితకాలం భాదపడే పరిస్థితి వచ్చిందని, అంతగా బరితెగించి ప్రజాధనం దోపిడీకి పాల్పడిన ముఖ్యమంత్రి దేశ చరిత్రలోనే మరొకరు లేరని ఆయన విమర్శించారు. ధనదాహంతో ఏపీలో ఐదేళ్ల పాటు వ్యవస్థలన్నింటిని నాశనం చేసేశారని, ఇలాంటి వ్యక్తులా విద్యుత్ భారం పేరుతో ధర్నాలు, ప్రదర్శనలు చేసేదని ఆయన అంటూ, జగన్మోహన్‌రెడ్డి నాశనం చేసిన విద్యుత్ రంగాన్ని ఎలా బాగుచేయాలో, ప్రజలపై భారం ఎలా తగ్గించాలనే ఆలోచనలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కృషిచేస్తున్నారన్నారు.

# ఎన్‌బికెఆర్‌లో ప్రాంగణ ఎంపికలు



కోట మండలం విద్యానగర్‌లోని ఎన్‌బికెఆర్ ఐఎస్టీ ఇంజనీరింగ్ కళాశాలలో ఇటీవల బెంగుళూరుకు చెందిన టాట్ ఎఫ్‌డి టెక్నాలజీస్ సంస్థ ప్రాంగణ ఎంపికలు చేపట్టింది. ఈ ఎంపికలకు బీటెక్ ఆఖరి సంవత్సరం చదువుతున్న విద్యార్థులు సుమారు 250 మందికి ఆన్‌లైన్ పరీక్షలు నిర్వహించారు. ఆ కంపెనీ సీఇఓ, ఎన్‌బికెఆర్ ఐఎస్టీ పూర్వ విద్యార్థి రమేష్, కంపెనీ హెచ్‌ఆర్ సందాని పాల్గొన్నారు. ఆ పరీక్షల్లో 46 మంది విద్యార్థులు కోడింగ్ పరీక్షకు అర్హత సాధించారని వారు తెలిపారు. కోడింగ్ పరీక్షల్లో ఎంపికైన విద్యార్థులకు వార్షిక వేతనంగా రూ.3.8 లక్షల నుంచి రూ4.6 లక్షలు ఇవ్వనున్నట్లు ప్రాంగణ ఎంపికల అధికారి డా.ఎన్ కిషాంధర్ తెలిపారు. ఈ సందర్భంగా తమ కళాశాలలో ప్రాంగణ ఎంపికలు చేపట్టిన పూర్వ విద్యార్థి రమేష్‌ను కళాశాల డైరెక్టర్ డాక్టర్ వి.విజయకుమార్‌రెడ్డి అభినందించారు.






జానకిరామ.. 46

# రామాయణం

- ఊటుకూరు జానకి రామారావు



భరతుని అంటే నన్ను అన్నట్లే అని రాముడు లక్ష్మణుని మందలించగా, తన శరీరంలోనికి తానే ముడుచుకొని పోయినట్లుగా కుంచించుకొనిపోయి సిగ్గుపడుతూ మెల్లగా "అవును భరతుడు మనల్ని చూసేందుకే వచ్చి ఉంటాడు" అని పలికాడు లక్ష్మణుడు.

భరతునితో కలిసి మన తండ్రి కూడా వచ్చియుండునని తలుస్తున్నాను. ఆయనే మనల్ని తిరిగి తీసుకొని వెళ్ళటానికి వస్తున్నాడేమో!

అదుగో తండ్రి గారి ఉత్తమాశ్వములు. అదిగో శత్రుంజయము అది మన తండ్రిగారి భద్రగజము!

కానీ... ఏలనో శ్వేత ఛత్రము కానరావడం లేదు! లక్ష్మణా నా మనసేదో కీడు శంకిస్తున్నది.

అని ఈ విధంగా ఇరువురూ మాట్లాడుకొంటూ ఉన్నారు.

అక్కడ భరతుడు తాను, గుహుడు, శత్రుఘ్నుడు మూడు జట్లుగా మారి రాముడి నివాస స్థానం కోసం వెదుకసాగారు.

పొగ వచ్చేదిక్కును గమనిస్తూ బయలుదేరారు. సైన్యాన్నంతా దూరంగా నిలిపి వేసి పాదచారులై గాలిస్తున్నారు.

భరతుడికి మనసులో ఒకటే చింత, ఆందోళన! అన్నగారి పాదాలకు శిరస్సును ఆనించి తన కన్నీళ్ళతో అభిషేకిస్తేగానీ ఆయన ఆందోళన సద్దుమణగదు.

వడివడిగా అడుగులు వేస్తున్నాడు.

ఆయన హృదయ స్పందన, అడుగుల సవ్వడి ఒకేరకంగా ఉన్నాయి. వాటి ధ్వని రామా రామా అనే వినిపిస్తున్నట్లుగా ఉంది. అప్రయత్నంగా భరతుని పాదాలు రామ సామీప్యంలోకి ఆయనను నెట్టుకొచ్చాయి.

సుమంత్రుడి మనఃస్థితి, శత్రుఘ్నుడిదీ, గుహుడిదీ అందరిదీ అదే పరిస్థితి! వారి గుండె వేగం హెచ్చింది రామదర్శనాన్ని వారిలోని అణువణువూ కోరుతోంది.

అదుగో పర్ణశాల! అక్కడ పడవేసి ఉన్న కట్టెలు, కోసిన పువ్వులు చూశారు. పర్ణశాల మార్గం తెలియడం కోసమని లక్ష్మణుడు చెట్లకు కట్టిన నారచీరలు గాలికి ఎగురుతున్నాయి.

చలికాలంలో ఉపయోగించడానికి లేళ్ళపేడ, ఆవుపేడ, మహిషాల పేడతో చేసుకొన్న పిడకలప్రోగులు వారికి అక్కడ కనపడ్డాయి.

అక్కడ వీరాసనం వేసుకొని ఇందీవరశ్యాముడు, పురుష శ్రేష్ఠుడు, రాజీవనేత్రుడు, నీలమేఘశ్యాముడు నేలపై కూర్చొని కనపడ్డాడు.

ఆయనను చూడగనే ఛీ నా జీవితం ఎందుకు? లోకాలను ఏలగలిగినవాడు, మహాకాంతిశాలీ అయిన రాముడు నా వలననే కదా ఇలా కటిక నేలపై కూర్చుంది.

నా మూలంగానే కదా ఆయనకు ఇన్ని కష్టాలు అని కనుల నిండా నీరు నింపుకొని ఒక్కసారిగా రాముడి పాదాల వద్ద "అన్నా" అంటూ కూలబడినాడు భరతుడు.

అన్నను ఆ విధంగా చూస్తుంటే దుఃఖం తన్నుకుంటూ వస్తోంది భరతునకు. కృష్ణాజినం, నారచీరలు ధరించి, జటాధారియై ఉన్న రాముడి చుట్టూ గొప్ప కాంతివలయం కనపడుతుంది ఆయనకు.

సింహం వంటి మూపురం,దీర్ఘమైన బాహువులు, పద్మముల వంటి నేత్రాలు కలిగి సముద్రపర్యంతమైన భూమికి అధిపతి అయిన రాముడు ధర్మమునాచరిస్తూ స్థిరుడైన బ్రహ్మదేవుడిలాగా వీరాసనం బంధించి దర్భలు పరచిన నేలపై కూర్చున్నాడు.

రత్నఖచితసింహాసనం మీద స్వర్ణకిరీటధారియై చుట్టూ మంత్రిసామంతపురోహితులు సేవిస్తుండగా వందిమాగధులు స్తోత్రపాఠాలు చదువుతుండగా సభాభవనమందు కొలువు తీరవలసిన చక్రవర్తి నేడిలా అరణ్యమృగాల చుట్టూ కూర్చొని ఉండగా ఇక్కడ ఉన్నారు. అమూల్యమైన చందనచర్చలు చేయు శరీరం నేడిలా మురికిపట్టి ధూళిధూసరితమై ఉందికదా!

ఆ స్థితిలో రాముని చూసి, ఛీ? నా మూలంగా ఈయనకు ఇన్ని అగచాట్లు!. అని వేదనతో భరతుడు దీనుడై ముఖమంతా చెమటలు కారుతుండగా విలపిస్తూ, నోట మాట రాక "ఆర్యా" అని మాత్రమే పలికి మాటలు రాక గొంతు పూడుకొనిపోయి నిస్సహాయంగా దీనంగా రోదించసాగాడు. శత్రుఘ్నుడు కూడా దీనంగా విలపిస్తూ అన్నకాళ్ళపై పడినాడు.

రాముడు తమ్ములనిరువురనూ కౌగలించుకొన్నాడు, లక్ష్మణుడు కూడా అన్నల బాహుబంధనంలో ఒదిగిపోయాడు. అన్నదమ్ములను అలా చూస్తున్న ఋషిగణం, పురజనులు దుఃఖాన్ని ఆపుకోలేక కన్నీరు కార్చారు.

భరతా! దశరథమహారాజు ఏరి? ఎక్కడికి వెళ్ళారు? నీవు అరణ్యానికి ఎందుకు వచ్చావు? దశరథమహారాజుకు క్షేమమే కదా! జీవించియే యున్నారుకదా! ఆయన దుఃఖాక్రాంతుడై పరలోకానికి వెళ్ళలేదు కదా!

నీవు నాన్నగారికి శుశ్రూష చేస్తున్నావు కదా!

వేదవేత్త, ధర్మనిరతుడైన వశిష్ఠులవారిని మునుపటి వలెనే పూజిస్తున్నావు కదా!

మాత కౌసల్య, మంచి సంతానంకల సుమిత్ర, పూజ్యురాలు రాణి అయిన కైకేయి సంతోషంగా ఉన్నారు కదా!

వినయసంపన్నుడు, అధిక శాస్త్రజ్ఞానం కలవాడైన సుయజ్ఞుని సత్కరిస్తున్నావు కదా!

నీవు ఎప్పుడు ఏ హోమం చేయాలో, ఏవి జరిగెనో అన్ని విషయాలు పురోహితుడు నీకు ఎరుకపరుస్తున్నాడు కదా!

నీవు దేవతలను, తల్లులను, తండ్రులను, గురువులను, తండ్రితో సమానులైన బంధువులను, వృద్ధులను, వైద్యులను, బ్రాహ్మణులను గౌరవిస్తున్నావు కదా!

నీతో సమానులు, శూరులు, విద్యావంతులు, జితేంద్రియులు, ఉత్తమవంశజులూ, మనస్సులో భావమెరిగి మసలుకోగలిగిన వారినే మంత్రులుగా నియమించుకొన్నావుకదా!

భరతుడిని రాజధర్మాల విషయంలో ప్రశ్నిస్తూ ఉన్నాడు శ్రీరాముడు.

అమాత్యులు శాస్త్రపండితులయినవారు మంత్రాంగపు ఆలోచనలను తమలోనే రహస్యంగా ఉంచుకొంటున్నారు కదా!

బహిర్గతపరచటంలేదు కదా!

నీవు నిద్రకు వశుడవ్వటం లేదుకదా!

తగుకాలమందే మేల్కొనుచున్నావు కదా! వివిధములైన కార్యాలను గురించి తెల్లవారుఝామునందే ఆలోచిస్తున్నావు కదా!

నీవు ఒక్కడవే ఆలోచించటంలేదు కదా!

అలాగని చాలామందితో ఆలోచించటంలేదు కదా!

నీ ఆలోచనలు రాజ్యంలోని వారికి తెలిసిపోవడం లేదు కదా! స్వల్పమైన ప్రయత్నంతో ఎక్కువ ఫలితాలు సాధించకలిగే కార్యాలను నిశ్చయించి ఏ మాత్రం ఆలస్యం లేకుండా వెంటనే ప్రారంభిస్తున్నావు కదా!

ఇతరులకు నీవేమి చేయదలుచుకున్నావో మునుముందు తెలియకుండా ఉంటున్నది కదా!

నాయనా ఇతరులెవ్వరూ... ఊహలచేత కానీ, యుక్తిచేత గానీ, ఇతరములైన ఏ ఉపాయం చేత గానీ నీవు, నీ మంత్రులు చేసిన ఆలోచనలు తెలుసు కొనడం లేదు కదా!

వేయిమంది మూర్ఖుల కన్నా ఒక్కడు మేధావీ, శూరుడు, సమర్థుడు అయిన పండితుడిని చేరదీస్తే చాలు.

ఎందుకంటే సంకటస్థితిలో పండితుడే గొప్ప సహాయం చేయగలడు. మూర్ఖులు వేలకొద్దీ నీ చుట్టూ ఉన్నప్పటికీ అవసరమైన పరిస్థితిలో ఒక్కడూ ఉపయోగపడడు.

నీవు అధిక సామర్థ్యం కలవారిని గొప్పపనులు చేయుటకు, మామూలు సామర్థ్యం గలవారిని చిన్నపనులు చేయుటకు, అతితక్కువ సామర్థ్యం కలవారిని అధమమైన కార్యాలు చేయుటకు వినియోగిస్తున్నావు కదా!

భరతుడిని అన్ని విధాలుగా విచారించి.. నీవు నారచీర, జటలు ధరించి ఇక్కడికి ఎందుకు వచ్చావు? కారణమేమిటి? అని ప్రశ్నించాడు రాముడు.

నేను నీ దాసుడను, నన్ను అనుగ్రహించి దేవేంద్రుడిలాగా రాజ్యాభిషిక్తుడవుకమ్ము!

మన తల్లులు, మన ప్రజలు అందరూ ఆశగా నీ వద్దకు వచ్చారు. మమ్మల్ని నీవు అనుగ్రహించవలెను.

మనవంశాచారం బట్టి జ్యేష్ఠుడవైన నీకే రాజ్యాధికారం కలదు! ఈ రాజ్యం నీది, దీనిని స్వీకరించు!

ఈ సచివులు, నేను ఇక్కడచేరిన ప్రజలంతా శిరస్సువంచి నమస్కరిస్తూ ప్రార్థిస్తున్నాం.. ఈ రాజ్యలక్ష్మిని స్వీకరించు.

నీ సోదరుడను, నీ శిష్యుడను, నీ దాసుడను నన్ను అనుగ్రహించు. మహాబాహువైన భరతుడు అన్నను ప్రార్థించి కన్నీరు కారుస్తూ ఆయన పాదాలను మరలమరల తాకి నమస్కరిస్తూ వేడుకుంటున్నాడు.

.. (సశేషం)

# మౌన మోహనుడు!

మనసులో మాట 26

సమకాలీన రాజకీయాల్లో కర్మయోగులుగా గౌరవార్హత ఉన్న అతి కొద్దిమందిలో దివంగత ప్రధాని మన్మోహన్‌సింగ్ ఒకరు. మాటలు పొదుపుగా వాడుతూ, చేతల్లో విలువను చూపించిన అరుదైన నేతల్లో మన్మోహన్ ముఖ్యులు. ఇవాళ మన దేశం ప్రపంచంలోనే ఐదో పెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించడం వెనక గట్టి పునాది వేసింది మన్మోహన్‌సింగ్ అనడంలో సందేహంలేదు. అంతకుముందు కూడా ఆర్థిక సంస్కరణలకు ప్రయత్నాలు జరిగాయి. కానీ, మునిగే ప్రమాదంలో ఉన్న భారత ఆర్థిక నౌకను సురక్షితంగా ఒడ్డుకు చేర్చడానికి ఆ ప్రయత్నాలు సరిపోలేదన్నది వాస్తవం. పీవీ హయాంలో కేంద్ర ఆర్థికమంత్రిగా మన్మోహన్ బాధ్యతలు చేపట్టగానే.. మునిగిపోతున్న భారత ఆర్థికనౌకను సురక్షితంగా ఒడ్డున చేర్చడానికి చాలా సాహసోపేతమైన నిర్ణయాలు తీసుకోవాలని గ్రహించారు. అందుకు ఆయన ఏ మాత్రం సందేహించలేదు. మీనమేషాలు లెక్కించలేదు. రాజకీయ ప్రయోజనాలకు ఉపయోగపడతాయా లేదా అని ఆలోచించలేదు. చకచకా నిర్ణయాలు తీసుకున్నారు. ఫలితమే నేడు మనం ఉన్న పరిస్థితి.

ఈ తరంలో చాలామందికి తెలియకపోవచ్చు. 1980ల్లో అమెరికా వస్తువులంటే ఒక మోజు. అవి ఇక్కడ దొరికేవి కావు. అప్పట్లో అమెరికాలో మత్తు వైద్యులకు చాలా డిమాండ్ ఉండేది. భారత్ నుంచి ముఖ్యంగా దక్షిణాది నుంచి వెళ్లిన వైద్యులు కొద్దిరోజులు తమ కుటుంబాలతో గడపడానికి వచ్చేటప్పుడు వీడియో కెమేరాలు, అప్పటికప్పడు ప్రింట్ బయటకు వచ్చే పోలరాయిడ్ కెమేరాలు తీసుకొచ్చేవారు. వీడియో తీస్తున్నప్పుడు ఆ స్క్రీన్‌లో దృశ్యమంతా కనబడడం అబ్బురం. పోలరాయిడ్ కెమెరా లోంచి ఫొటో ప్రింట్ బయటకు వచ్చి మన కళ్ల ముందే అస్పష్టంగా ఉన్న దృశ్యం క్రమంగా రంగుల్లో స్పష్టమైన దృశ్యంగా మారడం మరింత విచిత్రం. అమెరికా అంటే స్వర్గధామంగా భావించేవారు. అంతేకాదు, ఎల్పీజీ కనెక్షన్ తీసుకోవాలన్నా, టెలిఫోన్ కనెక్షన్ తీసుకోవాలన్నా, ఒక స్కూటర్ తీసుకోవాలన్నా ఎంపీల స్థాయిలోనో, ఎమ్మెల్యేల స్థాయిలోనో సిఫార్సులు అవసరం అయ్యేవి.

ఆ కాలంలో అక్కడ జరుగుతున్న అభివృద్ధి, అందుబాటులో ఉన్న వస్తువులు మనకు లేవు. తర్వాత తర్వాత కూడా అక్కడి వస్తువులు ఇక్కడికి రావడానికి కొన్నేళ్ల సమయం పట్టేది. కానీ, ఇప్పుడు ప్రపంచంలో ఎక్కడ ఏ పరిశోధన జరిగినా, ఎక్కడ ఏ వస్తువు అందుబాటులోకి వచ్చినా సమాంతరంగా ఇక్కడా అందుబాటులోకి వస్తున్నాయి. వెనకబడి ఉన్నాం అన్న భావనే లేదు. ఈరోజు వీధిచివర పెద్ద గొడుగు వేసుకుని సిమ్ కార్డులు, ఇంటర్నెట్ కనెక్షన్లు ఇచ్చేస్తున్నారు. ఇంతటి పెనుమార్పు రావడానికి మన్మోహన్ వేసిన సంస్కరణల పునాదే కారణం. చరిత్ర ఆయనను ఎప్పుడూ గుర్తుంచుకుంటుంది.

## అధ్యాపకుడి నుంచి ఆర్థికవేత్తగా

దేశ విభజన సమయంలో మన్మోహన్ కుటుంబం పాకిస్థాన్ నుంచి వచ్చి పంజాబ్‌లోని అమృత్‌సర్‌లో స్థిరపడింది. ప్రపంచ ప్రఖ్యాత విశ్వవిద్యాలయాలు అయిన కేంబ్రిడ్జి, ఆక్స్‌ఫర్డ్‌లలో ఆర్థికశాస్త్రంలో ఉన్నత విద్యాభ్యాసం చేసిన మన్మోహన్, తొలుత భారత్ విశ్వవిద్యాలయాల్లో ఆచార్యుడిగా, రీడర్‌గా సేవలందించారు. పాఠశాల నుంచే ఆయన చదువులో ప్రతిభావంతుడు. ఉపకారవేతనంతోనే ఆయన చదువులన్నీ సాగాయి. 1966 నుంచి 1969 దాకా 'యునైటెడ్ నేషన్స్ కాన్ఫరెన్స్ ఆన్ ట్రేడ్ అండ్ డెవల్‌పమెంట్'కు పనిచేశారు. ఆర్థికవేత్తగా ఆయన ప్రతిభను గుర్తించిన ప్రభుత్వం ఆయన్ను విదేశీ వాణిజ్య శాఖలో సలహాదారుగా నియమించింది. బ్యూరోక్రాట్‌గా మన్మోహన్ ప్రస్థానం అలా ప్రారంభమైంది.

1972లో ఆర్థికశాఖ ప్రధాన సలహాదారుగా.. 1976లో ఆర్థికశాఖ కార్యదర్శిగా నియమితులయ్యారు. 1980–1982 మధ్య ప్రణాళిక సంఘంలో పని చేశారు. 1982లో భారతీయ రిజర్వు బ్యాంకు గవర్నర్‌గా నియమితులయ్యారు. 1985–87 మధ్య ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడిగా పనిచేశారు. 1990 నవంబరులో అప్పటి ప్రధాని చంద్రశేఖర్‌కు ఆర్థిక వ్యవహారాల సలహాదారుగా పనిచేశారు. 1991లో యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ ఛైర్మెన్‌గా నియమితులయ్యారు.

## అదే భారత్‌కు మేలిమలుపు

1991 జూన్‌లో.. మైనారిటీ ప్రభుత్వ పగ్గాలు చేపట్టిన నాటి ప్రధాని పీవీ నరసింహారావు.. మన్మోహన్‌కు ఆర్థికశాఖ మంత్రిగా బాధ్యతలు అప్పగించారు. అక్కడి నుంచి భారత ఆర్థిక ముఖచిత్రమే మారిపోయింది. మన విదేశీ మారక నిల్వలు కేవలం 2వారాల దిగుమతులకు సరిపడా మాత్రమే ఉన్నాయి. అలాంటి ఆర్థిక వ్యవస్థను ఆయన.. ప్రధాని పీవీ ప్రోత్సాహంతో సంస్కరణలపథంలో నడిపించి గాడిన పెట్టారు. పర్మిట్‌రాజ్‌కు చుక్కపెట్టి.. ఆర్థికవ్యవస్థను సరళీకరణ, ప్రైవేటీకరణ, ప్రపంచీకరణ బాట పట్టించి (మన్మోహన్ సంస్కరణలకు ఎల్పీజీ అని పేరు. – లిబరైజేషన్, ప్రైవేటైజేషన్, గ్లోబలైజేషన్) దేశ ఆర్థిక ముఖచిత్రాన్నే మార్చేశారు.

## ప్రధానిగా... ప్రత్యేకత

2004 మే 22న ప్రధానమంత్రిగా పగ్గాలు చేపట్టిన మన్మోహన్‌సింగ్.. 2014 దాకా ఆ పదవిలో కొనసాగారు. సంస్కరణలు మరింత ఊపందుకున్నాయి. దీంతో అనతికాలంలోనే మన ఆర్థిక వృద్ధిరేటు పెరగడం ప్రారంభించి.. 2007లో అత్యధికంగా 9 మైలురాయిని దాటింది. ఆయన హయాంలో తీసుకొచ్చిన జాతీయ ఉపాధిహామీ చట్టం, విద్యాహక్కుచట్టం, సమాచార హక్కు చట్టం గొప్ప మైలు రాళ్ళు. 'చరిత్ర నా మీద దయ చూపుతుంది' అని మన్మోహన్ స్వయంగా చెప్పినట్లు ఖచ్చితంగా భారతదేశ ఆధునిక చరిత్రలో ఆయనది ఒక ప్రత్యేక అధ్యాయం. మన్మోహన్ వేసిన గట్టి ఆర్థిక పునాదులపై గొప్ప సౌధాలను నిర్మించడమే ఆయనకు ఇచ్చే ఘన నివాళి.



తుమ్మల బాల గంగాధర్ తిలక్

తిరుపతి జిల్లా గూడూరు డివిజన్

# ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలి

జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్



ప్రజలకు వైద్యాధికారులు మెరుగైన వైద్యం అందించాలని, ఆసుపత్రికి సంబంధించిన పలు సమస్యలను త్వరలోనే పరిష్కరిస్తామని జిల్లా కలెక్టర్ డా.ఎస్. వెంకటేశ్వర్ పేర్కొన్నారు. ఇటీవల ఆయన ఎమ్మెల్యే సునీల్‌కుమార్, సబ్‌కలెక్టర్ రాఘవేంద్ర మీనాలతో కలిసి గూడూరు ఏరియా ఆసుపత్రిని ఆకస్మిక తనిఖీ చేసి వార్డుల్లో ఉన్న పేషెంట్లతో మాట్లాడారు. మెరుగైన వైద్యం అందిస్తున్నారా అని కలెక్టర్ వారిని అడగ్గా, చికిత్స బాగా చేస్తున్నారని తెలిపారు. ఆసుపత్రిలో పారిశుధ్యం, ఓపీ తదితర అంశాలపై ఆసుపత్రి సూపరింటెండెంట్‌కు కలెక్టర్ పలు సూచనలు చేశారు. నూతన ఏరియా ఆసుపత్రి భవనం పూర్తి చేయిస్తామని తెలిపారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ షరీనా, సిఎస్ఆర్ఎంఓ రవికుమార్ ఇతర వైద్యాధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# సంప్రదాయ ప్రతీకలు జానపదాలు



సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక జానపద కళలని, నేటి తరం యువత వాటిని ప్రోత్సహించాలని శ్రీకృష్ణ సేవాసమితి వ్యవస్థాపక అధ్యక్షులు బండి శ్యాంయాదవ్ తెలిపారు. గూడూరు పట్టణంలోని శ్రీ కళ్యాణ వీరభద్రస్వామి దేవస్థానంలో రాష్ట్ర ప్రభుత్వం భాషా, సాంస్కృతిక శాఖ సౌజన్యంతో ప్రజా అభ్యుదయ సేవాసమితి ఆధ్వర్యంలో ఇటీవల జానపద సంబరాలు నిర్వహించారు. భజనలు, కోలాటాలు, భరతనాట్యం, సాంస్కృతిక కార్యక్రమాలు చేపట్టారు. ప్రతిభ చూపిన కళాకారులకు బహుమతులు అందజేశారు. చక్రపాణి, కృష్ణదాస్, ప్రభాకర్, తాజుద్దీన్, కళాకారులు పాల్గొన్నారు.

మా ఖాతాదారులకు, మిత్రులకు, శ్రేయోభిలాషులకు, గూడూరు ప్రాంత ప్రజానీకానికి
2025 నూతన సంవత్సర మరియు సంక్రాంతి శుభాకాంక్షలు
వల్లంకొండ వెంకటసుబ్బయ్య
అధ్యక్షులు, చిల్లీస్ మర్చెంట్స్ అసోసియేషన్, గూడూరు.

LIC
भारतीय जीवन बीमा निगम LIFE INSURANCE CORPORATION OF INDIA
నెల్లూరు డివిజన్ ఎల్ఐసి అధికారులకు, గూడూరు బ్రాంచి మేనేజర్ మరియు స్టాఫ్‌కు, డెవలప్‌మెంట్ ఆఫీసర్లకు, ఏజంటుమిత్రులకు, పాలసీదారులకు, పట్టణశ్రేయోభిలాషులకు మరియు లయన్ మిత్రులకు
2025 ఆంగ్ల నూతన సంవత్సర మరియు సంక్రాంతి శుభాకాంక్షలు
మీ అందరి జీవితాలలో సంక్రాంతి వెలుగులు నింపాలని కోరుతూ...
మీ... Ln. మల్లెమాల మురళీరెడ్డి
Dist., Chairman(Girls Education)
Rtd., LIC Development Officer, Gudur Branch.



శుభాకాంక్షలు
రాష్ట్ర పంచాయతిరాజ్ డిప్లొమా ఇంజనీర్ల సంఘం గౌరవాధ్యక్షులు
షేక్ రియాజ్ అహమద్ గారికి
2025 నూతన సంవత్సర మరియు సంక్రాంతి శుభాకాంక్షలు.
పంచాయతిరాజ్ డిప్లొమా ఇంజనీర్ల సంఘం
తిరుపతి - నెల్లూరు జిల్లా యూనిట్.



# వైసీపీ ధర్నా హాస్యాస్పదం

ఎమ్మెల్యే పాశిం సునీల్



వైయస్ జగన్ నేతృత్వంలోని గత ప్రభుత్వంలో తొమ్మిదిసార్లు విద్యుత్ ఛార్జీలు పెంచి, ప్రజలపై లక్షల కోట్ల రూపాయల భారం మోపి విద్యుత్ సంస్థను నష్టాల్లోకి నెట్టారని, ఇప్పుడేదో మేము విద్యుత్ ఛార్జీలు పెంచామని గగ్గోలు పెడుతూ వైసీపీ నాయకులు ధర్నాలు చేయడం హాస్యాస్పదంగా ఉందని గూడూరు ఎమ్మెల్యే సునీల్ కుమార్ ఎద్దేవా చేశారు. గూడూరు పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఇటీవల ఆయన మీడియా సమావేశంలో మాట్లాడుతూ ప్రజలకు వాస్తవాలు తెలుసు కాబట్టి వైసీపీ నాయకులు చేపట్టిన నిరసన కార్యక్రమాలకు ప్రజల నుండి స్పందన రాలేదని, గూడూరు వైసిపి నాయకులు చేపట్టిన ధర్నా కార్యక్రమంలో పట్టణానికి చెందిన ఎవరూ పాల్గొనకపోవడం ఇందుకు ఉదాహరణ అని ఆయన పేర్కొన్నారు. అనేక అవినీతి అక్రమాలకు పాల్పడిన వైసీపీ నాయకులు ప్రజల్లోకి వెళ్ళేందుకు మొహం చెల్లడం లేదన్నారు. బిల్లు చెంచు రామయ్య, అబ్దుల్ రహీమ్ తదితరులు పాల్గొన్నారు.



రాష్ట్ర దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డిని కలసి 2025 నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలుపుతున్న ఉమ్మడి నెల్లూరు జిల్లా టిడిపి మాజీ కార్యనిర్వహణ కార్యదర్శి శ్రీనివాస్ చౌదరి.

## పొనకా దంపతులకు మజ్దూర్ నాయకుల శుభాకాంక్షలు



నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని ప్రముఖ పారిశ్రామికవేత్త, ఎన్.ఎం.యు గూడూరు డిపో గౌరవాధ్యక్షులు పొనకా శివకుమార్‌రెడ్డిని నేషనల్ మజ్దూర్ యూనియన్ నాయకులు ఆయన నివాసంలో కలసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. పొనకా శివకుమార్‌రెడ్డి – దేవసేనమ్మ దంపతులకు పూలమాలలు, బొకేలు అందజేసి శాలువాలు కప్పి సత్కరించారు. యూనియన్ డిపో కార్యదర్శి ప్రవీణ్, డిపో అధ్యక్షుడు బాషా, జోనల్ ఛైర్మెన్ శ్రీనివాసులు, గౌస్, సంధాని, రఘు, క్రిష్ణ, బాబు, పోలయ్య తదితరులు పాల్గొన్నారు.

## పారిశుధ్య కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



పారిశుధ్య కార్మికుల సమస్యల పరిష్కారానికి మరో పోరాటానికి సిద్ధం కావాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు బాలసుబ్రహ్మణ్యం తెలిపారు. గూడూరు పట్టణంలోని సీఐటీయూ కార్యాలయంలో గత నెల 29న మున్సిపల్ వర్కర్స్, ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహిం చారు. ఈ సందర్భంగా ఆయన ఆ వ్యాఖ్యలు చేశారు.

# విద్యుత్ ఛార్జీలను వెంటనే తగ్గించాలి



విద్యుత్ ఛార్జీలు పెంచి తెలుగుదేశం ప్రభుత్వం పేదవారిపై పెనుభారం మోపిందని, ఎన్నికలకు ముందు చంద్రబాబునాయుడు విద్యుత్ ఛార్జీలు పెంచం అని చెప్పి, నేడు పెంపు చేసి ప్రజలను మోసం చేశారని స్థానిక సంస్థల ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్ పేర్కొన్నారు. గూడూరు ఐసిఎస్ రోడ్‌లోని విద్యుత్ సబ్‌స్టేషన్ కార్యాలయం వద్ద విద్యుత్ చార్జీల పెంపును నిరసిసూ వైసీపీ పోరుబాట కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్సీ మేరిగ మురళి, వైసీపీ నాయకులు ధర్నా నిర్వహించారు. విద్యుత్ శాఖ ఏడికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మురళి మాట్లాడుతూ టీడీపీ ప్రభుత్వం వచ్చిన ఏడో నెలలోనే విద్యుత్ ఛార్జీలు పెంచి పేదవాడి నడ్డి విరిచిందన్నారు. ఆ ప్రజా వ్యతిరేక విధానాలపై రాబోయే రోజుల్లో వైసీపీ ఆధ్వర్యంలో పోరాటాలు ముమ్మరం చేస్తామని తెలిపారు. భక్తవత్సలరెడ్డి, బాలకృష్ణారెడ్డి, మల్లు విజయ్‌కుమార్‌రెడ్డి, నాగరాజు, సునీల్‌రెడ్డి, గురవయ్య, ప్రసాద్‌గౌడ్, సంపత్‌కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గూడూరు నియోజకవర్గ ప్రజలకు, అధికారులకు, కాంట్రాక్టర్లకు, పంచాయతీరాజ్ సిబ్బందికి
2025 నూతన సంవత్సర మరియు సంక్రాంతి శుభాకాంక్షలు
మీ... కె.వి.రవీంద్రకుమార్
Rtd. డెప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్
పంచాయతీరాజ్ శాఖ, గూడూరు.



గూడూరు నియోజకవర్గ ప్రజలకు, అధికారులకు, ప్రజాప్రతినిధులకు
2025 నూతన సంవత్సర మరియు సంక్రాంతి శుభాకాంక్షలు.
మీ..
చేవూరు విజయమోహన్‌రెడ్డి
మాజీ మండలాధ్యక్షులు
వైయస్ఆర్‌సిపి నాయకులు, గూడూరు.

2025 నూతన సంవత్సర మరియు సంక్రాంతి శుభాకాంక్షలు
వనజాకృష్ణ కళ్యాణ మండపము A/C
ఐ.సి.యస్.రోడ్, (సొసైటీ రోడ్), గూడూరు
9948606664 - 9848757611
మయూరి స్వీట్స్ & బేకరి
సంఘం థియేటర్ ప్రక్కన, గూడూరు
Rtn PHF డా॥ B.శ్యామసుందర రావు (మయూరి శ్యామ్ యాదవ్)
శ్రీ కృష్ణ సేవా సమితి ఫౌండర్ ప్రెసిడెంట్

## నెల్లూరులో తొలిసారిగా
# జాతీయస్థాయి క్యారమ్స్ పోటీలు



నెల్లూరులో తొలిసారిగా జాతీయస్థాయిలో అఖిలభారత ఫెడరేషన్ కప్ క్యారమ్స్ పోటీలు నిర్వహించేందుకు చురుగ్గా ఏర్పాట్లు జరుగుతున్నాయి. జనవరి 5 నుంచి 8వ తేదీ వరకు ఈ పోటీలను నెల్లూరు క్లబ్ ప్రాంగణంలో నిర్వహిస్తామని జిల్లా క్యారమ్స్ అసోసియేషన్ అధ్యక్షుడు చిలకల శ్రీమన్నారాయణ చెప్పారు. ఇటీవల ఆయన నెల్లూరు క్లబ్ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ, ఈ పోటీలకు దేశంలోని 24 రాష్ట్రాలకు చెందిన పురుషులు, మహిళలతో పాటు కేంద్రపాలిత ప్రాంతాలు, భారతీయ సంస్థలకు చెందిన సుమారు 400 మంది క్రీడాకారులు పాల్గొంటారని, వారితో పాటు మరో 8 మంది అంతర్జాతీయ చాంపియన్లు కూడా వస్తున్నారని తెలిపారు. అంతర్జాతీయ క్యారమ్స్ ఫెడరేషన్ అధ్యక్షుడు జోసఫ్ మేయర్, ఆలిండియా క్యారమ్స్ ఫెడరేషన్ అధ్యక్షుడు..అస్సాం ఎంపీ రకిబుల్ హుస్సేన్, జిల్లాలోని ఎంపీ, ఎమ్మెల్యేలు, జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీ తదితరులు హాజరవుతారని పేర్కొన్నారు. ఈ సమావేశంలో నెల్లూరు క్లబ్ కార్యదర్శి పొన్నవోలు సుధాకర్‌రెడ్డి, జిల్లా క్యారమ్స్ అసోసియేషన్ కార్యదర్శి వి.రఘురామ్ శ్రీధర్, ఉపాధ్యక్షుడు పి.శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

## బీసీ సంక్షేమాధికారిణిగా.. వెంకటలక్ష్మమ్మ



జిల్లా బీసీ సంక్షేమశాఖ అధికారిణిగా పి.వెంకటలక్ష్మమ్మ నియమితులయ్యారు. కర్నూలు జిల్లా బీసీ సంక్షేమ అధికారిణిగా పనిచేస్తున్న ఆమెను నెల్లూరుజిల్లాకు బదిలీ చేయడంతో, ఇక్కడ బాధ్యతలు తీసుకున్నారు. కార్యాలయ సిబ్బంది ఆమెకు శుభాకాంక్షలు తెలిపారు.

## యూటీఎఫ్ సభల పోస్టర్లు ఆవిష్కరణ



జనవరి 5 నుంచి కాకినాడలో జరుగనున్న యూటీఎఫ్ (ఐక్య ఉపాధ్యాయ సమాఖ్య) స్వర్ణోత్సవ మహాసభలను జయప్రదం చేయాలని కోరుతూ, నెల్లూరులోని యూటీఎఫ్ జిల్లా కార్యాలయంలో డిసెంబరు 29న మహాసభల పోస్టర్లను ఆవిష్కరించారు. యూటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నవకోటేశ్వరరావు, జిల్లా నాయకులు శేషు, చలపతి, ఖాజావలి, వెంకటేశ్వర్లు, మోహన్‌రావు, మనోహర్ తదితరులు పాల్గొని మాట్లాడుతూ, మహాసభలను విజయవంతం చేసేందుకు జిల్లా వ్యాప్తంగా అన్నిప్రాంతాల్లో ప్రచార జాతాను కూడా నిర్వహిస్తామని చెప్పారు.

## రక్తదానం చేస్తే.. ప్రాణదానం చేసినట్లే!



రక్తదానం చేస్తే బాధితులకు ప్రాణదానం చేసినట్లేనని, రక్తదానం చేయడం ద్వారా ఎందరినో కాపాడవచ్చని, యువత సేవాభావంతో స్వచ్ఛంధ రక్తదానానికి ముందుకురావాలని నెల్లూరు రెడ్‌క్రాస్ బ్లడ్‌బ్యాంక్ కన్వీనర్ అజయ్‌బాబు పిలుపునిచ్చారు. డిసెంబరు 29న స్థానిక మద్రాస్‌బస్టాండ్ వద్దనున్న రెడ్‌క్రాస్ కార్యాలయంలో ఏర్పాటుచేసిన రక్తదాన శిబిరంలో ఆయన పాల్గొన్నారు. ప్రముఖ సినీనటుడు, ధనరాజ్ ఫౌండేషన్ మోటివేటర్లు సాబీర్, షఫీ ఆధ్వర్యంలో ఈ శిబిరం ఏర్పాటైంది. అనంతరం, రక్తదాన శిబిరం నిర్వాహకులకు సర్టిఫికెట్లను అందజేసి సన్మానించారు. రెడ్‌క్రాస్ మేనేజింగ్ కమిటీ సభ్యుడు మలిరెడ్డి కోటారెడ్డి, జనరిక్ మందులషాపు కన్వీనర్ మురళీకృష్ణ, రక్తదాన మోటివేటర్లు భాస్కరరావు, సాయిరామ్ తదితరులు పాల్గొన్నారు.



# మన్మోహన్ సేవలు మరువలేం!..

❍ జిల్లా కాంగ్రెస్ నాయకుల నివాళి

భారత మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ దేశానికి చేసిన సేవలు చిరస్మరణీయమని, ఆయన మృతితో దేశం ఒక గొప్ప ఆర్థిక సంస్కర్తను కోల్పోయిందని జిల్లా కాంగ్రెస్ కమిటీ (డీసీసీ) ఉపాధ్యక్షుడు బాలసుధాకర్ విచారం వ్యక్తం చేశారు. దేశ ఆర్థికశాఖ మంత్రిగా, 10 సంవత్సరాలపాటు ప్రధానిగా ఆయన పనిచేసిన సమయంలో చేపట్టిన ఆర్థిక సంస్కరణల కారణంగా దేశ ప్రజల జీవితాలలో భారీమార్పులు వచ్చాయని, దాంతో దేశ ఆర్థికవ్యవస్థలో నవశకం ప్రారంభమైందని ఆయన కొనియాడారు. మన్మోహన్‌సింగ్ మృతికి సంతాపం తెలియజేస్తూ, డీసీసీ నేత చేవూరు దేవకుమార్‌రెడ్డి సూచనలతో ఇటీవల నెల్లూరులోని ఇందిరాభవన్‌లో జరిగిన సంతాపసభలో పలువురు కాంగ్రెస్ నాయకులు పాల్గొని, మన్మోహన్‌సింగ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, దేశాన్ని అభివృద్ధిపథంలో నడిపించిన మహనీయుడు మన్మోహన్‌సింగ్ అని, ప్రధానమంత్రిగా ఆయన తీసుకొచ్చిన ఉపాధిహామీ పథకంతో దేశవ్యాప్తంగా ఎంతోమంది పేదల జీవితాలు బాగుపడ్డాయని అన్నారు. సమాచార హక్కు చట్టం, విద్యా హక్కు చట్టం, పారిశ్రామిక అభివృద్ధి కోసం సెజ్‌ల ఏర్పాటు వంటి ఎన్నో కొత్త చట్టాలను ఆయన అమలులోకి తెచ్చారని గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ నాయకులు మోహన్‌రెడ్డి, అల్లాఉద్దీన్, మల్లికార్జునరెడ్డి, సంజయ్‌కుమార్, గణేశ్, సుధాకర్‌రెడ్డి, కిషోర్, రెహమాన్, హాజీ అనీఫ్, ఆదినారాయణ, సమీర్ తదితరులు పాల్గొన్నారు.

# ఎన్‌బికెఆర్ కళాశాలలో..వార్షిక శిక్షణా శిబిరం



కోట మండలం విద్యానగర్‌లోని ఎన్‌బికెఆర్ సైన్స్ అండ్ ఆర్ట్స్ కళాశాలలో ఇటీవల ఎన్‌సిసి కంబైండ్ అన్యువల్ ట్రైనింగ్ క్యాంపు (వార్షిక శిక్షణా శిబిరం) ఉత్సాహంగా జరిగింది. 10-ఏ నావల్ యూనిట్ ఎన్‌సిసి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ శిబిరంలో వివిధ విద్యాసంస్థల నుంచి 406 మంది విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారని కళాశాల ప్రిన్సిపల్ ఓ.చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. ఈ క్యాంపులో విద్యార్థులకు దేశభక్తి, క్రమశిక్షణ, జాతీయ సమైక్యత, ఫైరింగ్, డ్రిల్, ఫస్ట్ ఎయిడ్, అంబులెన్సు, హెల్త్ అండ్ హైజిన్, కెరీర్ గైడెన్స్ తదితర అంశాలపై అవగాహన కార్యక్రమాలను నిర్వహించారు. క్యాంప్ కమాండెంట్ గణేష్ గొడంగవే పాల్గొని విద్యార్థులకు వివిధ పోటీలను నిర్వహించారని ఆయన తెలిపారు. తల్వార్ జట్టు ఓవరాల్ చాంపియన్‌గా నిలిచింది. బెస్ట్ జూనియర్ డివిజన్ క్యాడెట్ యుగంధర్ (మెట్టు పాఠశాల), బెస్ట్ జూనియర్ వింగ్‌గా బి. హర్షిణి (రెయిన్‌బో పాఠశాల), సీనియర్ వింగ్‌లో రక్షిత (ఎన్‌బికెఆర్ కాలేజీ) సీనియర్ డివిజన్ నుండి జూనియర్ అండర్ ఆఫీసర్ చరణ్, ఎస్ఎస్ఎన్ కళాశాల విద్యార్థులు పతకాలు సాధించారు. ఈ శిబిరాన్ని విజయవంతంగా నిర్వహించిన అసోసియేట్ ఎన్‌సిసి ఆఫీసర్లను, పీఐ స్టాఫ్‌ను క్యాంపు కమాండింగ్ ఆఫీసర్ అభినందించారు. అడిగిన వెంటనే క్యాంపునకు అనుమతిని ఇచ్చి, అవసరమైనటువంటి మౌలిక సదుపాయాలను సమకూర్చిన కళాశాల కరస్పాండెంట్ నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డికి వారు కృతజ్ఞతలు తెలియజేశారు.

# వేడుకగా..అయ్యప్ప మండల పూజలు



నెల్లూరు వేదాయపాలెంలో వెంచేసి ఉన్న శ్రీ వేద శాస్త్ర అయ్యప్ప స్వామి వారి కేరళ సంప్రదాయ కార్తీక మాస మండల పూజా ఉత్సవాలు వేడుకగా జరిగి, ఇటీవల ధ్వజావరోహణంతో ముగిశాయి. స్వామి శరణం అయ్యప్ప.. శరణు ఘోషల మధ్య అయ్యప్పస్వామి మండల పూజలు నిర్వహించిన కేరళ తంత్రులు హరినంబూద్రి కోనేటి పూజలు నిర్వహించి అయ్యప్పస్వామివారికి కోనేటి స్నానం ఆరట్టు ఉత్సవం నిర్వహించారు. పడి కర్పూర పూజ అనంతరం ధ్వజావరోహణం తదుపరి ఆలయ చైర్మన్ గూడల శేషగిరిరావు, కార్యదర్శి కత్తుల వెంకటరత్నం, కోశాధికారి గడ్డం రత్నయ్య, కత్తి మోహన్‌రావు, శంకర, ప్రసాదు, గడ్డం విజయకుమార్ మండల పూజలు పర్యవేక్షించారు.

## టూకీగా...



### జొన్నవాడ ఆలయంలో.. అన్నదానానికి విరాళాలు

జిల్లాలోని పవిత్ర పుణ్యక్షేత్రమైన జొన్నవాడ శ్రీ మల్లికార్జున సమేత కామాక్షితాయి అమ్మవారి దేవస్థానంలో అన్నదానం కోసం చెన్నైకి చెందిన రామిశెట్టి సురేష్-విజయలక్ష్మి దంపతులు ఇటీవల 13 లక్షల రూపాయలను విరాళంగా అందజేశారు. ఆ చెక్కును ఆలయ ఇఓ అర్వభూమి వెంకటశ్రీనివాసులురెడ్డికి అందించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు దాతలకు.. వారి గోత్రనామాలతో ఆలయంలో పూజలు చేయించి, స్వామివార్ల తీర్థప్రసాదాలను అందజేశారు.

### కొండ బిట్రగుంటకు బస్సొచ్చేసింది

బోగోలు మండలం కొండ బిట్రగుంటలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన శ్రీ ప్రసన్న వేంకటేశ్వరస్వామిని దర్శించుకునేందుకు వీలుగా, ప్రతి శనివారం కావలి నుంచి కొండ బిట్రగుంటకు ప్రత్యేక బస్సు ఏర్పాటైంది. ఆర్టీసీ అధికారులు, ఆర్టీసీ రీజనల్ ఛైర్మన్ సన్నపురెడ్డి సురేశ్‌రెడ్డి తొలిసారిగా డిసెంబరు 28వ తేదీ శనివారం నాడు ఆ బస్సుకు జెండా ఊపి ప్రారంభించారు.

### చెముడుగుంటలో కోడిపందెగాళ్ళ అరెస్ట్

వెంకటాచలం మండలం చెముడుగుంటలోని చెరువు వద్ద కోడిపందాల స్థావరంపై పోలీసులు డిసెంబరు 29న దాడిచేసి ఇద్దరిని అరెస్ట్ చేసి, వారివద్ద నుంచి రెండు పందెంకోళ్ళను, 2140 రూపాయలను స్వాధీనం చేసుకున్నారు. వెంకటాచలం సీఐ సుబ్బారావు ఆధ్వర్యంలో పోలీసు సిబ్బంది ఈ దాడిలో పాల్గొన్నారు.

### సంగంలో హెల్మెట్ ధారణపై అవగాహన

సంగంలో ద్విచక్రవాహనాలను నడిపేవారు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని స్థానిక ఎస్ఐ రాజేష్, ఆత్మకూరు మోటార్ వెహికల్ ఇన్స్‌పెక్టర్ రాములు సూచించారు. రోడ్డుప్రమాదాలు తరచూ జరిగే ప్రాంతాలను వారు పరిశీలించారు. ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు పాటించాలని చెప్తూ, కార్లను నడిపేవారు సీట్‌బెల్ట్ పెట్టుకోవాలని చెప్పారు.

### చీపినాపిలో పశువైద్య శిబిరం

కలువాయి మండలం చీపినాపి గ్రామంలో డిసెంబరు 30న జిల్లా పశువైద్య శాఖ డెప్యూటీ డైరెక్టర్ నాగమణి ఆధ్వర్యంలో పశు వైద్యశిబిరం నిర్వహించి, పలు వ్యాధులకు చికిత్సలు చేశారు. ఉచితంగా పశుగ్రాసం పంపిణీ చేశారు. పశుసంవర్ధకశాఖ అధికారిణి అన్నపూర్ణ, డాక్టర్లు పాల్గొన్నారు.

### దుత్తలూరు పీహెచ్‌సీకి వాటర్ ఫిల్టర్

దుత్తలూరు ప్రభుత్వ ప్రాథమిక వైద్యశాలకు డిసెంబరు 30న విశ్రాంత ఐఏఎస్ అధికారి, సీడ్స్ స్వచ్ఛందసంస్థ అధినేత చంద్రమౌళీశ్వరరెడ్డి మినరల్ వాటర్ ఫిల్టర్‌ను తమ వితరణగా అందజేశారు. వైద్యాధికారి అయూబ్, సిహెచ్ఓ ఓంకారయ్య, సూపర్‌వైజర్ ఖాజామొహిద్దీన్, ఏఎన్ఎం మాధవి పాల్గొన్నారు.

### గొలగమూడిలో ఉపాధ్యాయుల శిక్షణ పరిశీలన

వెంకటాచలం మండలంలోని గొలగమూడి వద్దనున్న ఐఐటీఎం కళాశాలలో జరుగుతున్న ఉపాధ్యాయుల శిక్షణా తరగతులను డిఇఓ బాలాజీరావు ఇటీవల పరిశీలించారు. ఆ శిక్షణ ఉపాధ్యాయులకు బాగా ఉపయోగపడుతుందని చెప్పారు. సమగ్ర శిక్ష అకడమిక్ మానిటరింగ్ అధికారి సుధీర్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

### కొత్తూరు సచివాలయాన్ని సందర్శించిన విద్యార్థులు


విద్యాశిక్షణలో భాగంగా ఇటీవల ఇందుకూరుపేట మండలం కొత్తూరు జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు స్థానికంగా ఉన్న సచివాలయాన్ని సందర్శించారు. వారికి ఆన్‌లైన్ అప్లికేషన్, సచివాలయంలోని వివిధ విభాగాల పని తీరును వివరించారు. ఇన్‌చార్జి హెడ్మాస్టర్ సుహాసిని, పంచాయతి కార్యదర్శి శ్రీనివాసులురెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

### మనుబోలు పిహెచ్‌సి తనిఖీ

మనుబోలు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఇటీవల ఎంపీడీవో జలజాక్షి ఆకస్మికంగా తనిఖీ చేశారు. సిబ్బంది పనితీరును ఆరా తీశారు. పిహెచ్‌సీలో మౌలిక వసతుల ఏర్పాటుకు ఏం చేయాలో అడిగి తెలుసుకున్నారు.

## అంతరిక్షంలో మరో అద్భుతం..

# జంట ఉపగ్రహాల ప్రయోగం




***అం**తరిక్షంలో కూడా ఉపగ్రహాలను అనుసంధానం చేసేందుకు, అవసరమైతే విడదీతకు..ఇతరత్రా ప్రయోగాలకు కావాల్సిన సామర్థ్యాన్ని సమకూర్చుకునేందుకు భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) చేసిన తొలిదశ ప్రయోగం విజయవంతమైంది. కొత్త సంవత్సరం రాకముందే 'హ్యాపీ న్యూఇయర్' చెప్పేస్తూ అందరినీ సంతోషింపజేసింది. స్పేస్ డాకింగ్ అనే వినూత్న ప్రయోగంలో భాగంగా శ్రీహరికోట షార్ కేంద్రంలోని మొదటి ప్రయోగ వేదిక నుంచి జంట ఉపగ్రహాలను శాస్త్రవేత్తలు ప్రయోగించారు. పీఎస్ఎల్వీ-సీ60 రాకెట్ ద్వారా ఇస్రో శాస్త్రవేత్తలు ప్రయోగించిన ఈ రాకెట్.. డిసెంబర్ 30వ తేది.. సరిగ్గా రాత్రి 10 గంటలా 15 సెకన్లకు నిప్పులు చిమ్ముకుంటూ నేల నుంచి నింగికి దూసుకుపోయి, ఇస్రో ఖాతాలో మరో అద్భుతమైన విజయాన్ని నమోదు చేసింది. 2024 సంవత్సరం చివరలో చేసిన ఈ ప్రతిష్టాత్మక ప్రయోగం జయప్రదం కావడంతో అటు శాస్త్రవేత్తల్లోనూ, ఇటు దేశవ్యాప్తంగా ప్రజల్లోనూ సంతోషం వెల్లువెత్తింది.*

అంతరిక్షంలో మరో అద్భుతఘట్టం ఆవిష్కృతమైంది. రోదసి పరిశోధనల్లో మన భారతీయ శాస్త్రవేత్తలు మరో ముందడుగు వేస్తూ, రెండు ఉపగ్రహాలను అనుసంధానం చేసే ప్రక్రియలో కూడా తమ ప్రతిభా పాటవాలు చాటుకునేందుకు చేసిన జంట ఉపగ్రహాల ప్రయోగం సఫలీకృతమైంది. పాత ఏడాది (2024) ముగింపుకు వస్తున్న డిసెంబరు 30వ తేదీ సోమవారం నాడు శ్రీహరికోటలోని షార్‌నుంచి ప్రయోగించిన స్పేడెక్స్ జంట ఉపగ్రహాలు విజయవంతంగా కక్ష్యలోకి వెళ్ళాయి. పీఎస్ఎల్వీ-సీ60 రాకెట్ వాటిని నిర్దేశిత కక్ష్యలో విడిచిపెట్టడంతో ప్రయోగం దిగ్విజయమైంది. దీంతో ఇస్రో శాస్త్రవేత్తల కృషిని అభినందిస్తూ సర్వత్రా హర్షాతిరేకాలు వెల్లువెత్తుతున్నాయి. రాకెట్ ప్రయోగం అనుకున్న విధంగానే నాలుగుదశల్లో జరిగింది. స్పేడెక్స్-1 ఏ, స్పేడెక్స్ 1-బీ ఉపగ్రహాలు నిర్దేశిత మార్గంలో పయనించాయి. 470 కిలోమీటర్ల ఎత్తులో, వృత్తాకార కక్ష్యలో, 55 డిగ్రీల వాలులో ఆ ఉపగ్రహాలను ప్రవేశపెట్టడంతో శాస్త్రవేత్తలు ఈ ప్రయోగంలో తొలిదశ విజయం సాధించినట్లయింది. అత్యంత వేగంగా ప్రయాణించే రెండు ఉపగ్రహాలు, ఒకదానికొకటి క్రమంగా నెమ్మదిగా వచ్చి, ఒకదానితో ఒకటి అనుసంధానం కావడమనే అద్భుత ప్రక్రియకు ఈ ప్రయోగం ద్వారా భారత శాస్త్రవేత్తలు శ్రీకారం చుట్టారని చెప్పవచ్చు. ఈ జంట ఉపగ్రహాల్లో అమర్చిన కెమెరాలు భూమి పరిశీలనకు ఎంతగానో తోడ్పడమే కాక, గగన్‌యాన్ వంటి అంతరిక్ష యాత్రలకు కూడా మార్గదర్శకంగా నిలుస్తాయని శాస్త్రవేత్తలు భావిస్తున్నారు. ఇస్రో పూర్తిగా సొంత సాంకేతిక పరిజ్ఞానంతోనే ఈ ప్రయోగం చేయడం విశేషం. అంతరిక్షంలో 'భారత అంతరిక్ష కేంద్రం' ఏర్పాటుకు ఈ స్పేడెక్స్ ప్రయోగం తొలి అడుగుగా కూడా భావిస్తున్నారు.

### ఈ ఏడాది మరిన్ని ప్రయోగాలు:

ఇప్పుడు నింగిలోకి పంపిన స్పేడెక్స్ జంట ఉపగ్రహాలు వారం రోజుల్లోనే పనిచేయడం ప్రారంభిస్తాయని ఇస్రో ఛైర్మెన్ డాక్టర్ సోమనాథ్ తెలిపారు. ప్రయోగ విజయానంతరం ఆయన సూళ్ళూరుపేటలోని గ్రామదేవత శ్రీ చెంగాళ పరమేశ్వరి అమ్మవారిని దర్శించుకున్నారు. ఆతర్వాత ఆయన విలేకర్లతో మాట్లాడుతూ, ఈ కొత్త సంవత్సరం.. 2025 మార్చిలోగా మరికొన్ని ప్రయోగాలకు సిద్ధమవుతున్నామన్నారు. రెండు పీఎస్ఎల్వీ, ఒక జీఎస్ఎల్వీ, రెండు ఎల్వీఎం 3 రాకెట్ ప్రయోగాలు వాటిలో ఉంటాయని కూడా ఆయన చెప్పారు. ఏదేమైనా శ్రీహరికోటలోని షార్ కేంద్రం నుంచి ఇస్రో చేపడుతున్న అనేక రాకెట్ ప్రయోగాలు విజయవంతం కావడం సంతోషదాయకం. 2024 చివరిలో చేపట్టిన ఈ స్పేడెక్స్ జంట ఉపగ్రహాల ప్రయోగం రాకెట్ ప్రయోగాల వరుసలో 99వ ప్రయోగం కావడం విశేషం. అంతేకాదు, ఇస్రోకి రామబాణం వంటి పీఎస్ఎల్వీ రాకెట్ల వరుసలో ఈ ప్రయోగం 62వది కావడం..అంతరిక్ష రంగంలో భారత కీర్తిపతాకాను రెపరెపలాడిస్తూ.. మొత్తం 62 పీఎస్ఎల్వీ రాకెట్ల ప్రయోగాల్లో 60 ప్రయోగాలు దిగ్విజయం కావడం కూడా మరో గొప్ప విశేషం.. భారత శాస్త్రవేత్తలకే కాదు, మొత్తంగా భరతజాతికే ఈ విజయాలు గర్వకారణం!..



## నదుల అనుసంధానంతో..

# పంటలకు.. నీటి పరవళ్లు

**- మంత్రి ఆనం రామనారాయణరెడ్డి**

రాష్ట్రంలో నదుల అనుసంధానానికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు శ్రీకారం చుట్టడం సంతోషదాయకమని, ఆ బృహత్తర కార్యక్రమంతో ప్రతి ఎకరాకు సాగునీరు కొరత లేకుండా అందుతుందని, రాష్ట్రం సస్యశ్యామలమవుతుందని రాష్ట్ర దేవాదాయ ధర్మాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి చెప్పారు. జనవరి 1న ఆయన నెల్లూరు రంగనాయకులపేటలో పెన్నానది గట్టున వెలసివున్న శ్రీదేవి భూదేవి సమేత శ్రీ తల్పగిరి రంగనాథ స్వామివారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, ప్రధాని నరేంద్రమోడీ ఆశీస్సులతో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌లు రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధికి కృషిచేస్తున్నారని, వారందరికీ శ్రీ రంగనాథ స్వామివారి దివ్యాశీస్సులు ఉండాలని ఆయన ఆకాంక్షించారు. నెల్లూరు జిల్లాలోని రామాయపట్నంలో బీపీసీఎల్ కంపెనీ వారి ఆధ్వర్యంలో భారీ రిఫైనరీలు, అనుబంధంగా మరెన్నో పరిశ్రమలు రానున్నాయని ఆయన చెప్పారు. బీపీసీఎల్ రాకతో నెల్లూరు జిల్లా రూపురేఖలే మారిపోతాయన్నారు. తొలుత ఆయనను ఆలయ అర్చకులు, దేవాదాయశాఖ సహాయ కమిషనర్ కోవూరు జనార్ధన్‌రెడ్డి, ఇఓ ఆళ్ళ శ్రీనివాసులురెడ్డి తదితరులు సాదరంగా స్వాగతించి, ఆలయంలో స్వామివారి వద్ద పూజలు చేయించారు.





# 14వ వర్ధంతి

పూజ్యులు, మా ఇంటి దైవం
మా పురోభివృద్ధికి ముఖ్యకారకులు, "మిత్రబంధు"

**శ్రీ నారపరెడ్డి కోదండరామరెడ్డి, M.A. గారు**

(మైపాడు వాస్తవ్యులు)
స్వర్గస్తులై తేది 05-01-2025 నాటికి
14 సంవత్సరాలు నిండనున్న సందర్భంగా

*ఆయన దివ్యస్మృతిని స్మరించుకుంటూ*
*వారి పవిత్రాత్మకు శాంతి కలగాలని భగవంతుని ప్రార్థిస్తూ...*

**శ్రీమతి నారపరెడ్డి సులోచనమ్మ** - భార్య

కుమారులు - కోడళ్ళు
**డాక్టర్ ఎన్.విష్ణుస్వరూప్‌రెడ్డి - డాక్టర్ శాంతి**
**ఎన్.వినోద్‌రెడ్డి - షాలిని**

కుమార్తెలు - అల్లుళ్ళు
**జి.సుప్రియ - జి.విజయసింహారెడ్డి**
**ఎన్.పద్మప్రియ - ఎన్.చంద్రారెడ్డి**

మనుమలు, మనుమరాండ్రు
**జి.అభిషేక్‌రెడ్డి, వైష్ణవి**
**జి.అనుదీప్, భావిక, రాహిల్, రుషిల్ సాకేత్,**
**విషాల్, మేఘన, హర్ష, సంజన, వినూష**

మునిమనుమరాలు - **అమైర, ఆరియ**

CRM IT Customer Success Partner | Fortune Primero | Fortune Summit business park NR Towers, BANGALORE.


Edited, Published, Printed & Owned by **THUNGA SIVAPRABHATH REDDY**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Printed & Published at **Roopa Graphics**, Magunta Layout, NELLORE-3. Cell: 9866314741. Editor-**THUNGA SIVAPRABHATH REDDY,** Managing Editor : **T.BHARATHI REDDY,** Sub-Editor : **MADDURU SRINIVASULU.** e-mail: lawyerpatrika@gmail.com